



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



భారత్‌లో దక్షిణ కొరియా రాయబారి లీ సియోంగ్ హోను సోమవారం న్యూఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలుసుకున్న రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్.

# మానవీయ పాలన

## సహృదయ కోణంలో పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారం... ఆర్టీజీఎస్‌పై సమీక్షలో సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

పీజీఆర్ఎస్ సహా ప్రజలనుంచి వచ్చే అర్జీలను మానవీయ కోణంలో పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఉద్యోగులు, అధికారులు సాఫ్ట్ స్కిల్స్ అలవరచుకోవాలని స్పష్టం చేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంనుంచి వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "ఉద్యోగులు వినూత్నంగా ఆలోచనలు చేసేలా ప్రోత్సహిస్తాం. పనితీరు ఆధారంగా బాధ్యతలు అప్పగిస్తాం. సమస్య పరిష్కారం కోసం అధికారులు, ఉద్యోగుల వద్దకు వచ్చే పౌరులతో సౌమ్యంగా వ్యవహరించాలి" అని దిశానిర్దేశం చేశారు.



2

## open secret

*"నా ఏకైక లక్ష్యం ఉద్యోగాల సృష్టే. ఇదే నన్ను పగలూ రాత్రి నిద్రపోనివ్వకుండా మరింత కష్టపడేలా చేస్తోంది. సీబీఎన్ ఎప్పుడూ 1995నాటి తన టీమ్ గురించి గొప్పగా చెబుతుంటారు. రేపొద్దున ఆయన 2024 టీమ్ ఇంకా అద్భుతమని మా గురించి చెప్పుకునేలా మేం కష్టపడాలి. ఆ సంకల్పంతోనే టీంస్పిరిట్‌గా పరిగెడుతున్నాం"*



**S**peed
**S**tability
**S**ervice

## ఇదే.. మా ఏపీ విజయ రహస్యం

పారిశ్రామికవేత్తలను ఏపీవైపు ఆకర్షిస్తున్న మూడు 'ఎస్'లు.. స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్. ఇవే తమ విజయ రహస్యాలని మంత్రి నారా లోకేష్ ప్రకటించారు. దేశచరిత్రలోనే అతిపెద్ద ఎఫ్‌డీఐ అయిన గూగుల్ డేటా సెంటర్ కేవలం 13 నెలల్లో, ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ 17 నెలల్లో పనులు మొదలుపెట్టడం ఏపీ వేగానికి నిదర్శనమన్నారు. 2047 నాటికి ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న సీఎం చంద్రబాబు నాయుడి విజన్‌కు అనుగుణంగా రేయింభవళ్లు పనిచేస్తున్నానని, ఉద్యోగాల సృష్టే తన ఏకైక లక్ష్యమని న్యూఢిల్లీలో రిపబ్లిక్ టీవీ కాంక్లేవ్‌లో లోకేష్ విస్పష్టంగా ప్రకటించారు.

3

## బసవతారకం..
# పేదల గుండెధైర్యం!


- అమరావతికీ క్యాన్సర్ వైద్య సేవ విస్తృతం
- రజతోత్సవ వేడుకల్లో సీఎం చంద్రబాబు భావోద్వేగ ప్రసంగం
- అమరావతిలో వెయ్యి పడకల ఆస్పత్రికి బాలకృష్ణ ముందడుగు
- 25 ఏళ్లలో 3 లక్షలమంది రోగులకు అండగా నిలిచిన సేవా సంస్థ



6


## స్వర్ణాంధ్ర లక్ష్యాలపై
# ఎంఓయూ

- ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్‌తో ఒప్పందం
- 15 శాతం వృద్ధిరేటు లక్ష్యమన్న ముఖ్యమంత్రి చంద్రబాబు



2

స్వర్ణాంధ్ర 2047పై ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్‌తో ఎంవోయూ కుదిరిన సందర్భంలో సీఎం చంద్రబాబు నాయుడు.




8

## గత ప్రభుత్వంలో
# వ్యవస్థలన్నీ పతనం

- చట్టాన్ని ఉల్లంఘించిన వారిని వదిలేది లేదు
- టీడీపీ ప్రతీకార రాజకీయాలు ప్రోత్సహించలేదు
- పాదయాత్రలోనే ప్రజా సమస్యలు అర్థం చేసుకున్నా
- పరీక్షల నిర్వహణలో కాలానుగుణం సంస్కరణలు
- రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీపడబోం
- టీడీపీ కాలపరీక్షను తట్టుకుని నిలిచింది
- ఫార్చ్యూన్ 500 కంపెనీలకు 99 పైసలకే భూమి
- ఢిల్లీలో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ అడ్డాలో మంత్రి లోకేష్

## మరణంలేని ఆశయమిది!

- డబ్బులేమితో క్యాన్సర్ వైద్యానికి ఎవ్వరూ దూరంకాకూడదు
- 'బసవతారకం' ఆస్పత్రి వజ్రోత్సవంలో చైర్మన్ బాలకృష్ణ భరోసా

7

### అమ్మ ఆనందం.. పిల్లలకు ఆయుక్షేమం!




5

పుట్టినరోజు కేకులోని ఆనందాన్ని తనతో పంచుకున్న ఈ చిన్నారులే తన అసలైన కానుక అంటున్నారు భువనమ్మ. తలసేమియా చిన్నారుల నవ్వులే ఆమె జన్మదిన వేడుకకు అలంకారమయ్యాయి. ఉచిత రక్తమార్పిడి, మందులతో వందలాది పిల్లలకు ఆశాదీపంగా వెలుగుతున్న ఆ అమ్మకు... ఎన్టీఆర్ ట్రస్ట్ తలసేమియా కేర్ సెంటర్ పిల్లలతో పంచుకున్న ఈ క్షణం –జీవితంలో అత్యంత విలువైన పుట్టినరోజు బహుమతి.

చైతన్యరథం

# మానవీయ కోణంలో పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారం

## - ఆర్టీజీఎస్‌పై సమీక్షలో సీఎం చంద్రబాబు దిశానిర్దేశం






అమరావతి (చైతన్య రథం): పీజీఆర్ఎస్ సహా ప్రజలనుంచి వచ్చే అర్జీలను మానవీయ కోణంలో పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఉద్యోగులు, అధికారులు సాఫ్ట్ స్కిల్స్ అలవరచుకోవాలని స్పష్టం చేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "ఉద్యోగులు వినూత్నంగా ఆలోచనలు చేసేలా ప్రోత్సహిస్తాం. పనితీరు ఆధారంగా బాధ్యతలు అప్పగిస్తాం. అర్జీదారుల స్థానంలో ఉండి ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి సారించాలి. సమస్య పరిష్కారం కోసం అధికారులు, ఉద్యోగుల వద్దకు వచ్చే పౌరులతో సౌమ్యంగా వ్యవహరించాలి. దీనిద్వారా పాలనపై ప్రజల్లో మంచి భావన కలుగుతుంది. మానవ వనరులను సద్వినియోగం చేసుకోవాలి. ఎప్పటికప్పుడు ఉద్యోగులు పాలనాపరంగా సామర్థ్యాలను పెంచుకోవాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా పని విధానం మార్చుకోవాలి. క్షేత్రస్థాయిలో పర్యటిస్తేనే వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోగలుగుతాం. మంత్రులు, అధికారులు, ఉద్యోగులు క్షేత్రస్థాయి పర్యటనలకు ప్రాధాన్యమివ్వాలి. ఏపీకి బలమైన మానవ వనరుల వ్యవస్థ అవసరం. పాలనలో సంస్కరణలపై ఉద్యోగులకు, అధికారులకు శిక్షణ ఇప్పించాం. పాత రోజుల్లో ఫైళ్ల క్లియరెన్స్ అనేది అతి పెద్ద టాస్క్‌గా ఉండేది. టెక్నాలజీ అందుబాటులోకి వచ్చాక సులభంగా వాటిని క్లియర్ చేయగలిగే పరిస్థితి ఉంది. వినూత్నంగా ఆలోచన చేయకపోతే వ్యవస్థలు నిర్వీర్యమవుతాయి" అని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

### పాత కేసుల ట్రేసింగ్

"రాష్ట్రంలో కుట్రలు పన్నే పార్టీలున్నాయి. ప్రతి అంశాన్నీ రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. వివిధ సంఘటనలకు కులం, మతం అనే రంగు పులుముతున్నారు. వాటిని వివాదాస్పద అంశాలుగా మార్చేస్తున్నారు. ఫేక్ ప్రచారం చేస్తూ ఉద్యోగులను, అధికారులను బద్నాం చేస్తున్నారు. ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ దుష్ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి విషయాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలి. తప్పుడు ప్రచారాలను, విద్వేషాలు పెంచే ఘటనల్ని కంట్రోల్ చేసేలా ఉద్యోగులు, అధికారులు అప్రమత్తతతో వ్యవహరించాలి. ఇటీవల కాలంలో మానసిక సమస్యల కారణంగా కూడా కొంత మంది నేరాలకు పాల్పడుతున్నారు. డ్రగ్స్, గంజాయిలకు అలవాటు పడి తప్పు దారి పడుతున్నారు. పాత కేసులను పరిష్కరిస్తున్నాం. 2019లో జరిగిన కొన్ని నేరాలను ఇప్పుడు ట్రేస్ చేసి పట్టుకుంటున్నారు. శిక్షలు కూడా పడుతున్నాయి. ఇలాంటివి ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. తప్పు చేసిన వాడు ఎప్పుడూ తప్పించుకోలేడు. వాహనాల నెంబర్ ప్లేట్ల విషయంలో నిబంధనలను పక్కాగా పాటించాలి. ప్రమాణాల ప్రకారం నెంబర్ ప్లేట్లు అమర్చుకోవాలి. డిసెంబర్ నెలలో క్వాంటం కంప్యూటర్ లాంఛ్ చేయాల్సి ఉంది. ఈలోగా క్వాంటం పార్కు, సెమీ కండక్టర్ల పార్క్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలో పచ్చదనం పెంపు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, నీటి భద్రత, భూగర్భ జలాల పెంపు, నీటి వనరుల సంరక్షణ, నదీ జలాలను కాలుష్యంనుంచి కాపాడడం వంటి అంశాలకు ప్రాధాన్యమివ్వాలి" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సమావేశంలో సీఎస్ సాయిప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని సచివాలయంలో కర్నాటక రాష్ట్ర మాజీమంత్రి ఎన్ఎస్ బోసురాజు, ఎమ్మెల్యే బసవరాజు, ఎమ్మెల్సీ బసవన్న గౌడ కలిశారు. ఈనెల 25న తుంగభద్ర ప్రాజెక్టు కొత్తగేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరవ్వాలని కోరుతూ సీఎంకు ఆహ్వానపత్రిక అందించారు. అనంతరం సీఎంతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు.



స్వర్ణాంధ్ర లక్ష్యాలపై

# ప్రణాళికా విభాగం ఎంఓయూ

**- ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్‌తో ఒప్పందం**

**- 15 శాతం వృద్ధిరేటు లక్ష్యమన్న ముఖ్యమంత్రి చంద్రబాబు**



అమరావతి (చైతన్య రథం): స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో భాగంగా 15 శాతం వృద్ధిరేటు లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 2014-19 మధ్య 13.5 శాతంమేర సీఏజీఆర్ సాధించామని.. వివిధ కారణాలవల్ల ప్రస్తుతం 11 శాతం మేర వృద్ధి రేటు నమోదైందని తెలిపారు. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో రాష్ట్ర ప్రణాళికా విభాగం- కేఆర్ఈఏ యూనివర్సిటీ ఆధ్వర్యంలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాల సాధనలో పది సూత్రాల అమలుపై ఈ ఎంఓయూ కుదుర్చుకున్నారు. రాష్ట్ర ప్రణాళికా విభాగం ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, ఐఎఫ్ఎంఆర్ సంస్థ ప్రతినిధి కపిల్ విశ్వనాథన్ ఒప్పందాలు మార్చుకున్నారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి, వృద్ధిరేటు సాధనలో పది సూత్రాల మిషన్ సెల్స్ ఏర్పాటుతోపాటు కార్యక్రమం అమలుపై ఐఎఫ్ఎంఆర్ సంస్థ పర్యవేక్షణ చేయనుంది. జీరో పావర్టీ మిషన్, వాటర్ సెక్యూరిటీ, డీప్ టెక్ మిషన్లపై ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ రీసెర్చి సంస్థ రాష్ట్రంలో ప్రభుత్వంతో పనిచేయనుంది. ఈ ఒప్పందంలో భాగంగా క్షేత్రస్థాయిలో అధ్యయనం, విధాన పరమైన సూచనలు అందిస్తుంది. ఈ 10 సూత్రాలకు సంబంధించి కొత్త పద్ధతులకు సిఫారసు చేస్తుంది. తదుపరి దశల్లో మిగిలిన అంశాలపై పనిచేయాలని నిర్ణయించారు. పది సూత్రాల అమలుపై రాష్ట్రస్థాయి కమిటీతోపాటు మిషన్ వర్కింగ్ గ్రూప్‌లను కూడా ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలోని వివిధ రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు డీప్ టెక్‌ను ఇంటిగ్రేషన్ చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఏఐ స్కిల్లింగ్, డ్రోన్ మ్యాపింగ్ ఆటోమొబైల్, మెటల్స్, స్టీల్, రేర్ ఎర్త్ మినరల్స్, సెమీ కండక్టర్స్, డిఫెన్స్‌లాంటి రంగాల్లో ప్రాజెక్టులు ఏపీకి వచ్చాయన్నారు. ఏఐ, క్వాంటం టెక్నాలజీని కూడా రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి పయ్యావుల కేశవ్, కేఆర్ఈఏ, ఐఎఫ్ఎమ్ఆర్ ప్రతినిధులు, ప్రణాళికా విభాగం అధికారులు హాజరయ్యారు.



# స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్...
# ఇవే మా విజయ రహస్యాలు!

- **2028నాటికి అమరావతిలో ప్రభుత్వ భవనాలన్నీ సిద్ధం చేస్తాం**
- **ఏపీకి అమరావతి ఎకనామిక్ పవర్‌హౌస్‌గా మారాలన్నదే లక్ష్యం**
- **ఐటీ, ఏఐ, క్వాంటం... అంతా చంద్రబాబే... నా డ్యూటీ ఎగ్జిక్యూషన్ మాత్రమే**
- **మేం ప్రాంతీయ పార్టీయే అయినా జాతీయ భావంతోనే పనిచేస్తాం**
- **2047నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా మార్చడమే బాబు విజన్**
- **రిపబ్లిక్ టీవీ కాంక్లేవ్‌లో మంత్రి నారా లోకేష్ మనోగతం**

న్యూఢిల్లీ (చైతన్య రథం): "పారిశ్రామికవేత్తలు ఏపీవైపు మొగ్గుచూపడానికి మూడు "ఎస్"లు ప్రధాన కారణం. స్పీడ్ (వేగం), స్టెబిలిటీ (స్థిరత్వం), సర్వీస్ (సేవ)... ఈ మూడే మా విజయ రహస్యాలు. దేశచరిత్రలోనే అతిపెద్ద ఎఫ్‌డీఐ గూగుల్ డేటా సెంటర్ కేవలం 13 నెలల్లో పనులు ప్రారంభించింది. ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ 17 నెలల్లో, స్వదేశీ ఫైటర్ జెట్స్ తయారీ ప్రాజెక్టు ఏఎంసీఏ 37 రోజుల్లో పనులు ప్రారంభించాయి. ఆ వేగమే ఏపీని దేశంలో ప్రత్యేకంగా నిలబెడుతుంది" అని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో రిపబ్లిక్ టీవీ నిర్వహించిన కాంక్లేవ్‌కు అతిధిగా హాజరైన మంత్రి లోకేష్.. రిపబ్లిక్ టీవీ చీఫ్ ఎడిటర్ ఆర్నబ్ గోస్వామి అడిగిన ప్రశ్నలకు సూటిగా, స్పష్టంగా సమాధానాలిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... 2047నాటికి ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే స్పష్టమైన విజన్ ముఖ్యమంత్రికి ఉంది. ఆయనకి ఎప్పుడూ పనులు వేగంగా జరిగిపోవాలి. అలాంటి బాస్ ఉన్నప్పుడు, ఆయన వేగాన్ని అందుకోవడం చాలా కష్టమేనన్నారు. "నా ఏకైక లక్ష్యం ఉద్యోగాల సృష్టే. ఇదే నన్ను పగలు, రాత్రి నిద్రపోనివ్వకుండా మరింత కష్టపడేలా చేస్తోంది" అని చెప్పారు. కాంక్లేవ్ సందర్భంగా మంత్రి లోకేష్ అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

**రిపబ్లిక్ టీవీ కాంక్లేవ్‌లో ఆర్నబ్ ప్రశ్నలు - మంత్రి లోకేష్ సమాధానాలు**

**ఆర్నబ్ గోస్వామి:** మీ నాన్నగారు కేంద్ర రాజకీయాల్లో కీలకంగా ఉన్నప్పటి నుంచి నాకు పరిచయం ఉంది. అది బహుశా 90ల చివర్లో అనుకుంటా. అప్పట్లో మాలాంటి రిపోర్టర్లతో చంద్రబాబు చాలామంచిగా ఉండేవారు. మేం ఏదైనా అడిగేయగల చనువుండేది. మా ప్రశ్నలు కాస్త విసుగు తెప్పించేలా ఉండేవి. అయినా సరే, ఆయన మా కోసం ఎప్పుడూ టైమ్ కేటాయించేవారు. మిమ్మల్ని ఈ వేదికమీద చూస్తుంటే నాకు ఆ పాత రోజులన్నీ గుర్తొస్తున్నాయి. మీలో మీ నాన్నగారి పోలికలు కనిపిస్తున్నాయి. కొత్తతరం పాలనకు ప్రతిరూపంగా నిలుస్తున్న మీతో ఇలా వేదిక పంచుకోవడం చాలా సంతోషంగా ఉంది. లోకేష్‌ను ఇక్కడికి తీసుకురావడానికి ముఖ్య కారణం ఆయన ముున్ముందు చాలా విజయాలు సాధించబోతున్నాడన్న నమ్మకమే. ఆయనతో మాట్లాడి ఆయన్ని అర్థం చేసుకునే అవకాశం నాకు దొరికింది. అందుకే లోకేష్, జనాలు మిమ్మల్ని ఇంకాస్త దగ్గరగా తెలుసుకోవాలని భావిస్తున్నాను. ఆయన చుట్టూ ఒక ప్రత్యేకమైన ఆకర్షణ (ఎక్స్-ఫ్యాక్టర్) ఉంది. ఇక్కడ ఎక్కువగా బయట కనిపించని, దేశం కోసం అద్భుతాలు చేస్తున్న వ్యక్తులున్నారు. గ్లోబల్ రేంజ్‌లో ఉన్న టీవీఎస్ (టీవీఎస్) కంపెనీని నడుపుతున్న సుదర్శన్ వేణు ఉన్నారు. ఆయన జాతీయ వేదికల మీద పెద్దగా కనిపించరు. అలాగే జోహో ద్వారా అద్భుతాలు సృష్టిస్తున్న శ్రీధర్ వేంబు ఉన్నారు. ఐఐటీ మద్రాస్‌ను టెక్నాలజీ హబ్‌గా మార్చిన ప్రొఫెసర్ కామకోటి రానున్నారు. నా దృష్టిలో వీళ్లంతా ఒకే కోవకు చెందినవాళ్లు. ఒక చిన్న ప్రశ్నతో లోకేష్‌తో సంభాషణ మొదలుపెడతాను.

**ఇన్ని సంవత్సరాలుగా రాజకీయాల్లో ఉన్నారు. ప్రస్తుతం మీ రాజకీయ ప్రయాణం ఎలా సాగుతోంది? గడిచిన పదేళ్లను ఎలా చూస్తారు? రాబోయే పదేళ్లకు మీ విజన్ ఏంటి?**

**నారా లోకేష్:** వ్యక్తిగతంగా చెప్పాలంటే, ఇదొక అద్భుతమైన ప్రయాణం. మీరు చెప్పినట్టు, ఇదొక జర్నీ మాత్రమే, డెస్టినేషన్ కాదు. నేను ఇప్పుడే ఏ స్థాయిలో ఉన్నానో చెప్పడం కరెక్ట్ కాదు. దేవుడి దయ, ప్రజల ఆశీస్సులుంటే నాకింకా 40-50 ఏళ్ల రాజకీయ భవిష్యత్తు ఉందని నమ్ముతున్నాను. గత పదేళ్లు నాకు చాలా సంతృప్తినిచ్చాయి. ఎన్నో ఎత్తుపల్లాలు చూశాను. విజయాలు వచ్చినప్పుడు ఎంత బ్యాలెన్స్‌డ్‌గా ఉన్నానో, పరాజయాలనూ అంతే సమానంగా తీసుకున్నాను. లోకేష్ ఎప్పుడూ ఒకేలా ఉన్నాడు. అందులో ఎలాంటి మార్పూ లేదు. కానీ మన దేశానికి ఇప్పుడు గొప్ప అవకాశాలు ఉన్నాయని నేను భావిస్తున్నాను. ఈ సమయంలో యువ నాయకులు ముందుకొచ్చి, బాధ్యతలు భుజానికెత్తుకుని తమ సామర్థ్యాన్ని చూపించాలి. నా రాజకీయ ప్రయాణంలో నేను చేయాలనుకుంటున్నది అదే.

**ఆర్నబ్ గోస్వామి: మరి ఇప్పుడు మీరు ఏం చేయబోతున్నారు? మీ దృష్టంతా పని చేయించడంలోనే (ఎగ్జిక్యూషన్) ఉంటుందని గతంలో నేను మీతో మాట్లాడినప్పుడు అర్థమైంది. కాబట్టి ఇప్పుడు మీరు లక్ష్యంగా పెట్టుకున్న ఆ ఒక్క పెద్ద ప్రాజెక్ట్ ఏంటి?**

**నారా లోకేష్:** నేను పని చేస్తున్న ప్రాజెక్టులు చాలానే ఉన్నాయి. కాబట్టి ఒకటే ప్రాజెక్ట్ అని చెప్పలేను. 2047నాటికి ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే స్పష్టమైన విజన్ మా ముఖ్యమంత్రికి ఉంది. ఆయనకి ఎప్పుడూ పనులు వేగంగా జరిగిపోవాలి. అలాంటి బాస్ ఉన్నప్పుడు, ఆయన వేగాన్ని అందుకోవడం చాలా కష్టమే. కానీ నేను ఆ ప్రయత్నంలోనే ఉన్నాను. ప్రస్తుతం నేను రెండు ముఖ్యమైన శాఖలు చూస్తున్నాను. ఒకటి భారత్ పోర్ట్‌ఫోలియో (విద్య), రెండోది ఇండియా పోర్ట్‌ఫోలియో (పెట్టుబడులు ఆకర్షించడం, ఉద్యోగాల సృష్టి). ఈ రెండింటిలోనూ నేను చేస్తున్న పని ఏపీని మిగతా రాష్ట్రాలకంటే భిన్నంగా నిలబెడుతుంది. అలాగే దేశానికి ఒక కొత్త బెంచ్‌మార్క్ క్రియేట్ చేస్తుంది.

**ఆర్నబ్ గోస్వామి: మరి మీ బాస్ మీకు పెట్టిన టార్గెట్ ఏంటి?**

**నారా లోకేష్:** ఆయన ఆలోచన చాలా క్లియర్. మనం 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీకి చేరుకోవాలి. అంటే.. మనం ఏటా 15శాతం (సీఏజీఆర్) వృద్ధి సాధించాలి. దీనికి అన్ని శాఖల మధ్య సమన్వయం ఉండాలి. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనకు ఏర్పాటు చేసిన మంత్రుల బృందానికి నేనే ఛైర్మన్‌ను. కాబట్టి, ఇప్పుడు నా ఏకైక లక్ష్యం ఉద్యోగాల సృష్టే. ఇదే నన్ను పగలు, రాత్రి నిద్రపోనివ్వకుండా మరింత కష్టపడేలా చేస్తోంది.

**ఆర్నబ్ గోస్వామి: ఇందాక అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ వచ్చారు. అందరూ పెట్టుబడుల గురించే మాట్లాడుతున్నారు. అసలు పెట్టుబడులు పెట్టడానికి ఏపీకి ఉన్న ప్రత్యేకత ఏంటి?**

**నారా లోకేష్:** నేను మూడు 'ఎస్'ల గురించి చెబుతాను. పారిశ్రామికవేత్తలు ఏపీవైపు మొగ్గుచూపడానికి మూడు "ఎస్"లు ప్రధాన కారణం. స్పీడ్ (వేగం), స్టెబిలిటీ (స్థిరత్వం), సర్వీస్ (సేవ)... ఈ మూడే మా విజయ రహస్యాలు. దేశచరిత్రలోనే అతిపెద్ద ఎఫ్‌డీఐ గూగుల్ డేటా సెంటర్ కేవలం 13 నెలల్లో పనులు ప్రారంభించింది. ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ 17 నెలల్లో, స్వదేశీ ఫైటర్ జెట్స్ తయారీ ప్రాజెక్టు ఏఎంసీఏ 37 రోజుల్లో పనులు ప్రారంభించాయి. ఆ వేగమే ఏపీని దేశంలో ప్రత్యేకంగా నిలబెడుతుంది. రెండోది స్టెబిలిటీ. మా నాయకుడికి ఒక మంచి ట్రాక్ రికార్డ్ ఉంది. ఆయన తీసుకొచ్చిన విధానాలు ఎప్పటికీ ఏపీని ప్రత్యేకంగా నిలబడతాయి. మేం వాటిని అమలు చేసి చూపించాం కూడా. మూడోది సర్వీస్. వ్యాపారవేత్తలను నేను దేశ నిర్మాతలుగా చూస్తాను. వారు ఉద్యోగాలు ఇస్తారు, దేశాన్ని నిర్మిస్తారు. రాజకీయ నాయకుడిగా మీకు సేవచేసి, ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నదే నా ఉద్దేశం. ఈ మూడు 'ఎస్'లే ఏపీని ఇతర రాష్ట్రాలకంటే భిన్నంగా చూపిస్తున్నాయి. అందుకే ఈరోజు దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో 25శాతం కేవలం ఏపీకే వస్తున్నాయి. ఇది ఏపీని దేశంలోనే ప్రత్యేకంగా నిలబెడుతోంది.

**ఆర్నబ్ గోస్వామి:** అప్పటికీ ఇప్పటికి వ్యాపారానికి, రాజకీయాలకు మధ్య ఉన్న సంబంధంలో వచ్చిన మార్పేంటి? మీ జనరేషన్ వాళ్లు దీన్ని ఎలా చూస్తున్నారు? అప్పట్లో ఉన్నట్లు ఇప్పుడు పరాన్న జీవిత్వం, ఆశ్రిత పక్షపాతం లేవు. కేవలం పనితీరు (పెర్ఫార్మన్స్) మీదే ఆధారపడి ఉంది కదా?

**నారా లోకేష్:** అవును అర్నాబ్ జీ, ఒక నాయకుడితో 15-20 ఏళ్లు కలిసి ప్రయాణించాక, మనమంతా ఆయనకు కార్బన్ కాపీలా మారిపోతాం. ఆ వర్క్ కల్చర్ మనకూ వస్తుంది. మేం ప్రాంతీయ పార్టీ అయినా ఎప్పుడూ దేశం గురించే ఆలోచించాం. మా విధానాలవల్ల దేశానికి లాభం చేకూరింది. వ్యాపారవేత్తలు దేశ నిర్మాతలు, వాళ్లు జాబ్స్ ఇస్తారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిర్మిస్తారు. అయితే, వాళ్ల పెట్టుబడుల కోసం ఏపీ మాత్రమే కాదు, అన్ని రాష్ట్రాలూ పోటీ పడుతున్నాయి. నేను మాత్రం నా మూడు 'ఎస్'లతో వాళ్లను ఆకర్షిస్తున్నాను. ఏపీలో పెట్టుబడులు పెడుతున్న సంస్థలు చాలా పెద్దవి. వాళ్లకు అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయం కావాలి. నేను చేస్తోంది అదే. వాళ్ల ప్రాజెక్ట్ స్టేటస్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తాను. ఎందుకంటే వాళ్లు పెట్టుబడులు పెడితేనే మా దగ్గర ఉద్యోగాలు వస్తాయి. స్థానికంగా ఆర్థిక వృద్ధి సాధ్యమవుతుంది.

**ఆర్నబ్ గోస్వామి: నాది మరొక సూటి ప్రశ్న ఉంది. ఎన్డీయేలో మీరే అత్యధిక ఎంపీలున్న మిత్రపక్షం కాబట్టి, మీకు ఢిల్లీలో స్పెషల్ ట్రీట్‌మెంట్ దొరుకుతోందన్న ప్రచారం ఉంది. ఇది నిజమేనా? ఇంకో విషయమేంటంటే.. అమరావతికి నిధులన్నీ కేంద్రం నుంచే వస్తున్నాయని ఢిల్లీలో ఒక టాక్ ఉంది. కానీ అది నిజం కాదని, రాష్ట్రమే సొంతంగా నిధులు సమకూర్చుకుందని నేను విన్నాను. దీనిపై మీరు క్లారిటీ ఇస్తారా?**

**నారా లోకేష్:** అర్నాబ్ జీ, ఎక్కువమంది ఎంపీలుంటే మన మాట గట్టిగా వినిపించడానికి కచ్చితంగా ఉపయోగపడుతుంది. కానీ దానివల్ల రాష్ట్రానికి, నాకు ఏంలాభం కలిగింది? ప్రధానితో కలిసి డిన్నర్ చేసే అవకాశం దొరికింది. మోదీ చాలా ప్రేమగా ఆతిథ్యమిచ్చారు. ఆయన విజన్ ఏమిటో నాకు అర్థమైంది. కేంద్రం అద్భుతమైన పాలసీలు తీసుకొస్తోంది. ఆయన దిశానిర్దేశం చేస్తున్నారు, కానీ ఆచరణలో పెట్టాల్సింది రాష్ట్రాలే. ఆ విషయంలో ఏపీ మిగతా రాష్ట్రాలకంటే చాలా వేగంగా ముందుకెళ్తోంది. అందుకే మాకు తగిన గుర్తింపు వస్తోంది. ఇతర రాష్ట్రాలు సైలెంట్‌గా ఉన్నప్పుడు, నేను డిఫెన్స్ మినిస్టర్ దగ్గరికి వెళ్లి 'మాకు ప్రాజెక్ట్ ఇవ్వండి, మా దగ్గర భూమి రెడీగా ఉంది' అని అడిగితే ఆయనెందుకు కాదంటారు? 37 రోజుల్లోనే 600 ఎకరాల భూమి ఇచ్చాం. దానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా తీసుకోలేదు. అదే మా స్పీడ్. ప్రధాని కూడా ఇలా స్పీడ్‌గా పనిచేసే రాష్ట్రాలవైపే చూస్తున్నారు. రాష్ట్రాలు పోటీ పడితేనే దేశం గెలుస్తుందని నా నమ్మకం. అమరావతి విషయానికొస్తే..

*తరువాయి 4లో..*

చైతన్యరథం



# స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్... ఇవే మా విజయ రహస్యాలు!

(3వ పేజీ తరువాయి..)

ప్రాజెక్ట్ మొదలుపెట్టడానికి వాళ్లు మొదట 12-13 వేల కోట్ల స్టార్టప్ క్యాపిటల్ ఇచ్చారు. కానీ అది కేవలం ప్రారంభం మాత్రమే. మేమే సొంతంగా నిధులు సమకూర్చుకుంటున్నాం. ఇదొక సెల్ఫ్-ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్. దేశం గర్వపడేలా ప్రపంచస్థాయి నగరాన్ని నిర్మిస్తున్నాం. ఇకపై మనం విదేశాల్లోని నగరాల గురించి కాదు, ఇండియాలోని అమరావతి గురించే మాట్లాడుకుంటాం. అదే మమ్మల్ని మిగతా రాష్ట్రాలకంటే ప్రత్యేకంగా నిలబెడుతుంది.

**ఆర్నబ్ గోస్వామి: స్టార్టప్ క్యాపిటల్ కాకుండా మీరెంత ఫండ్స్ రైజ్ చేశారు? ఇంత పెద్ద ప్రాజెక్ట్‌ను పూర్తి చేయడానికి మీకున్న పట్టుదల, దానికి పెట్టుకున్న టైమ్‌లైన్ గురించి తెలుసుకోవాలనుకుంటున్నాను. ఎన్నికల కోసమే రాజకీయ నాయకులు పనులు పూర్తి చేస్తారన్న విమర్శలుంటాయి కదా, దానిపై మీరేమంటారు?**

**నారా లోకేష్:** మీ ప్రశ్నకు సమాధానం చెబుతాను. ప్రాజెక్టులన్నీ రీస్టార్ట్ చేసినందున, మేం ప్రధానికి ఓ మాట ఇచ్చాం. 2028 నాటికి అమరావతిలోని అసెంబ్లీ, సెక్రటేరియట్, హైకోర్టులాంటి ప్రభుత్వ భవనాలన్నీ సిద్ధం చేస్తాం. ఇది మేం ఇచ్చిన మాట, కచ్చితంగా నిలబెట్టుకుంటాం. ఇక రాజధాని కోసం 60వేల కోట్లు సేకరించబోతున్నాం. కేవలం ప్రభుత్వ భవనాలే కాదు. ఇప్పటికే బిట్స్ (బిఐటిఎస్) వాళ్లు తమ క్యాంపస్ నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది అడ్మిషన్లు కూడా స్టార్ట్ అవుతాయి. వేగంగా అభివృద్ధి జరుగుతోంది. ఆసుపత్రులు, హోటళ్లు, ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ అన్నీ వస్తున్నాయి. అమరావతి కేవలం ప్రభుత్వ కార్యకలాపాలకే పరిమితం కాకుండా, ఏపీకి ఒక ఆర్థిక శక్తిగా (ఎకనామిక్ పవర్‌హౌస్‌గా) మారాలన్నదే మా లక్ష్యం. నేను ఇందాక చెప్పిన 2.4 ట్రిలియన్ డాలర్ ఎకానమీ అనేది ఒకే నగరంతో సాధ్యం కాదు. అందుకే విశాఖపట్నం, అమరావతి, తిరుపతిలను వేర్వేరు ఆర్థిక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తున్నాం. విశాఖను ఐటీ, డేటా సెంటర్లకు కేరాఫ్‌గా మార్చుతున్నాం. అమరావతిలో క్వాంటం ఎకోసిస్టమ్ డెవలప్ చేస్తున్నాం. ఇక రాయలసీమ (తిరుపతి ప్రాంతం)లో మాన్యుఫ్యాక్చరింగ్ (తయారీ) రంగాన్ని ప్రోత్సహిస్తున్నాం. రాజధాని అమరావతే అయినా, మిగతా రాష్ట్రాన్ని కూడా సమానంగా అభివృద్ధి చేస్తున్నాం.

**నిరంజన్ (వ్యాఖాత): లోకేష్, జస్ట్ క్యాజువల్‌గా అడుగుతున్నా, గతంలో మేం మాజీ ముఖ్యమంత్రిని పిలవడానికి వైజాగ్ వెళ్లినప్పుడు, అక్కడి రోడ్లు చాలా ఘోరంగా ఉన్నాయి. కొత్త రాజధానులు కట్టే హడావుడిలో అసలు విషయాలు మర్చిపోయారు. ఇంకో విషయం ఏంటంటే, ఎన్డీయే-1 సమయంలో ఉన్న టీడీపీకి, ఇప్పటి టీడీపీకి చాలా తేడా ఉంది. అప్పట్లో మీ ఎంపీలు చాలామంది వయసు పైబడిన వాళ్లు, వివాదాలు కూడా ఉండేవి. కానీ ఇప్పుడు మీ ఎంపీలు చాలా యంగ్‌గా ఉన్నారు. 40 ఏళ్ల వాళ్లే ఇక్కడ యూత్ లీడర్స్ అని చెప్పుకుంటుంటే, మీ ఎంపీల్లో 30 ఏళ్ల వారున్నారు. పార్టీలో మార్పుకోసం ఇది మీరు కావాలని చేస్తున్న పనా? దీనివల్ల మీకు వర్కౌట్ అవుతోందా?**

**నారా లోకేష్:** ఏ రాజకీయ పార్టీకైనా కొన్ని మార్పులు తప్పవు. మా వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు డాక్టర్లు, ఇంజనీర్లను రాజకీయాల్లోకి తీసుకొచ్చారు. వాళ్లు 40 ఏళ్లపాటు పార్టీని నడిపించారు. ఇప్పుడు కొత్తతరం నాయకత్వం రావాలని వాళ్లే చాలాసార్లు చెప్పారు. మేం ఆ మార్పే చేశాం. గత ఎన్నికల్లో గెలిచిన మా ఎమ్మెల్యేల్లో 50శాతం మంది, మంత్రుల్లో 17మంది ఫస్ట్ టైమర్లే. మన దేశంలోనే అత్యంత పిన్న వయస్కులైన పార్లమెంటరీ బృందం మాదే. రామ్మోహన్ నాయుడు చరిత్రలోనే అత్యంత పిన్న వయస్కుడైన క్యాబినెట్ మంత్రి. యువత ఆకాంక్షలు రాజకీయాల్లో ప్రతిబింబించాలంటే ఈ మార్పు చాలా అవసరం. మేం ప్రాంతీయ పార్టీయే అయినా జాతీయ భావంతోనే పనిచేస్తాం.

**నిరంజన్ (వ్యాఖ్యాత): మీ ఫాదర్ ఏపీకి 'ఐటీ'ని పరిచయం చేసిన వ్యక్తిగా పేరు తెచ్చుకున్నారు. ఆయన చాలా ప్రోగ్రెసివ్ అని అందరికీ తెలుసు. ఇప్పుడు మీరు కూడా అదే దారిలో 'ఏఐ'ని ప్రమోట్ చేస్తున్నారు. చంద్రబాబు ఐటీ అయితే, లోకేష్ ఏఐ అన్నమాట. ఇది మీ ప్లాన్ ప్రకారం జరుగుతోందా? మీకు ఇదెంత ముఖ్యం?**

**నారా లోకేష్:** మా ముఖ్యమంత్రి గురించి తెలిసిన వాళ్లకి అర్థమవుతుంది, ఆయన మా కోసం క్రెడిట్ ఏమీ వదిలిపెట్టరు. ఐటీ ఆయనే, ఏఐ ఆయనే, క్వాంటం కూడా ఆయనే. ఆయన నాకేం వదిలిపెట్టలేదు. కానీ నా డ్యూటీ ఏంటంటే, ఆయన చూపించిన దారిలో పనులు అమలు చేయడం (ఎగ్జిక్యూషన్). ఆయనొక బ్రాండ్, ఆ బ్రాండ్‌వల్లే మాకు గూగుల్‌లాంటి పెద్ద కంపెనీల తలుపులు తెరుచుకున్నాయి. నేను ఆ బ్రాండ్‌ను వాడుకున్నాను, ప్రాజెక్ట్ తీసుకొచ్చాను. ఇప్పుడు పనులు జరుగుతున్నాయి, ఏడాదిలోపు ఆ డేటా సెంటర్‌ను దేశానికి అంకితం చేస్తాం. అదే మమ్మల్ని ప్రత్యేకంగా నిలబెడుతుంది. ఇప్పుడు నాయుడు 4.0 (నాలుగోసారి సీఎం) పాలన నడుస్తోంది. ఆయన మొదటి మూడు టర్మ్‌లకంటే ఇది పూర్తిగా డిఫరెంట్. నేను సరదాగా మా యువ బృందంతో అంటుంటాను.. 'నాయుడు ఎప్పుడూ 1995నాటి తన టీమ్ గురించి గొప్పగా చెబుతుంటారు కదా, రేపొద్దున ఆయన 2024 టీమ్ ఇంకా అద్భుతం రా అని మన గురించి చెప్పుకునేలా మనం కష్టపడి పనిచేయాలి' అని. అదే మమ్మల్ని పగలు, రాత్రి కష్టపడేలా ముందుకు నడిపిస్తోంది.

**ఆర్నబ్ గోస్వామి: చాలా ఇంట్రెస్టింగ్ సెషన్ ఇది. లోకేష్, ఇండియాలో అందరూ ఆసక్తిగా గమనిస్తున్న సెకండ్ జనరేషన్ లీడర్ మీరు. మీ ఫాదర్ నీడలోనుంచి బయటికొచ్చి, టెక్నాలజీ తెలిసిన లీడర్‌గా మీకంటూ ఒక ఇమేజ్ క్రియేట్ చేసుకున్నందుకు కంగ్రాట్స్. ఏపీని డేటా సెంటర్లకు కేరాఫ్‌గా మారుస్తున్నారు కదా. కానీ వీటికి కరెంటు, నీళ్లు చాలా అవసరం. దీనివల్ల స్థానికులకు ఇబ్బంది కలగొచ్చు కదా. మరి ఈ సమస్యను ఎలా బ్యాలెన్స్ చేస్తారు? భవిష్యత్తు కోసం ఇప్పుడే ఏమైనా ప్లాన్ చేస్తున్నారా?**


**నారా లోకేష్:** అర్నాబ్ జీ, ఈ డెవలప్‌మెంట్‌లో రైతులను, స్థానికులను భాగస్వాములను చేయడం చాలా ముఖ్యం. వాళ్లకు వాస్తవాలు వివరించాలి. ఉదాహరణకు, డేటా సెంటర్లకు నీళ్లు కావాలి నిజమే. కానీ ప్రతి ఏటా గోదావరి నుంచి 3 వేల టీఎంసీ నీరు వృథాగా సముద్రంలో కలిసిపోతోంది. ఈ నీళ్లు బ్రెజిల్ లేదా వియత్నాం దేశమంతా ఏడాదిపాటు వాడే నీటితో సమానం. డేటా సెంటర్‌లకు అడుగుతున్నది కేవలం 1.5 టీఎంసీ. పోలవరం ప్రాజెక్ట్ పూర్తయ్యాక ఈ నీటిని వాడుకుంటాం. రెండోది, పవర్ విషయానికొస్తే మన దేశంలో 'వన్ గ్రిడ్' విధానముంది. మా ఏపీ దక్షిణ ప్రాంతంలో చాలా సోలార్, విండ్ పవర్ ప్లాంట్లున్నాయి. ఇక్కడినుంచి డేటా సెంటర్లకు పవర్ ఇచ్చుకోవచ్చు. అలాగే, ఏఐ విషయంలో మనదేశానికి సొంత ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉండాలి, లేకపోతే భవిష్యత్తులో చాలా ఇబ్బంది పడతాం.

**ఆర్నబ్ గోస్వామి: దీని కోసం మీరు ఇప్పుడే ప్రిపేర్ అవుతున్నారా?**

**నారా లోకేష్:** కచ్చితంగా. ఏపీలో ఈ ఏడాది పవర్ వాడకం ఏకంగా 17శాతం పెరిగింది. దేశంలో ఇదే హయ్యెస్ట్. దీనికి తగ్గట్లు మేం ప్లాన్ చేసుకోవాలి. ప్రాజెక్టులన్నీ గ్రౌండింగ్ కాకముందే మేం ఇంత స్పీడ్‌గా వెళ్తున్నాం అంటే, ఫ్యూచర్ కోసం పవర్, వాటర్ ఎలా మేనేజ్ చేయాలో ఇప్పుడే ప్లాన్ చేసుకుంటున్నాం. మా మంత్రులంతా దీనిపైనే ఫోకస్ చేస్తున్నారు.

(తరువాయి 5లో..)





## కొరియా రాయబారితో మంత్రి లోకేష్ భేటీ

న్యూఢిల్లీ (చైతన్య రథం): భారత్‌లో రిపబ్లిక్ ఆఫ్ కొరియా (దక్షిణ కొరియా) రాయబారి లీ సియోంగ్ హోను రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ న్యూఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా భారతదేశంలో కొరియన్ కంపెనీల విస్తరణ, భవిష్యత్తులో ఇరుదేశాల నడుమ మరింత సహకారానికి ఉన్న అవకాశాలపై చర్చించారు. సెమీకండక్టర్లు, మైక్రో ఎలక్ట్రానిక్స్, స్టోరేజ్, నౌకా నిర్మాణం, ఎలక్ట్రిక్ వాహనాల రంగాల్లో కొరియా ప్రపంచ అగ్రగామిగా ఉంది. భారతదేశంలో కొరియన్ కంపెనీలకు ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ఏవిధంగా దీర్ఘకాలిక భాగస్వామిగా నిలవగలదనే అంశంపై మంత్రి లోకేష్ చర్చించారు.

# పౌరుల ఓటు హక్కును కాపాడాలి

- **స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సత్తా చాటుదాం**
- **'సర్' కార్యక్రమంపై కూటమి నాయకులతో సమీక్షలో మంత్రి కొల్లు రవీంద్ర**

మచిలీపట్నం (చైతన్యరథం): పౌరుల ఓటు హక్కును కాపాడే బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్త తీసుకోవాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ మచిలీపట్నం నియోజకవర్గ కార్యాలయంలో కూటమి నాయకులు, కార్యకర్తలతో సోమవారం మంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎస్ఐఆర్ కార్యక్రమం అమలు తీరుపై సమీక్షించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం లక్ష్యంగా ప్రతి కార్యకర్తా కృషి చేయాలని సూచించారు.

గత రెండు సంవత్సరాల్లో దేశంలో ఏ రాష్ట్రంలోనూ చేయని విధంగా అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందిస్తున్నాం. సూపర్ సిక్స్ హామీలను సూపర్ హిట్ చేశాం. అర్హులందరికీ పెన్షన్లు అందిస్తున్నాం. చదువుకుంటున్న ప్రతి బిడ్డకూ తల్లికి వందనం అమలు చేస్తున్నాం. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకు రూ.20 వేలు చొప్పున ఇస్తున్నాం. ఉచిత గ్యాస్, ఉచిత బస్ అమలు చేశాం. మత్స్యకారుల సేవలో పథకం అమలు చేశాం. నాయీ బ్రాహ్మణులు, చేనేతలకు విద్యుత్ రాయితీ కల్పిస్తున్నాం. అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించి అండగా నిలుస్తున్నాం. పెట్టుబడులు, పరిశ్రమలతో రాష్ట్రంలోని యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నాం. గతంలో రాష్ట్రానికి పెట్టుబడితో రావాలంటేనే భయపడే పరిస్థితి నుండి ఏపీలో పెట్టుబడి అవకాశం వస్తే చాలు అనేలా పారిశ్రామిక



విధానాల్లో మార్పులు తీసుకొచ్చాం. గత రెండేళ్లలో దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి రావడం రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న నమ్మకానికి నిదర్శనం. గూగుల్ డేటా సెంటర్, అర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, రాయల్ ఎన్ ఫీల్డ్, డిఫెన్స్ యుద్ధ విమానాల తయారీ సంస్థ లాంటి ప్రఖ్యాత పెట్టుబడులు సాధించాం. మెగా డీఎస్సీ పకడ్బందీగా నిర్వహించి 16వేల టీచర్ పోస్టులు భర్తీ చేశాం. గుంతలు లేని రోడ్లు సాకారం చేశామని మంత్రి రవీంద్ర చెప్పారు.

రెండేళ్లలో ఎన్నో అభివృద్ధి పనులు చేశాం. రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలిపే లక్ష్యంతో కీలక నిర్ణయాలు తీసుకున్నాం. మనం చేసిన మంచిని ప్రజలకు వివరించాలి. పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణంతోపాటు ప్రజా మద్దతు పెంచాలి. కూటమి ప్రభుత్వ విజయాలను ప్రతి ఇంటికి చేరవేయాలి. రానున్న స్థానిక ఎన్నికల్లో ఘన విజయం సాధించేందుకు సమష్టిగా కృషి చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మోటమర్రి బాబా ప్రసాద్, గోపు సత్యన్నారాయణ, కుంచె దుర్గాప్రసాద్, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్... ఇవే మా విజయ రహస్యాలు!

(4వ పేజీ తరువాయి..)

**ఆర్నబ్ గోస్వామి: ఇక్కడో చిన్న కాంట్రాడిక్షన్ ఏంటంటే, గతంలో పాలిటిక్స్ అంటే ఓటర్లను బుజ్జగించడమే. కానీ మీరు రియల్-టైమ్ గవర్నెన్స్ అంటారు. మీ దగ్గర ఒక ఫైటర్ జెట్ కాక్‌పిట్‌లాంటి డ్యాష్‌బోర్డ్ ఉందని విన్నాను. ఇదంతా నిజంగా పాజిబుల్ అవుతుందా? లేక ఇదొక అట్రాక్టివ్ మార్కెటింగ్ పదమా? సగటు మనిషికి దీనివల్ల యూజ్ ఏంటి?**

**నారా లోకేష్:** ఒక ఆసక్తికరమైన నిజం చెబుతాను వినండి. 2024లో మేం అధికారంలోకి వచ్చేనాటికి ఏపీలో అక్షరాస్యత రేటు చాలా దారుణంగా ఉంది. ఐటీలో అంత పేరున్న రాష్ట్రంలో ఇలా జరగడం విచిత్రం కదా? ఎందుకంటే, గత ఐదేళ్లలో పాలకులు అసలు మానిటరింగ్ చేయలేదు. డ్రాపౌట్స్ పట్టించుకోలేదు. కానీ ఇప్పుడు, విద్యా మంత్రి ఒక డేటాను ఎలా చూస్తారో, గ్రౌండ్ లెవెల్‌లో ఉన్న హెడ్‌మాస్టర్ కూడా అదే డేటాను చూస్తారు. దీనివల్ల రిజల్ట్స్ వస్తున్నాయి. ఈ ఏడాదే దాదాపు 85,000 మంది ప్రైవేట్ స్కూల్స్ నుంచి గవర్నమెంట్ స్కూల్స్‌కి వచ్చారు. ఈ డేటా ఉంటేనే నేను కరెక్ట్ డెసిషన్స్ తీసుకోగలను. ఏ స్కూల్‌లో, ఏ సబ్జెక్టులో ఎవరు వీక్ ఉన్నారో నాకు అమరావతిలో కూర్చుంటే తెలిసిపోతుంది. ప్రైవేట్ సెక్టార్ చేయగలిగినప్పుడు గవర్నమెంట్ ఎందుకు చేయకూడదు? నా దగ్గర అగ్రికల్చర్, వాటర్ మేనేజ్‌మెంట్.. ఇలా అన్ని శాఖల డేటా ఉంటుంది. దాన్నిబట్టే మేం పక్కా ప్లానింగ్‌తో ముందుకెళ్తున్నాం.

**ఆర్నబ్ గోస్వామి: మీరు స్టాన్‌ఫోర్డ్ వెళ్లాక రాజకీయాల్లోకి రావాలని డిసైడ్ అయ్యారా?**

**నారా లోకేష్:** స్టాన్‌ఫోర్డ్ వెళ్లకముందే నాకు పాలిటిక్స్‌లోకి రావాలని ఆసక్తిఉంది. స్టాన్‌ఫోర్డ్ ఎంబీఏ ఎందుకు చేయాలనుకుంటున్నానో వ్యాసం రాయమని అడిగినపుడు ఈ విషయం ప్రస్తావించాను. ప్రైవేట్ సెక్టార్ నుంచి పబ్లిక్ సెక్టార్‌కి మారేందుకు ఈ ఎంబీఏ నాకు యూజ్ అవుతుందని రాశాను. చాలామంది నన్నీ ప్రశ్న అడుగుతుంటారు. 2004 ఎన్నికల్లో నాయుడు ఎన్నికల్లో ఓడిపోయారు. సరిగ్గా ఏడాది తర్వాత ఆయనతో కలిసి ఓ పెళ్లికి వెళ్లాను. అక్కడ దాదాపు 5,000 మంది ఉన్నారు. నాయుడు లోపలికి రాగానే, అక్కడ ఉన్న వారంతా లేచి నిలబడి ఆయనకు రెస్పెక్ట్ ఇచ్చారు. అప్పుడే నాకు అర్థమైంది, ఇంతటి గౌరవం దక్కేది రాజకీయాల్లోనే అని. అదే నన్ను రాజకీయాల వైపు నడిపించింది.

**ఆర్నబ్ గోస్వామి:** నిజం చెప్పాలంటే ఆ గౌరవానికి ఆయన కచ్చితంగా అర్హులు. అందరు నాయకులకూ ఆ రెస్పెక్ట్ దక్కదు. నాకైతే ఈ సంభాషణ చాలా బాగా అనిపించింది. మీలో చాలా పాజిటివిటీ ఉంది. ముందు ముందు మీరు మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నాను. భవిష్యత్తులో దేశం కచ్చితంగా చూడాల్సిన నాయకుడు నారా లోకేష్. థ్యాంక్ యూ సో మచ్, నారా లోకేష్

# విజయవాడలో తలసేమియా కేర్ సెంటర్ ప్రారంభిస్తున్నాం

### ప్రకటించిన నారా భువనేశ్వరి

హైదరాబాద్ (చైతన్య రథం): దేశవ్యాప్తంగా తలసేమియా బాధితులు ఎక్కడున్నా సరే ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున వారికి సహాయం అందించడానికి సిద్ధంగా ఉన్నామని, మరికొద్ది రోజుల్లో విజయవాడలో తలసేమియా కేర్ సెంటర్ ప్రారంభిస్తున్నామని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ప్రకటించారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి తన పుట్టిన రోజును సోమవారం ఎన్టీఆర్ ట్రస్ట్‌లో తలసేమియా పిల్లలమధ్య జరుపుకున్నారు. పిల్లలతో కలిసి కేక్ కట్‌చేసి వారికి చాక్లెట్‌లు, గిఫ్ట్ హాంపర్స్‌ను పంచిపెట్టి, పిల్లలతో కలిసి భోజనం చేసి తదనంతరం పిల్లలతో ముచ్చటించారు. తలసేమియా బారినపడి తల్లడిల్లుతున్న బాలబాలికలను భువనేశ్వరి అన్ని విధాలా ఆదుకుంటున్నారు. వీరి కోసం విశాఖపట్నం, హైదరాబాద్ నగరాలలో భారీ ఎత్తున 'తలసేమియా రన్'ను, 'యుఫోరియా మ్యూజికల్ నైట్'ను విజయవాడలో నిర్వహించారు. తలసేమియా వ్యాధి ఉన్నవారు నెలకు రెండుసార్లు రక్తమార్పిడి చేయించుకోవాల్సి ఉంటుంది. ఉచిత రక్తనిధి ద్వారా వందలాది చిన్నారులకు, వారి కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు తలసేమియా వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నారు. తలసేమియా బాధిత పిల్లలకు నారా భువనేశ్వరి ఒక ఆశాదీపంగా ఉంటున్నారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ.. "నా పుట్టిన రోజును ఎన్టీఆర్



ట్రస్ట్‌లో తలసేమియా కేర్ సెంటర్‌లో ఉన్న పిల్లల మధ్య జరుపుకోవడం నాకు ఎంతో సంతృప్తిని ఇచ్చింది. ఎన్టీఆర్ ట్రస్ట్ తలసేమియా బాధితుల కోసం ఉచిత రక్తమార్పిడి, అవసరమైన మందులు అందించడానికి నిరంతరం కృషి చేస్తున్నాము. దేశవ్యాప్తంగా తలసేమియా బాధితులు ఎక్కడ ఉన్నా సరే ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున వారికి సహాయం అందించడం కోసం మేము సిద్ధంగా ఉన్నాం" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ సీఈవో కె. రాజేంద్రకుమార్ (ఐపీఎస్ రిటైర్డ్), సీవోవో అడుసుపల్లి గోపి, హెరిటేజ్ హోల్‌టైమ్ డైరెక్టర్ డా.ఎం సాంబశివరావు, ఎన్టీఆర్ ట్రస్ట్, హెరిటేజ్ సిబ్బంది పాల్గొన్నారు.





# అమరావతిలోనూ 'బసవతారకం'

- పేదల క్యాన్సర్ సేవ మరింత విస్తృతం
- రజతోత్సవ వేడుకల్లో సీఎం చంద్రబాబు భావోద్వేగ ప్రసంగం
- అమరావతిలో వెయ్యి పడకల ఆస్పత్రికి బాలకృష్ణ ముందడుగు
- 25 ఏళ్లలో 3 లక్షలమంది రోగులకు అండగా నిలిచిన సేవా సంస్థ






హైదరాబాద్ (చైతన్య రథం): బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి రజతోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆస్పత్రి స్థాపన వెనుక ఉన్న భావోద్వేగ గాథను పంచుకున్నారు. తన అత్తగారు బసవతారకం క్యాన్సర్ వ్యాధికి గురైనప్పుడు ఆ కాలంలో హైదరాబాద్‌లో తగిన వైద్య సదుపాయం లేకపోవడంతో ముంబై, చెన్నై వంటి నగరాలకు వెళ్లాల్సి వచ్చిందని, ఆగస్టు సంక్షోభ సమయంలో ఆమె మృతి చెందారని వివరించారు.

"క్యాన్సర్ వ్యాధికి చికిత్స అందక ఇక ఎవరూ చనిపోకూడదు" అనే సంకల్పంతో, దివంగత ఎన్టీఆర్ విజన్ మరియు పేదలకు వైద్య సేవ అందించాలనే లక్ష్యంతో ఈ ఆస్పత్రి నిర్మించామని సీఎం చంద్రబాబు తెలిపారు. మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ మేనేజింగ్ ట్రస్టీగా, డాక్టర్ నోరి దత్తాత్రేయుడు లాంటి ప్రముఖ వైద్యుల సేవలతో 100 పడకల ఆస్పత్రిగా నాటిన మొక్క ఇప్పుడు 650 పడకల మహా వృక్షంగా ఎదిగిందని ఆనందం వ్యక్తం చేశారు.

25 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో ఆస్పత్రి చైర్మన్‌గా బాలకృష్ణ అన్‌స్టాపబుల్‌గా సేవలు అందిస్తున్నారని సీఎం కొనియాడారు. ఎవర్‌గ్రీన్ హీరోగా, హిందూపూర్ ఎమ్మెల్యేగా ఎంత బిజీగా ఉన్నా ఆస్పత్రికి వెళ్లి రోగులను పరామర్శించి స్వాంతన కలిగించడం బాలకృష్ణ ప్రత్యేకతని అన్నారు. లాభాపేక్ష లేకుండా నడిపే ఈ సంస్థ ద్వారా రోజూ 22 ఆపరేషన్లతో పాటు ఏడాదికి 8 వేలకు పైగా శస్త్రచికిత్సలు జరుగుతున్నాయని, తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల నుంచి వచ్చే రోగులకు సేవలందుతున్నాయని వివరించారు.

ఏడాదికి 3 లక్షల పైచిలుకు మంది రోగులకు చికిత్స అందిస్తున్న ఈ ఆస్పత్రికి ఇప్పుడు కొత్త అధ్యాయం ఆరంభమవుతోందని సీఎం వెల్లడించారు. అమరావతిలో వెయ్యి పడకల ఆస్పత్రి ఏర్పాటు చేసేందుకు బాలకృష్ణ ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. ఏపీ ప్రభుత్వం ప్రజారోగ్య రక్షణలో ప్రివెంటివ్, క్యూరెటివ్, ప్రిడిక్టివ్ విధానాలను అనుసరిస్తున్నదని, పబ్లిక్ హెల్త్ రంగంలో ప్రభుత్వంతో పాటు లాభాపేక్ష లేని ఆస్పత్రులు మరిన్ని రావాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు.

ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా తన సతీమణి భువనేశ్వరి వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ప్రస్తావించిన సీఎం, పేదలకు సేవ చేయడంలో లభించే ఆనందం మరెందులోనూ లేదని అన్నారు. భారత్‌లో లాభాపేక్ష లేని అతిపెద్ద సేవా సంస్థగా బసవతారకం ఆస్పత్రి ఎదగాలని ఆకాంక్షిస్తున్నానని ముఖ్యమంత్రి ముగించారు.















చైతన్యరథం

# మరణంలేని ఆశయమిది!

**డబ్బులేమితో క్యాన్సర్ వైద్యానికి ఎవ్వరూ దూరంకాకూడదు - 'బసవతారకం' ఆస్పత్రి వజ్రోత్సవంలో చైర్మన్ బాలకృష్ణ భరోసా**






హైదరాబాద్ (చైతన్య రథం): పేదలకు అండగా ఉండాలనే లక్ష్యంతో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ ప్రారంభమైందని ఆసుపత్రి చైర్మన్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. రోజుకి 35నుంచి 40 శస్త్రచికిత్సలు చేస్తున్నామని.. వేలాది మందికి ఇది ఓ ఆశాకిరణమన్నారు. సోమవారం బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఏపీ సీఎం చంద్రబాబు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్రమంత్రులు అనుప్రియ పటేల్, పెమ్మసాని చంద్రశేఖర్, తెలంగాణ మంత్రి దామోదర రాజనర్సింహ, ఏపీ మంత్రి సత్యకుమార్ సహా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ఎన్టీఆర్ కుటుంబసభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. "నటుడిగా, ఎమ్మెల్యేగా కాదు.. ఓ కొడుకుగా మీ ముందు నిలుచున్నా. మా అమ్మ బసవతారకం క్యాన్సర్ బారిన పడినప్పుడు ఎంతో బాధపడ్డాం. డబ్బు ఉంది కాబట్టి గట్టిగా పోరాడగలిగాం. డబ్బు లేనివారు ఈ వ్యాధితో ఎలా పోరాడుతారని మా అమ్మ ప్రశ్నించారు. అప్పుడే ఈ ట్రస్ట్ ఏర్పాటు ఆలోచన వచ్చింది. 3.75 లక్షలమందికి ఓపీ సేవలు అందించాం. బాధతో ఆసుపత్రికి వచ్చే వారు నవ్వుతూ తిరిగి వెళ్లాలి అనేదే మా ఉద్దేశం. భారత్‌లోనే మొట్టమొదటి బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ కేంద్రం అప్పట్లో ప్రారంభించాం. ప్రభుత్వాలు మాకు ఎంతగానో సహకరించాయి. ఎన్నో సంస్థలు, ఎందరో దాతలు ఈ ప్రయాణంలో మాకు అండగా నిలిచారు. ఏ ఒక్క రోగి కూడా డబ్బు లేక క్యాన్సర్ చికిత్సకు దూరం కాకూడదు. 25 ఏళ్ల క్రితం చేసిన ప్రమాణాన్ని నిలబెట్టుకున్నాం. భవిష్యత్తులోనూ కొనసాగిస్తాం. అమరావతిలో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మిస్తాం. హైదరాబాద్‌లో సేవలు మరింత విస్తరిస్తాం" అని బాలకృష్ణ వెల్లడించారు.

**పేషెంట్లకు పెద్ద భరోసా: అనుప్రియ**

క్యాన్సర్ బాధితులకు బసవతారకం ఆసుపత్రి ఓ భరోసా అని కేంద్రమంత్రి అనుప్రియ పటేల్ అన్నారు. ఇక్కడ చాలా తక్కువ ఖర్చుతో వైద్యం అందిస్తున్నారన్నారు. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. "దేశంలో ఏటా 15 లక్షలమంది క్యాన్సర్ బారిన పడుతున్నారు. దీన్ని తొలి దశలో గుర్తించడం చాలా కష్టం. 30ఏళ్లు దాటిన వారికి ఆయుష్మాన్ భారత్ కింద ఉచితంగా దీనికి సంబంధించిన పరీక్షలు చేస్తున్నాం. దేశంలో 6 కోట్ల మంది మహిళలు బ్రెస్ట్, 9 కోట్లమంది సర్వైకల్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. సర్వైకల్ క్యాన్సర్ రాకుండా మహిళలు, బాలికల కోసం మోదీ ప్రభుత్వం హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకొచ్చింది. 14 ఏళ్లలోపు ఉన్న 1.20 కోట్లమంది బాలికలకు ఈ వ్యాక్సిన్ వేస్తున్నాం. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో దీన్ని ఉచితంగా అందిస్తున్నాం. ఒకప్పుడు 8 మాత్రమే ఉన్న ఎయిమ్స్ ఆసుపత్రులు.. ఇప్పుడు 23కు చేరాయి" అని అనుప్రియ వివరించారు.

**తల్లి ఆశయాలను నిలిపిన కొడుకు బాలకృష్ణ: పెమ్మసాని**

క్యాన్సర్ అంటే గుర్తొచ్చేది బసవతారకం ఆసుపత్రి అని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. "100 పడకలతో ప్రారంభమైన ఈ ఆసుపత్రి నేడు 650 పడకల ఆస్పత్రిగా ఎదిగింది. పేదలకు ఆరోగ్య శ్రీ ఆయుష్మాన్ భారత్ కింద సేవలు అందిస్తున్నారు. కార్పొరేట్‌తో పోలిస్తే దాదాపు 40 శాతం తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందుతున్నాయి. ఆస్తులకు వారసులు ఎందరో ఉంటారు కానీ... ఆశయాలకు వారసులు కొందరే. తల్లి ఆశయాలను నిలిపిన అరుదైన కుమారుడు బాలకృష్ణ. ఇది ప్రేమకు నిదర్శనమైన పవిత్ర క్షేత్రం. ఎన్టీఆర్ ప్రేమ సాక్షిగా బసవతారకం ఆసుపత్రి చరిత్రలో నిలిచిపోతుంది" అని పెమ్మసాని పేర్కొన్నారు.

**తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యసేవలు: దామోదర రాజనర్సింహ**

తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ... రోగులకు నాణ్యమైన వైద్యసేవలను తక్కువ ఖర్చుతో బసవతారకం ఆసుపత్రి అందిస్తోందని చెప్పారు. "తెలంగాణాలో క్యాన్సర్ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడంపై ప్రజలకు అవగాహన పెంచాల్సి ఉంది. రాష్ట్రంలో క్యాన్సర్ రిజిస్ట్రీ మెయింటెన్ చేస్తున్నాం. దీనిని నోటిఫైడ్ వ్యాధిగా గుర్తించాం. ఆరోగ్య ఖర్చులు ప్రజలకు భారం కాకూడదు. క్యాన్సర్ చికిత్సలకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నిధులు కేటాయిస్తున్నాయి" అని చెప్పారు.

# మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌లకు మంత్రి లోకేష్ సత్కారం

**- నేడు పద్మశ్రీ అవార్డుల స్వీకారం...**
**- ఢిల్లీకి చేరుకున్న సీనియర్ నటులు**

*న్యూఢిల్లీ (చైతన్య రథం): ప్రముఖ సినీనటులు, పద్మశ్రీ అవార్డు గ్రహీతలు మాగంటి మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌లను రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ ఘనంగా సత్కరించారు. ఇటీవల కేంద్రం ప్రకటించిన 2026 పద్మ అవార్డుల ప్రదానోత్సవం మంగళవారం న్యూఢిల్లీలో జరగనుంది. ఈ అవార్డులను స్వీకరించేందుకు డిల్లీకి వచ్చిన మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌లను మంత్రి లోకేష్ కలుసుకొని జ్ఞాపికలతో సత్కరించారు. వందలాది సినిమాల్లో నటించి, తెలుగు సినిమా రంగానికే వన్నెతెచ్చిన ఇద్దరు సీనియర్ నటులకు ఒకేసారి పద్మశ్రీ అవార్డులు రావడం రాష్ట్రానికే గర్వకారణమని కొనియాడారు. ఈ సందర్భంగా విశ్వవిఖ్యాత నటసర్వభౌమ స్వర్గీయ నందమూరి తారక రామారావుతో తమకుగల సాన్నిహిత్యాన్ని ఇద్దరూ నెమరువేసుకున్నారు. భవిష్యత్తులోనూ తెలుగు కళామతల్లికి సీనియర్ నటులు సేవలందించాలని మంత్రి లోకేష్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, పలువురు పార్లమెంటు సభ్యులు కూడా మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌లను సన్మానించారు.*











చైతన్యరథం



- చట్టాన్ని ఉల్లంఘించిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు
- టీడీపీ ఎప్పుడూ ప్రతీకార రాజకీయాలను ప్రోత్సహించలేదు
- ప్రజా సమస్యలు అర్థం చేసుకోవడానికి పాదయాత్ర దోహదపడింది
- ఇన్విజిబుల్ గవర్నమెంట్, ఎఫెక్టివ్ గవర్నెన్స్ మా నినాదం
- పరీక్షల నిర్వహణలో కాలానుగుణంగా సంస్కరణలు అవసరం
- రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీపడబోం
- టీడీపీ కాలపరీక్షను తట్టుకుని నిలిచింది
- ఫార్చ్యూన్ 500 కంపెనీలకు 99 పైసలకే భూమి కేటాయిస్తాం
- ఢిల్లీలో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ అడ్డాలో మంత్రి లోకేష్

# గత ప్రభుత్వంలో వ్యవస్థలన్నీ పతనమయ్యాయి

హైదరాబాద్ (చైతన్య రథం): గత ప్రభుత్వంలో రాష్ట్రంలోని వ్యవస్థలన్నీ పతనం అయ్యాయి. చట్టాన్ని ఉల్లంఘించిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. టీడీపీ ఎప్పుడూ ప్రతీకార రాజకీయాలను ప్రోత్సహించలేదని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నిర్వహించిన ఎక్స్‌ప్రెస్ అడ్డా కార్యక్రమంలో మంత్రి లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నేషనల్ ఒపీనియన్ ఎడిటర్ వందిత మిశ్రా వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా పలు ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇస్తూ.. రియల్ టైం గవర్నెన్స్ విషయంలో.. ఏపీలో మేం వివిధ శాఖల నుంచి సేకరించిన డేటాతో ఒక డేటా లేక్‌ను ఏర్పాటు చేశాం. దీని వల్ల నిర్ణయాలను మరింత అర్థవంతంగా, సమర్థవంతంగా తీసుకునే అవకాశం ఏర్పడింది. తద్వారా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని అమలు చేయగలుగుతున్నాం. ఇప్పుడు మా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు దీనిని మరొక మెట్టు పైకి తీసుకువెళ్లి 'ఈజ్ ఆఫ్ లివింగ్' అనే భావనను ముందుకు తీసుకొచ్చారు. ఎందుకంటే ప్రజలు, ప్రభుత్వానికి మధ్య సంబంధాలలో ఎప్పటి నుంచో అనేక అంతరాలు, ఘర్షణలు ఉన్నాయి. సాంకేతికత ద్వారా ఆ అవరోధాలను ఎలా తొలగించాలనేదే మా ఆలోచన. ఉదాహరణకు రాష్ట్ర ప్రభుత్వంలోని ప్రతి సేవను ఒకే వాట్సాప్ నంబర్‌లో అందుబాటులోకి తీసుకొచ్చాం. ప్రస్తుతం దాదాపు వెయ్యి ప్రభుత్వ సేవలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. ఎవరైనా నాకు ఈ సమస్య ఉందని చెబితే.. మీరు కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, వాట్సాప్ నంబర్‌కు సందేశం పంపితే.. మీ సమస్య పరిష్కారమవుతుందని చెబుతాను. సర్టిఫికెట్లు కావాలన్నా, ఇతర సేవలు కావాలన్నా, అన్నీ డిజిటలైజ్ చేసి మొబైల్ ఫోన్ ద్వారానే అందిస్తున్నాం. ఇది రియల్ టైమ్ గవర్నెన్స్‌కు ఒక ఉదాహరణ మాత్రమే. అన్ని శాఖలను, అన్ని డేటా సెట్‌లను సమన్వయం చేసి సమర్థవంతమైన పాలన అందించడంలో రియల్ టైమ్ గవర్నెన్స్ కీలక పాత్ర పోషిస్తోంది. ఇన్విజిబుల్ గవర్నమెంట్, ఎఫెక్టివ్ గవర్నెన్స్ మా నినాదం.

**సమాజంలో ఏ మార్పు కావాలన్నా అది విద్యతోనే ప్రారంభం కావాలి**

నాకు ఇష్టమైన శాఖ విద్యాశాఖ. పిల్లలంటే నాకు ఎంతో ఇష్టం. అంతేకాదు.. నిజమైన మార్పు విద్య ద్వారానే వస్తుందని నేను బలంగా నమ్ముతున్నాను. ఒక దేశంగా మనం ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ విశ్వవిద్యాలయాలపై తగినంత దృష్టి పెట్టడం లేదని నా అభిప్రాయం. సమాజంలో ఏ మార్పు కావాలన్నా అది విద్యతోనే ప్రారంభం కావాలి. ఒక ఉదాహరణ చెబుతాను. మనం అందరం లింగ సమానత్వం గురించి మాట్లాడుతుంటాం. నేను విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పాఠ్యపుస్తకాల్లో మార్పులు చేపట్టాను. ఇంటి పనుల చిత్రాల్లో 50 శాతం పురుషులు, 50 శాతం మహిళలు ఉండేలా చేశాం. ఇది చాలా చిన్న విషయంగా అనిపించవచ్చు. కానీ విలువల ఆధారిత విద్యా శక్తిని అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. మనకు ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు గారు ఉన్నారు. ఆయన వ్యక్తిగతంగా ఎంతోమంది ప్రజలకు విలువల ఆధారిత జీవన విధానాన్ని బోధిస్తూ అనేక ప్రసంగాలు చేశారు. ఆయన సహకారంతో మేం కొన్ని పుస్తకాలను రూపొందించాం. అలాగే పాఠశాలలు, విశ్వవిద్యాలయాలకు వెళ్లి విలువల ఆధారిత విద్యపై విద్యార్థులతో మాట్లాడే కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నాం. ఒకసారి ఆయన ప్రసంగంలో నేను విన్న ఒక అద్భుతమైన మాట నాకు ఇప్పటికీ గుర్తుంది. నీ జీవితంలో తల్లికి చెప్పలేని పని ఏదీ చేయకూడదు అని. ఈ ఒక్క నియమాన్ని పాటిస్తే నువ్వు విజయవంతమైన పౌరుడివి అవుతావు. చాలా సరళమైన మాట. కానీ ఎంతో శక్తివంతమైన సందేశం.

**పరీక్షల నిర్వహణలో కాలానుగుణంగా సంస్కరణలు అవసరం**

నీట్ వంటి పరీక్షల నిర్వహణ వ్యవస్థలో మరిన్ని సంస్కరణలు చేయాల్సిన అవసరం కచ్చితంగా ఉంది. ఇందులో ఎలాంటి సందేహం లేదు. మనమందరం దీనిని అంగీకరిస్తాం. రాష్ట్రంగా మేం ఈఏపీసెట్ సహా వివిధ ప్రవేశ పరీక్షలను పూర్తిగా కంప్యూటర్ ఆధారిత విధానానికి మార్చాం. అయితే నేను ఇంకో అడుగు ముందుకు వెళ్లాలని భావిస్తున్నాను. ఉన్నత విద్య కోసం ప్రయత్నిస్తున్న విద్యార్థుల భవిష్యత్తు ఒకే రోజు జరిగే పరీక్షపై ఆధారపడకూడదు. ఒక చెడు రోజు మొత్తం సంవత్సరాన్ని, కొన్నిసార్లు వారి భవిష్యత్తునే ప్రభావితం చేయవచ్చు. అందుకే నేను నా శాఖ కార్యదర్శులు, కమిషనర్లతో ఎప్పుడూ ఒకటే చెబుతుంటాను. ఈ సమస్యను మీ సొంత పిల్లల కోణంలో ఆలోచించాలని. ఏం తప్పు జరిగిందో తెలుసుకోవడం నాకు చాలా ముఖ్యం. సీబీఎస్ఈ పరీక్షలు, కంప్యూటర్ ఆధారిత పరీక్షా విధానాన్ని కూడా నేను పరిశీలించాను. మంత్రి దృష్టితో చూస్తే వ్యవస్థ చాలా బాగానే కనిపిస్తుంది. ప్రశ్నాపత్రాలు యాదృచ్ఛికంగా పంపిణీ అవుతాయి. పరీక్షలు జరుగుతాయి. కానీ ఫలితాలు వచ్చిన తర్వాత అది రెండు వైపులా పదునున్న కత్తిలా మారింది. అందుకే ఏం తప్పు జరిగిందో, ఎలాంటి సవరణలు అవసరమో తెలుసుకోవడం నాకు ముఖ్యమైంది. ఎందుకంటే సంపూర్ణమైన వ్యవస్థ అనేది ఏదీ ఉండదు. కాలానుగుణంగా సంస్కరణలు చేస్తూ.. మెరుగుపరుచుకుంటూ వెళ్లాలి.

**టీడీపీ కాలపరీక్షను తట్టుకుని నిలిచింది**

తెలుగుదేశం పార్టీ ఒక ప్రాంతీయ పార్టీగా రాజకీయాల్లో కాలపరీక్షను తట్టుకుని నిలిచింది. 1984లో ఇందిరాగాంధీ గారు, సంపూర్ణ మెజారిటీతో అధికారంలో ఉన్న ఎన్టీఆర్ గారి ప్రభుత్వాన్ని గవర్నర్‌ను ఒక సాధనంగా ఉపయోగించి తొలగించారు. అంతకుముందు కూడా కొన్ని ప్రాంతీయ పార్టీల ప్రభుత్వాలు మారాయి. అయితే తెలుగుదేశం పార్టీ ప్రభుత్వమే తిరిగి పునరుద్ధరించడం జరిగింది. దీనికి కారణం మా నాయకత్వం, మా కార్యకర్తల పట్టుదల. ఈ రోజు చుట్టూ జరుగుతున్న పరిణామాలను చూస్తే ఒక విషయం స్పష్టంగా తెలుస్తోంది. ఒక ప్రాంతీయ పార్టీగా మన సిద్ధాంతాల కోసం నిలబడాలి. మన కార్యకర్తల కోసం నిలబడాలి. ఆ నిబద్ధతను మరింత బలోపేతం చేయాలి. అనేక ఎన్నికలు గెలిచి అధికారంలోకి వచ్చిన తర్వాత తమ సిద్ధాంతాలను కోల్పోయిన కొన్ని పార్టీలు ఇబ్బందులను ఎదుర్కొన్నాయి. కానీ తెలుగుదేశం పార్టీ ఎన్నికల్లో గెలిచినా, ఓడినా ఎప్పుడూ తన సిద్ధాంతాల విషయంలో (తరువాయి 9లో...)







# గత ప్రభుత్వంలో వ్యవస్థలన్నీ పతనమయ్యాయి



(8వ పేజీ తరువాయి)

దృఢంగానే నిలిచింది. గతంలో మా పార్టీ ఎంపీలు ఫిరాయించినా మేం పోరాడాం, ప్రజల పక్షాన నిలిచాం. అందుకే 44 సంవత్సరాల తరువాత కూడా తెలుగుదేశం పార్టీ బలంగా నిలిచి ఉంది.

**ఎన్డీయేకు బేషరతుగా మద్దతు ఇచ్చాం**

ఎన్డీయేకు మా మద్దతు ఎప్పుడూ బేషరతుగానే ఉంటుంది. మా నాయకుడు చంద్రబాబు నాయుడు గారు, తెలుగుదేశం పార్టీ దేశానికి స్థిరమైన నాయకత్వం అవసరమని ప్రాథమికంగా విశ్వసిస్తారు. నేడు ప్రపంచం భారతదేశాన్ని స్థిరత్వానికి ప్రతీకగా చూస్తోంది. అలాంటి సమయంలో దేశానికి స్థిరమైన నాయకత్వం అవసరం. 2024లో మేం ఎన్డీయేలో తిరిగి చేరినప్పుడు ఎలాంటి షరతులు పెట్టలేదు. ఇప్పటికీ మా మద్దతు బేషరతుగానే కొనసాగుతోంది. అయితే విధానాల విషయంలో మాకు అభిప్రాయాలు ఉంటాయా అంటే కచ్చితంగా ఉంటాయి. కానీ వాటిని నాలుగు గోడల మధ్య, అంతర్గత చర్చల ద్వారానే వ్యక్తం చేస్తాం. వక్ఫ్ బిల్లుపై కూడా మా అభిప్రాయాలను తెలియజేశాం. దానిని సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపారు. విస్తృత సంప్రదింపులు జరిగాయి. మేం ముఖ్యమని భావించిన కొన్ని సూచనలు చేర్చిన తర్వాతే అది ఓటింగ్‌కు వచ్చింది. డీలిమిటేషన్ అంశంలో కూడా బిల్లు వచ్చిన వెంటనే అర్ధరాత్రి వరకు దానిని పరిశీలించి, చట్టపరమైన అంశాలను అధ్యయనం చేసి, మా నాయకుడు చంద్రబాబు నాయుడు గారికి నివేదిక పంపాను. అనంతరం ఎన్డీయే ఈ విషయాన్ని చర్చించాం. కాబట్టి మాకు అభిప్రాయాలు ఉన్నాయి.

**రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీపడబోం**

తెలుగు ప్రజల ప్రయోజనాలను కాపాడటంలో ఎలాంటి రాజీ లేదు. కానీ వాటిని బాధ్యతాయుతంగా, అంతర్గత చర్చల ద్వారానే వ్యక్తపరుస్తాం. మా అభిప్రాయాలకు కేంద్రంలో ఎప్పుడూ ప్రాధాన్యం లభించింది. ఏ అంశంపైనైనా మా అభిప్రాయాన్ని వ్యక్తపరచాలి అనుకున్నప్పుడు.. కేంద్ర నాయకత్వం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంచింది. రాష్ట్ర ప్రయోజనాల కోసం, దేశ ప్రయోజనాల కోసం అవసరమైన సంస్కరణల విషయంలో కూడా మా సూచనలకు ప్రాధాన్యం లభించింది. ఇందుకు ఒక ఉదాహరణ చెబుతాను. గూగుల్‌తో మా చర్చలు సుమారు 13 నెలల క్రితమే ప్రారంభమయ్యాయి. వారు శాశ్వత స్థాపన పన్ను విధానంలో కొన్ని మార్పులు కోరారు. అప్పుడు చంద్రబాబు నాయుడు గారు నేరుగా ప్రధాని నరేంద్ర మోదీ గారితో మాట్లాడారు. తన అభిప్రాయాలు చెప్పారు. ప్రధాని కార్యాలయం కూడా అంగీకరించారు. అనంతరం ప్రధాని కార్యాలయమే ఆ సంస్కరణలను ముందుకు తీసుకెళ్లింది. అందువల్ల ఒక ప్రాంతీయ పార్టీగా మా స్వరం వినబడుతోందని నేను నిజాయితీగా నమ్ముతున్నాను.

**జీవితంలో కష్టమైన మార్గాన్నే ఎంచుకున్నాను**

నేను జీవితంలో ఎప్పుడూ సులభమైన మార్గాన్ని కాకుండా కష్టమైన మార్గాన్నే ఎంచుకున్నాను. 1985 నుంచి మా పార్టీ గెలవని నియోజకవర్గం నుంచి నేను పోటీ చేశాను. 2019లో నేను ఓడిపోయాను. అయినప్పటికీ ఐదేళ్ల పాటు నా నియోజకవర్గాన్ని విడిచి వెళ్లలేదు. ప్రజలకు నా సామర్థ్యం గురించి పూర్తిగా వివరించే అవకాశం నాకు రాలేదని భావించాను.

ఐదేళ్ల తరువాత అదే నియోజకవర్గంలో 91 వేల ఓట్ల మెజారిటీతో గెలిచాను. అది ఆంధ్రప్రదేశ్ చరిత్రలో మూడో అతిపెద్ద మెజారిటీ. ఆసక్తికరంగా.. అత్యధిక మూడు మెజారిటీలు కూడా ఈ ఎన్నికలలోనే నమోదయ్యాయి. అలాగే నేను స్వయంగా హెచ్ఆర్‌డీ శాఖను ఎంచుకున్నాను. సాధారణంగా చాలా మంది విద్యాశాఖను కోరుకోరు. కానీ సమాజంలో మార్పు తీసుకురావాలంటే విద్య ద్వారానే సాధ్యమని నేను నమ్ముతాను. ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయ నియామకాలు వంటి ఎన్నో వివాదాస్పద అంశాలతో కూడిన శాఖను మేం చాలా సమర్థవంతంగా నిర్వహించగలిగాం.

**ప్రజా సమస్యలు అర్థం చేసుకోవడానికి పాదయాత్ర దోహదపడింది**

స్టాన్‌ఫోర్డ్ నాకు ఐక్యూ ఇచ్చింది.. పాదయాత్ర నాకు ఈక్యూ నేర్పింది. పాదయాత్ర నా రాజకీయ జీవితంలో ఎంతో కీలకమైంది. ప్రజల సమస్యలను అర్థం చేసుకోవడానికి అది నాకు చాలా ఉపయోగపడింది. ప్రతి నియోజకవర్గంలో ప్రజలతో మాట్లాడాను. రెండు మూడు రోజులు అక్కడే గడిపాను. అందువల్ల ఇప్పుడు ఏ సమస్య వచ్చినా దాంతో నాకు ప్రత్యక్ష అనుభవం ఉన్నట్టే అనిపిస్తుంది. అందుకే నేను తరచూ చెబుతుంటాను.. వ్యాపారానికి స్టాన్‌ఫోర్డ్ ఎంబీఏ ఎంత ఉపయోగపడిందో, రాజకీయాలకు పాదయాత్ర అంత ఉపయోగపడింది అని. స్టాన్‌ఫోర్డ్ నాకు ఐక్యూ ఇచ్చింది, పాదయాత్ర నాకు ఈక్యూ ఇచ్చింది.

**గత ప్రభుత్వంలో వ్యవస్థలన్నీ పతనం అయ్యాయి**

రెడ్ బుక్ గురించి మాట్లాడుతూ.. 2019-2024 మధ్య వ్యవస్థల పతనాన్ని ప్రత్యక్షంగా చూశాను. నేను పుట్టినప్పటి నుంచే రాజకీయ వ్యవస్థను చూస్తూ పెరిగాను. ఎన్టీఆర్ గారు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన దాదాపు 14 రోజుల తర్వాత నేను జన్మించాను. కార్యకర్తలు ఎలా పనిచేస్తారో, ఐఏఎస్ అధికారులు, ఐపీఎస్ అధికారులు ఎలా వ్యవహరించేవారో చిన్నప్పటి నుంచే చూశాను. కానీ 2019 నుంచి 2024 మధ్య కాలంలో నేను తొలిసారిగా సంస్థాగత వ్యవస్థల పతనాన్ని చూశాను. నాపై 23 కేసులు పెట్టారు. అందులో హత్యాయత్నం కేసు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు కూడా ఉన్నాయి. చట్టాన్ని ఉల్లంఘించిన వారిని నేను బాధ్యుల్ని చేయకపోతే, దీనికి అంతం ఎక్కడ ఉంటుంది? రాజ్యాంగాన్ని పరిరక్షించడానికే కదా మనం ఎన్నికయ్యాం? 2019 నుంచి 2024 మధ్య జరిగిన విషయాలను యూట్యూబ్‌లో చూసినా తెలుస్తుంది. కొన్ని రోజుల పాటు చంద్రబాబు నాయుడు గారు తన ఇంటి బయటకు కూడా రావడానికి అనుమతి ఇవ్వలేదు. పోలీసులు ఆయన ఇంటి గేటుకు తాళ్లు కట్టి అడ్డుకున్నారు. కానీ ఈ రోజు జగన్ ఎక్కడికి కావాలంటే అక్కడికి వెళుతున్నారు. మేం ఎక్కడా అడ్డుకోవడం లేదు.

**టీడీపీ ఎప్పుడూ ప్రతీకార రాజకీయాలను ప్రోత్సహించలేదు**

చట్టాన్ని ఉల్లంఘించినవారు చట్టం ప్రకారం శిక్ష అనుభవించాల్సిందే. రెడ్ బుక్ గురించి నేను బహిరంగంగానే మాట్లాడాను. ప్రతి బహిరంగ సభలో నేను రెడ్ బుక్‌ను చూపిస్తూ.. చట్టాన్ని ఉల్లంఘించిన వారిని న్యాయస్థానాల ముందు నిలబెడతామని ప్రజలకు చెప్పాను. నిజంగా ప్రతీకార రాజకీయాలు చేయాలనుకుని ఉంటే జగన్ ఈ రోజు బయట ఉండేవారా? చంద్రబాబు నాయుడు గారు ఎప్పుడూ ప్రతీకార రాజకీయాలను విశ్వసించరు. 44 ఏళ్ల చరిత్ర కలిగిన తెలుగుదేశం పార్టీ కూడా అలాంటి రాజకీయాలను ఎప్పుడూ ప్రోత్సహించలేదు. కానీ నేరం చేసినవారు, చట్టాన్ని ఉల్లంఘించినవారు చట్టం ముందు సమాధానం చెప్పాల్సిందే. ఇది వ్యక్తిగత ద్వేషం కాదు.

**డేటా సెంటర్లే కొత్త రిఫైనరీలు**

డేటా కొత్త చమురు అయితే.. డేటా సెంటర్లు కొత్త రిఫైనరీలు. ప్రపంచంలో ఇప్పుడు డేటానే కొత్త చమురు. డేటా సెంటర్లే కొత్త రిఫైనరీలు. దీనిని ఎంత త్వరగా అంగీకరిస్తామో, అంత త్వరగా వాస్తవాలకు దగ్గరవుతాం. మన మొబైల్ ఫోన్లు, డిజిటల్ సేవలన్నీ డేటా సెంటర్లపైనే ఆధారపడి ఉన్నాయి. ప్రతి సంవత్సరం గోదావరి నది నుంచి సుమారు 3 వేల టీఎంసీల నీరు సముద్రంలో కలిసిపోతుంది. ఇది బ్రెజిల్ లేదా వియత్నాం దేశాల వార్షిక నీటి వినియోగం కంటే ఎక్కువ. ఆంధ్రప్రదేశ్‌లో 6 గిగావాట్ల డేటా సెంటర్ సామర్థ్యాన్ని ఏర్పాటు చేయాలని మేం భావిస్తున్నాం. దానికి కేవలం ఒకటిన్నర నుంచి రెండు టీఎంసీల నీరు మాత్రమే అవసరం. ఇక ఒక గిగావాట్ థర్మల్ పవర్ ప్లాంట్‌కు, ఒక గిగావాట్ డేటా సెంటర్‌తో పోలిస్తే ఏడు రెట్లు ఎక్కువ నీరు అవసరం. విద్యుత్ అవసరమని అందరూ అంగీకరిస్తారు. మరి డేటా సెంటర్లను ఎందుకు ప్రశ్నించాలి? ఆంధ్రప్రదేశ్‌లో సౌరశక్తి, పవనశక్తి, పంప్ స్టోరేజ్, జలవిద్యుత్ ప్రాజెక్టులు ఉన్నాయి. అందుకే డేటా సెంటర్లకు అవసరమైన పునరుత్పాదక శక్తిని అందించగలుగుతున్నాం.

**డేటా సెంటర్ల ద్వారా ఉద్యోగాల కల్పన జరుగుతుంది**

డేటా సెంటర్లు ఉద్యోగాల సృష్టికి ఉత్ప్రేరకాలుగా పనిచేస్తాయి. డేటా సెంటర్లు ఒక్కటే ఉద్యోగాలను సృష్టించవు. కానీ అవి ఉద్యోగాల సృష్టికి ఒక ఉత్ప్రేరకంగా పనిచేస్తాయి. డేటా సెంటర్ల చుట్టూ మొత్తం ఎకోసిస్టమ్‌ను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావాలనేది మా లక్ష్యం. ఉదాహరణకు క్యారియర్ అనే ఎయిర్ కండీషనింగ్ సంస్థ, డేటా సెంటర్లకు అవసరమైన శీతలీకరణ పరికరాల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టింది. పవర్ ఎలక్ట్రానిక్స్, బ్లేడ్ సర్వర్లు, ర్యాక్‌లు వంటి మొత్తం వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నాం. దీని ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగాలు సృష్టించవచ్చు.

**ఉద్యోగాల సృష్టే మా ప్రధాన లక్ష్యం**

ఉద్యోగాల సృష్టే మా ప్రధాన లక్ష్యం. రాష్ట్రాలు పరస్పరం పోటీ పడాల్సిన అవసరం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో మేం చేసే ప్రతి పనిలో ప్రధాన లక్ష్యం ఉద్యోగాల కల్పనే. కొంతమంది మేం తొందరపాటుగా నిర్ణయాలు తీసుకుంటున్నామని అంటారు. నేను దాన్ని స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటాను. పక్క రాష్ట్రంలో దశాబ్దాలుగా నిలిచిపోయిన ఒక ఉక్కు ప్రాజెక్టును మేం 17 నెలల్లో పూర్తి చేశాం. భారతదేశానికి చెందిన అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఆమ్‌కా) ప్రాజెక్టును కేవలం 37 రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురాగలిగాం. దీనినే నేను స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటాను.

**ఫార్చ్యూన్ 500 కంపెనీలకు 99 పైసలకే భూమి కేటాయిస్తాం**

ఆంధ్రప్రదేశ్‌లో లిఫ్ట్ పాలసీ అనే ఒక విధానం ఉంది. ఫార్చ్యూన్ 500 కంపెనీలు తమ గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లను ఏర్పాటు చేయాలనుకుంటే, వారికి 99 పైసలకు భూమిని కేటాయిస్తాం. ఈ విధానం ద్వారా కాగ్నిజెంట్, టీసీఎస్, ఇన్ఫోసిస్, ఐబీఎం వంటి సంస్థలను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురాగలిగాం. మరికొన్ని కంపెనీలు కూడా త్వరలో రానున్నాయి. నా ఆలోచన చాలా సరళమైంది. భూమిని మార్కెట్ ధరకు విక్రయించి డబ్బు తీసుకోవచ్చు. కానీ 99 పైసలకు ఇచ్చి, ఆ కంపెనీలు క్యాంపస్‌లు నిర్మించి ఉద్యోగాలను సృష్టిస్తే, వాటి ద్వారా ఏర్పడే ఆర్థిక ప్రభావం, పన్నుల రూపంలో ప్రభుత్వానికి వచ్చే ఆదాయం ప్రతి సంవత్సరం ఆ భూమి విలువ కంటే ఎక్కువగా ఉంటుంది.

వ్యాపారవేత్తల దృష్టిలో చూస్తే, ఆ పెట్టుబడిపై నా లాభాల రేటు 100 శాతం. అయితే ఇలాంటి ధైర్యమైన నిర్ణయాలు తీసుకునే నాయకత్వం ఉండాలి. లేకపోతే భారత్ ఎలా ముందుకు సాగుతుంది. ఈ విధానం కోసం నేను నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారినే ఒప్పించాల్సి వచ్చింది. మొదట్లో ఆయనకు కూడా ఈ విధానంపై సందేహాలు ఉండేవి. దీనిపై కోర్టుకు కూడా వెళ్లారు. కానీ న్యాయస్థానం దానిని స్వీకరించలేదు. ఎందుకంటే ఫార్చ్యూన్ 500 కంపెనీలు రాష్ట్రానికి వస్తే అందులో తప్పేముందని కోర్టు ప్రశ్నించింది. మేం చేసే ప్రతి పని కాలపరీక్షను, రాజకీయ పరీక్షను తట్టుకునే విధంగానే ఉంటుంది. ఇది ఎవరికైనా వ్యక్తిగత ప్రయోజనాలు కల్పించడం కాదు. నా కంపెనీకి గానీ, నా స్నేహితుల కంపెనీలకు గానీ లాభాలు చేకూర్చడం కాదు. ఇవి ప్రపంచస్థాయి ప్రమాణాలు కలిగిన ఫార్చ్యూన్ 500 కంపెనీలు. భారతకు అవసరమైన విధానపరమైన విప్లవం ఇదే. దేశం ముందుకు సాగాలంటే ఇలాంటి ధైర్యమైన నిర్ణయాలు అవసరమని మంత్రి పేర్కొన్నారు.

చైతన్యరథం

# ఎరువుల కొరత ఉండదు.. అక్రమాలకు తావులేదు

- డీలర్లు, కంపెనీలకు మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టమైన హెచ్చరిక
- బలవంతపు ఎరువుల విక్రయాలపై ఉక్కుపాదం
- కౌలు రైతులు, ఆండ్రాయిడ్ ఫోన్ లేని రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- నానో యూరియా, సహజ వ్యవసాయంపై అవగాహన పెంచాలని సూచన
- ప్రతి ఎరువుల బస్తాకు పూర్తి లెక్క ఉండేలా పర్యవేక్షణ
- ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే కఠిన చర్యలు, ఎరువుల అక్రమాలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం



అమరావతి (చైతన్యరథం): ఖరీఫ్-2026 వ్యవసాయ సీజన్‌కు సంబంధించి రాష్ట్రంలో ఎరువుల లభ్యత, పంపిణీ, నిల్వలు, సరఫరా పరిస్థితులపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, వివిధ ఎరువుల తయారీ సంస్థల ప్రతినిధులు, డీలర్ల సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు అవసరమైన మేరకు మాత్రమే కాకుండా, అవసరానికి మించి కూడా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా యూరియా సరఫరాలో ఎటువంటి కొరత లేకుండా అధికారులు, కంపెనీలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. యూరియా లేదా డీఏపీ కొనుగోలు చేసే రైతులకు బలవంతంగా కాంప్లెక్స్ ఎరువులు విక్రయించే ధోరణిని వెంటనే నిలిపివేయాలని మంత్రి స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన ఎరువులను మాత్రమే అందించాలని, అనవసరమైన ఉత్పత్తులను బలవంతంగా విక్రయిస్తే సహించబోమని హెచ్చరించారు. రైతులను ఇబ్బందులకు గురిచేసే డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయడమే కాకుండా, సంబంధిత కంపెనీలపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

### ఎమ్మార్పీ ధరకే విక్రయాలు

ఎంఆర్పీ ధర కంటే ఎక్కువ ధరలకు యూరియా విక్రయించడం చట్టవిరుద్ధమని పేర్కొన్న మంత్రి, రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఎరువుల డీలర్లు ఎంఆర్పీ ధరకే విక్రయాలు జరపాలని ఆదేశించారు. ఎవరైనా అధిక ధరలకు విక్రయించినట్లు తేలితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎరువుల పంపిణీలో పారదర్శకతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్న మంత్రి, యూరియా పక్కదారి పట్టకుండా ప్రత్యేక విజిలెన్స్ బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఎరువుల బస్తాకు పూర్తి లెక్క ఉండేలా పటిష్ట పర్యవేక్షణ వ్యవస్థను అమలు చేయనున్నట్లు తెలిపారు. గతంలో జరిగిన అక్రమాలు, అవకతవకలు పునరావృతమైతే ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదని హెచ్చరించారు. రైతులకు ఎరువుల బుకింగ్ కోసం అందుబాటులో ఉన్న యాప్ నిర్వహణ మరింత సజావుగా ఉండాలని మంత్రి సూచించారు. ముఖ్యంగా కౌలు రైతులు, ఆండ్రాయిడ్ ఫోన్ లేని రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఓటీపీలు ఆలస్యంగా రావడం, మెసేజ్ లింకులు సకాలంలో అందకపోవడం వంటి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

### అతి వినియోగంతో అనర్థం

వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులతో పాటు పర్యావరణ హిత విధానాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. నానో యూరియా వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. అదే సమయంలో సహజ వ్యవసాయంపై రైతుల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోందని, దీనిని మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. రసాయన ఎరువుల అధిక వినియోగం వల్ల నేల సారంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్న మంత్రి, సాధ్యమైనంత మేర రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సమతుల్య పోషకాల వినియోగంపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. అధిక ఎరువుల వినియోగం పట్ల అప్రమత్తంగా ఉండాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల సంక్షేమం, ప్రయోజనాలే అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేసిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ మంజీర్ జిలానీ, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఐదు బోధనాసుపత్రుల్లో కృత్రిమ అవయవాల తయారీ యూనిట్లు!

- దివ్యాంగుల వైద్య సేవలకు అనుసంధానంగా
- తొలివిడత కింద విశాఖ, ఒంగోలు, విజయవాడ, తిరుపతి, కర్నూలు బోధనాసుపత్రుల్లో
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలోని ఐదు బోధనాసుపత్రుల్లో తొలిసారిగా కృత్రిమ అవయవాల తయారీ యూనిట్లు రాబోతున్నాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ కాళ్లు, చేతులు, వీల్ ఛైర్లు, వినికిడి పరికరాలు, ఇతర సహాయ ఉపకరణాల తయారీ ఈ కేంద్రాల్లో జరుగుతాయని పేర్కొన్నారు. వైద్యులు సూచనల మేరకు అవసరమైన కృత్రిమ కాళ్లు, చేతులు ఇవ్వడంవల్ల దివ్యాంగులకు వ్యయప్రయాసలు తగ్గుతాయని నేడొక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాసిన లేఖ మేరకు కేంద్ర ప్రభుత్వం ఈ తయారీ యూనిట్లను రాష్ట్రంలో ఏర్పాటుచేసేందుకు ముందుకు వచ్చిందని చెప్పారు. తొలివిడత కింద ఒంగోలు, తిరుపతి, కర్నూలు, విజయవాడ, విశాఖ సర్వజన ఆసుపత్రుల్లో ఈ తయారీ యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన స్థలాలు, నిర్మాణాలు, ఇతర వసతుల పరిశీలన కేంద్ర బృందాల ద్వారా సోమవారం నుంచి ప్రారంభమైందని తెలిపారు. బోధనాస్పత్రుల్లోనే 'సదరం' కింద 21 రకాల దివ్యాంగ సర్టిఫికెట్లను జారీ చేస్తున్నారని మంత్రి తెలిపారు.

### కొలతలు.. తయారీ, అమర్చడం, మరమ్మతులు..

కేంద్ర సామాజిక న్యాయ, సాధికారిత మంత్రిత్వ శాఖ ద్వారా దేశ వ్యాప్తంగా 102 తయారీ కేంద్రాలు నడుస్తున్నాయి. 'ప్రధానమంత్రి దివ్యాంగ వయోశ్రీ' పేరుతో ఇవి నడుస్తున్నాయి. వీటికి అదనంగా మరో 300 కేంద్రాలను 2030 నాటికి ఏర్పాటుచేయాలని మంత్రిత్వ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు రాష్ట్రంలోని 27 జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున కృత్రిమ అవయవాల తయారీ కేంద్రాలను ఏర్పాటుచేయాలని కేంద్రానికి లేఖ రాశారు. దీనిని పరిశీలించిన మంత్రిత్వ శాఖ తొలివిడత కింద ఒంగోలు, తిరుపతి, కర్నూలు, విజయవాడ, విశాఖలోని బోధనాసుపత్రుల్లో వీటిని ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. మహిళా, శిశు, సంక్షేమ శాఖ, వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాల సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధర్ బాబు మధ్య జరిగిన చర్చల అనంతరం భారతీయ కృత్రిమ అవయవాల తయారీ సంస్థ (ఆర్టిఫిషియల్ లింబ్స్ మ్యానుఫాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) తరపున ప్రత్యేక బృందాలు సోమవారం నుంచి పరిశీలించడం ప్రారంభించాయి. వైద్యుల సూచనల మేరకు అందుబాటులో ఉన్న తయారీ యూనిట్లలో కృత్రిమ అవయవాలు తయారు చేయడం సులువుగా ఉంటుంది. దివ్యాంగుల నుంచి కొలతలు తీసుకోవడానికి, తయారుచేయడానికి, అమర్చడానికి, వాటి మరమ్మతులు చేయడానికి, ఇతర అవసరాలకు తగ్గట్లు నియామకాలు జరుగుతాయి. తయారీ పరికరాలు, మౌలిక సదుపాయాలు కల్పన కూడా యూనిట్లలో జరుగుతుంది.

### యూనిట్లలో జరిగే కార్యకలాపాలు

కొలతలు, కాస్టింగ్ (రూపకల్పన): అత్యాధునిక క్లినికల్ మెజర్‌మెంట్ సిస్టమ్స్‌ను ఉపయోగించి, ప్రతి రోగికి సరిపోయేలా అత్యంత కచ్చితమైన పద్ధతిలో ప్రత్యేకమైన అచ్చుల తయారీ జరుగుతుంది.

థర్మో ప్లాస్టిక్ మోల్డింగ్: థర్మోప్లాస్టిక్ పదార్థాలను వాక్యూమ్-ఫార్మింగ్ పద్ధతి ద్వారా మలచి, రోగులకు సౌకర్యవంతంగా ఉండేలా, వారికి అవసరమైన సపోర్ట్ అందించే సాకెట్లు, కస్టమ్ బ్రేస్‌లను (సహాయక సాధనాలను) డిజైన్ చేస్తారు.

అసెంబ్లీ, ఫ్యాబ్రికేషన్ (తయారీ): కాళ్ళు చేతులకు అమర్చే కృత్రిమ అవయవాలు (ప్రోస్తెసెస్), అలాగే వివిధ రకాల స్ప్లింట్లు, కాలిపర్లు వెన్నెముకకు మద్దతు ఇచ్చే బ్రేస్‌ల (ఆర్థోసెస్) తయారీని ప్రామాణిక పద్ధతుల్లో అవసరానికి తగ్గట్టుగా రూపొందిస్తారు.

ఫిట్‌మెంట్, పునరావాసం (రిహాబిలిటేషన్): లబ్ధిదారులకు కచ్చితంగా అమర్చడం, నడక శిక్షణ ఇస్తారు.

# కార్మిక సంక్షేమానికి ప్రాధాన్యత

- మంత్రి వాసంశెట్టి సుభాష్
- సంక్షేమ బోర్డు నూతన వెబ్‌సైట్ ఆవిష్కరణ



విజయవాడ (చైతన్యరథం): కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర కార్మిక సంక్షేమశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. విజయవాడలోని స్వర్ణ ప్యాలెస్ మీటింగ్ హాల్లో సోమవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ కార్మికుల వెల్ఫేర్ బోర్డు 45వ సమావేశంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు. కార్మిక సంక్షేమ కార్యక్రమాలను మరింత పారదర్శకంగా, వేగవంతంగా కార్మికులకు చేరవేసేందుకు రూపొందించిన సంక్షేమ బోర్డు నూతన వెబ్‌సైట్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని కార్మికులకు సంక్షేమ పథకాల సేవలను సులభతరం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. నూతన వెబ్‌సైట్ ద్వారా కార్మికుల నమోదు, సంక్షేమ పథకాల దరఖాస్తులు, లబ్ధిదారుల వివరాలు, పథకాల మార్గదర్శకాలు, ఫిర్యాదుల పరిష్కారం వంటి సేవలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కార్మిక సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, కార్మికులకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యేలా డిజిటల్ వేదికలను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. 45వ బోర్డు సమావేశంలో సంక్షేమ పథకాల అమలు, నమోదు ప్రక్రియల సరళీకరణ, కార్మికుల భద్రత, సామాజిక భద్రతా కార్యక్రమాల విస్తరణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ సెక్రటరీ ఎంవి శేషగిరి బాబు, కమిషనర్ గంధం చంద్రుడు, వెల్ఫేర్ బోర్డు వైస్ ఛైర్మన్ వెంకట శివుడు యాదవ్, వెల్ఫేర్ బోర్డు సభ్యులు ఎ. వెంకట రమణి, ఆరా మహేశ్వరి, అరవరాజు నేలపాల, గదుల సాయిబాబు, బి విశ్వనాథ నాయుడు, డి. నారపరెడ్డి, చింత రేణుక రాజు, నల్లగొప్పుల వెంకట చలపతిరావు, పిడుగు వెంకటరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చైతన్యరథం

# దేవుడి సొమ్ము దేవుడికే.. సనాతన ధర్మ రక్షణే లక్ష్యం

- **మేనిఫెస్టోలోని 11 హామీల్లో కేవలం రెండేళ్లలోనే 10 అమలు చేశాం**
- **వేద పండితుల వేతనం రూ.15 వేలకు పెంపు.. చిన్న ఆలయాల ధూపదీప నైవేద్యాలకు 10 వేలు**
- **ఆలయాల భద్రత, ఆస్తుల రక్షణకు డీజీపీ, కలెక్టర్లతో కూడిన హైపవర్ కమిటీలు**
- **గత ప్రభుత్వ '22- ఏ' భూ అక్రమాల ప్రక్షాళన.. బాధితులైన రైతులకు విచారణ అనంతరం ఎన్ఓసీ ల జారీ**
- **2027 జూన్ 26 నుండి గోదావరి పుష్కరాలు**
- **మార్చి నాటికే 71.60 కోట్లతో 162 ఆలయాల పునర్నిర్మాణ పనులు పూర్తి**
- **మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడి**




అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే దేవాదాయ ధర్మాదాయ శాఖను సంపూర్ణంగా ప్రక్షాళన చేసి, ఏపీని నూతన ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు. గత వైసిపి ప్రభుత్వ ఐదేళ్ల అస్తవ్యస్త పాలనలో ఒక్క విభాగానికి కూడా అధిపతి లేకుండా దేవాదాయ శాఖను నిర్వీర్యం చేశారని, లడ్డూ ప్రసాదం కల్తీ, రామతీర్థం, అంతర్వేది రథం దహనం వంటి అపచారాల చీకటి రోజుల నుంచి ఆలయాలను విముక్తం చేసి, భక్తులలో నమ్మకాన్ని, విశ్వాసాన్ని నూటికి నూరు శాతం పెంపొందించామన్నారు. సచివాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి మీడియా సమావేశంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి... శాఖాపరమైన రెండేళ్ల సుపరిపాలన ప్రగతి, కోట్ల విలువైన ఆలయ భూముల సంరక్షణ, ఉద్యోగాల భర్తీ, మరియు 2027 ప్రతిష్ఠాత్మక గోదావరి పుష్కరాల రోడ్ మ్యాప్‌తో కూడిన సమగ్ర నివేదికను విడుదల చేశారు.

తన నాలుగున్నర దశాబ్దాల రాజకీయ జీవితంలో దేవాలయాల సంక్షేమానికి ఏ రాజకీయ పార్టీ కూడా ప్రత్యేకంగా ఎన్నికల ప్రణాళికను రూపొందించిన దాఖలాలు తాను చూడలేదని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి గుర్తుచేశారు. కానీ నేటి కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలోనే దేవాదాయ శాఖకు ప్రత్యేక స్థానం కల్పించి, 11 ధార్మిక హామీలను ఇచ్చిందని, అందులో 10 హామీలను జీవోలతో సహా వంద శాతం అమలు చేసి చెప్పిన మాట నెరవేర్చుకున్నామని ఆయన ప్రకటించారు.

**చిన్న ఆలయాలకు.. వేద పండితులకు పెద్దపీట**

రూ. 50 వేల కంటే తక్కువ ఆదాయం ఉన్న చిన్న ఆలయాల ధూపదీప నైవేద్యాల నిధులు రూ. 10,000 కు పెంచుతామన్న హామీ మేరకు.. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 6,137 ఆలయాల అర్చకుల బ్యాంక్ ఖాతాల్లో ప్రతి నెలా నేరుగా నగదు జమ చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అలాగే, ఎంతో నియమ నిష్ఠలతో వేద, సంస్కృత విద్యను అభ్యసించిన పండితుల గౌరవ వేతనాన్ని రూ. 10,000 నుండి ఏకంగా రూ. 15,000 కు పెంచామని, దీనివల్ల ప్రస్తుతం 188 మంది వేద పండితులకు తక్షణ లబ్ధి చేకూరుతోందని స్పష్టం చేశారు. వేదం చదివిన యువతకు ఆలయాల్లో ఉపాధి కల్పించి, సనాతన సంప్రదాయాలను రెగ్యులరైజ్ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

**ఆలయాల రక్షణకు డీజీపీ, ఎస్పీలతో హైపవర్ కమిటీలు**

దేవాలయాల భద్రతకు ఆస్తుల రక్షణకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి ఆనం తెలిపారు. రాష్ట్ర స్థాయిలో డీజీపీ, శాంతి భద్రతల ఐజీ, ఎండోమెంట్ కమిషనర్ నేతృత్వంలో.. అలాగే జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన, జిల్లా ఎస్పీ, ఎండోమెంట్ అధికారులతో కూడిన ప్రత్యేక సమన్వయ కమిటీలను నియమించామన్నారు. ఆలయాల రక్షణలో పోలీసు శాఖ నిరంతర పర్యవేక్షణ, రక్షణ ఉండేలా చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. ఆలయ ఉత్సవాలు, పూజా కైంకర్యాలు, వైదిక ఆగమ క్రతువుల నిర్ణయంలో అధికారుల ప్రమేయాన్ని రద్దు చేస్తూ, కేవలం వైదిక సిబ్బందికే సర్వాధికారాలు కల్పించామని తెలిపారు.

**గత ప్రభుత్వ '22-ఏ' భూ అక్రమాలపై ప్రక్షాళన**

రాష్ట్రంలో దేవాదాయ శాఖ పరిధిలో 21,672 ఆలయాలు నోటిఫై అయి ఉన్నాయని, వీటికి సంబంధించి 4.48 లక్షల ఎకరాల భూములు ఆస్తులుగా ఉన్నాయని మంత్రి తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం రాజకీయ కక్షలతో సామాన్య రైతులను భయభ్రాంతులకు గురిచేస్తూ... వారి వంశపారంపర్య సొంత పట్టా భూములను సైతం అక్రమంగా 22-ఏ కింద దేవాదాయ రికార్డుల్లో చేర్చిందని మండిపడ్డారు. ఇవాళ రైతులు తమ పట్టాలు పట్టుకుని వస్తున్నారని, మావి కాని భూములను పరిశీలించి, జిల్లా రెవ్యూ అధికారుల నివేదిక ఆధారంగా కమిషనర్ స్థాయిలో విచారణ జరిపి, బాధితులకు ఎన్ఓసీలు ఇచ్చి రికార్డుల్లో పేర్లు మార్చేందుకు ఈ ప్రభుత్వం చట్టబద్ధమైన ఏర్పాట్లు చేసిందని రైతులకు మంత్రి భరోసా ఇచ్చారు.

**2027 జూన్ 26 నుండి గోదావరి పుష్కరాలు**

రాబోయే గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా, పవిత్రంగా నిర్వహించడానికి దేవాదాయ శాఖ సర్వం సిద్ధం చేస్తోందని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రకటించారు. ఆగమ పండితులు, టీటీడీ వేద పండితులు దేవాదాయ శాఖ పెద్దలందరూ కలిసి 2027 జూన్ 26వ తారీఖున ప్రారంభమై జూలై 7 వరకు 12 రోజుల పాటు గోదావరి పుష్కరాలు నిర్వహించడానికి సుముహూర్తాన్ని నిర్ణయించారని, దీనికి సంబంధించి ప్రభుత్వం జీవో విడుదల చేసిందని తెలిపారు. పుష్కరాల పర్యవేక్షణకు 12 మంది మంత్రులతో కూడిన హైపవర్ సబ్ కమిటీని, స్పెషల్ ఆఫీసర్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి వీరపాండ్యన్ ని నియమించామన్నారు.

**మార్చి నాటికే 162 ఆలయాల నిర్మాణం పూర్తి**

గోదావరి పరివాహక ప్రాంతాల్లోని 162 ఆలయాల పునర్నిర్మాణానికి రూ. 71.60 కోట్ల రూపాయలతో ఇప్పటికే టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించామని మంత్రి తెలిపారు. ఏ పరిస్థితుల్లోనైనా 2027 మార్చి నాటికే ఈ ఆలయాల పునర్నిర్మాణ పనులన్నీ వంద శాతం పూర్తి కావాలని అధికారులకు డెడ్‌లైన్ విధించామన్నారు. జూలై మొదటి వారం నుంచి తానే స్వయంగా 6 జిల్లాల్లో క్షేత్రస్థాయి పర్యటనలు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు శానిటేషన్ గ్రాఫిక్ మేనేజ్‌మెంట్‌తో, 'గ్రీన్ పుష్కరాలు' కాన్సెప్ట్‌తో ఘాట్ల నిర్మాణం జరగనుందని, పీఠాధిపతులందరినీ స్వయంగా ఆహ్వానించి, వారి ఆశీస్సులతో ఈ పుష్కరాలను దిగ్విజయం చేస్తామని వివరించారు.

**బ్రాహ్మణ కార్పొరేషన్ విలీనం - 342 పోస్టుల భర్తీ**

గత వైసిపి పాలనలో బ్రాహ్మణ కార్పొరేషన్‌ను దేవాదాయ శాఖ నుంచి విడదీసి, బీసీ ఎకనామిక్ కార్పొరేషన్‌లో కలపడం అనే ఘోర తప్పిదాన్ని కూటమి ప్రభుత్వం సరిదిద్దిందని మంత్రి ఆనం తెలిపారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌ను తిరిగి దేవాదాయ శాఖలోనే విలీనం చేస్తూ జీవో ఎంఎస్ 63 ను జారీ చేశామన్నారు. చైర్మన్‌గా బుచ్చి రామప్రసాద్ ఆధ్వర్యంలో బ్రాహ్మణ సంక్షేమ కార్యక్రమాలు వేగవంతం చేశామన్నారు. దేవాదాయ శాఖలో సుదీర్ఘకాలంగా ఉన్న ప్రమోషన్ల ప్రక్రియను పూర్తి చేసి, ఖాళీగా ఉన్న 342 పోస్టుల భర్తీకి పారదర్శక నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు.

**తిరుమలలో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' విప్లవం**

తిరుమల తిరుపతి దేవస్థానంలో ప్రవేశపెట్టిన వినూత్న సంస్కరణలను మంత్రి ఆనం వివరించారు. క్యూ లైన్ల మేనేజ్‌మెంట్, భక్తుల రద్దీ, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, పారిశుధ్య పర్యవేక్షణ కోసం టీటీడీలో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' ఆధారిత ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సిస్టంను ఏర్పాటు చేశామన్నారు. ఈ మెరుగైన నిర్వహణ వల్ల గడిచిన మే మాసంలో రికార్డు స్థాయిలో ఏకంగా 25 లక్షల 46 వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారని, ఇది టీటీడీ చరిత్రలోనే ఆల్ టైం రికార్డు అని పేర్కొన్నారు. టీటీడీ అర్చకులు, పరిచారకులు, పోటు వర్కర్లు మరియు ప్రసాద పంపిణీ సిబ్బంది వేతనాలను గణనీయంగా పెంచామని, నిరుద్యోగ వేద పారాయణదారులకు నెలవారీ రూ. 3,000 గౌరవ సంభావన అందిస్తున్నామని తెలిపారు.

**ఆదాయం - భక్తుల రద్దీలో భారీ వృద్ధి**

కూటమి ప్రభుత్వం తీసుకున్న ప్రక్షాళన చర్యల వల్ల నేడు రాష్ట్రంలోని ప్రధాన 22 ఆలయాల వార్షిక ఆదాయం రూ. 182 కోట్ల రూపాయల నుండి ఏకంగా రూ. 239 కోట్ల రూపాయలకు పెరిగిందని మంత్రి వెల్లడించారు. ఈ ఆలయాలను ప్రస్తుతం సంవత్సరానికి 2 కోట్ల 70 లక్షల మంది భక్తులు దర్శించుకుంటున్నారు. విజయవాడ దసరా భక్తుల సంఖ్య 15.90 లక్షలకు, శ్రీశైలం శివరాత్రి భక్తుల సంఖ్య రికార్డు స్థాయిలో 6 లక్షల 50 వేల మందికి చేరిందన్నారు. 13 ప్రముఖ ఆలయాల ఉత్సవాలను అధికారికంగా 'రాష్ట్ర పండుగలు' గా గుర్తిస్తూ, దేవాదాయ శాఖ నుండి ఒక్కో ఆలయానికి గరిష్ఠంగా రూ. 50 లక్షల రూపాయల వరకు ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు మంత్రి ఆనం తెలిపారు.

**సామాజిక, సాంస్కృతిక కేంద్రాలుగా ఆలయాలు**

ఈ ఏడాది ఉగాది పండుగ నాడు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో దళిత, గిరిజన, పేద, బడుగు బలహీన వర్గాల కుటుంబాలకు చెందిన దాదాపు 50 వేల మంది బిడ్డలకు ఉచితంగా అక్షరాభ్యాస కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని మంత్రి తెలిపారు. గుండ్లకమ్మ ప్రాజెక్ట్ పరిసర ప్రాంతాల్లో రెండు అంచెల్లో పూర్తిస్థాయిలో మొక్కలు నాటి, పర్యావరణహిత హరితహారాన్ని ఏర్పాటు చేశామన్నారు. రాబోయే జూలై, ఆగస్టు మాసాల్లో రాష్ట్రవ్యాప్తంగా ఏరువాక పౌర్ణమి, యోగా, ధ్యాన కార్యక్రమాలను ఆలయాల్లో ఘనంగా నిర్వహించేందుకు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని, ఆలయాలను సామాజిక చైతన్య కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి హరి జవహర్ లాల్, కమిషనర్ రామచంద్ర మోహన్, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రామప్రసాద్, తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వైసీపీ వీధి నాటకాలను జనం నమ్మరు

- **నోటీసులొస్తే రోడ్డెక్కడం సిగ్గుచేటు**
- **తప్పు ఎక్కడ జరిగినా చట్టం తన పని తాను చేసుకుపోతుంది**
- **మంత్రి నారాయణ స్పష్టీకరణ**

నెల్లూరు (చైతన్యరథం): నిబంధనల ఉల్లంఘనలపై అధికారులు నోటీసులు ఇస్తే వైఎస్ఆర్సీపీ నేతలు రోడ్డెక్కి వీధి నాటకాలు వేయడం సిగ్గుచేటని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాజకీయ లబ్ధి కోసం చేసే డ్రామాలను జనం నమ్మరన్నారు. నెల్లూరు కలెక్టరేట్ లో సోమవారం జరిగిన గ్రీవెన్స్ సెల్ లో పాల్గొన్న మంత్రి.. వైఎస్ఆర్సీపీ ఆందోళనపై మీడియా అడిగిన ప్రశ్నకు స్పందించారు. నెల్లూరులో ఎంఎల్సీ చంద్రశేఖర్ రెడ్డి కాలేజీకి నోటీసులు ఇవ్వడంపై జరుగుతున్న రాద్ధాంతంపై మంత్రి ఘాటు వ్యాఖ్యలు చేశారు. అసలు ఆ నోటీసుల వ్యవహారం తనకు తెలియనే తెలియదని, మొన్న భీమవరంలో నారాయణ విద్యాసంస్థలకు కూడా అధికారులు నోటీసులు ఇచ్చారని, ఆ విషయాన్ని తన వియ్యంకుడు గంటా శ్రీనివాసరావు ఫోన్ చేసి చెబితేనే తనకు తెలిసిందని వెల్లడించారు. ఎక్కడైనా లోపాలు ఉంటే వాటిని సరిచేసుకోవాలి తప్ప రోడ్డెక్కి ఆందోళనలు చేయాల్సిన అవసరం లేదన్నారు. గత వైఎస్ఆర్సీపీ ప్రభుత్వ హయాంలో కక్షగట్టి నారాయణ గ్రూప్స్‌ను రకరకాలుగా వేధించారన్నారు.అప్పటి ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి నేరుగా వచ్చి ఆందోళన చేసినా తాము ఓపిక పట్టి అధికారుల క్లియరెన్స్ తెచ్చుకున్నామే తప్ప రాజకీయం చేయలేదని గుర్తుచేశారు. మీలా లబ్ధి పొందాలనుకుంటే అప్పట్లో రోజుకో ఆందోళన చేసేవాళ్లమన్నారు. కూటమి ప్రభుత్వం వ్యాపారస్తులను, విద్యాసంస్థలను ఎట్టిపరిస్థితుల్లోనూ ఇబ్బంది పెట్టదని, ఎవరిపైనైనా కక్షపూరితంగా వ్యవహరించదని, తప్పు ఎక్కడ జరిగినా చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు.



# 25న తుంగభద్ర డ్యాం గేట్ల ప్రారంభోత్సవం

- **హాజరుకానున్న కేంద్రమంత్రి సీఆర్ పాటిల్, కర్ణాటక, తెలుగు రాష్ట్రాల సీఎంలు**
- **మంత్రి నిమ్మలను కలసి ఆహ్వానపత్రం అందించిన కర్ణాటక ఎమ్మెల్యేలు**
- **వారితో పలు అంశాలు చర్చించిన మంత్రి నిమ్మల**

అమరావతి (చైతన్యరథం): ఈ నెల 25వ తేదీన తుంగభద్ర డ్యాం గేట్ల ప్రారంభోత్సవానికి హాజరుకావాలని ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకి కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆ రాష్ట్ర ఎమ్మెల్యేలు ఆహ్వానపత్రం అందించారు. అమరావతి సచివాలయంలో కర్ణాటక మాజీ మైనర్ ఇరిగేషన్ మంత్రి ఎన్ఎస్ బోస్ రాజు, ఎమ్మెల్యే బసవరాజ్ రాయ్ రెడ్డి, ఎమ్మెల్సీ బసవన గౌడ బదర్లి సోమవారం మంత్రి నిమ్మల రామానాయుడుని కలిశారు. అనంతరం మంత్రి నిమ్మల రామానాయుడుతో భేటీ అయిన కర్ణాటక ఎమ్మెల్యేలు పలు అంతర్రాష్ట్ర



అంశాల గురించి చర్చించారు.

2024లో వచ్చిన భారీ వరదలకు తుంగభద్ర డ్యాం 19వ గేటు కొట్టుకుపోవడంతో, అప్పటికప్పుడు గేట్లకు సంబంధించి సీనియర్ నిపుణుడు కన్నయ్య నాయుడును పంపి, కొట్టుకుపోయిన గేటు స్థానంలో, భారీ వరదలో సైతం స్టాప్ లాగ్ గేట్ ఏర్పాటు చేశారని గుర్తు చేసుకున్నారు. స్టాప్ లాగ్ గేటు ఏర్పాటు చేయడతో తుంగభద్ర డ్యాంలో 80 టిఎంసిల నీటిని కాపాడుకోవడం ద్వారా అటు కర్ణాటక రాష్ట్రానికి, ఏపీలోని రాయలసీమ ప్రాంతానికి సాగు, తాగు నీరందించడం సాధ్యమైందని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో తుంగభద్ర గేట్లు ప్రమాద భరితంగా ఉన్నాయని నిపుణులు సూచించినా, ఐదేళ్ళ పాలనలో నాటి ముఖ్యమంత్రి జగన్ పట్టించుకోలేదన్నారు మంత్రి నిమ్మల. రాయల సీమ కరువు ప్రాంతానికి జీవనాధారమైన తుంగభద్ర డ్యాం అవసరాన్ని గుర్తించి, సీనియర్ నిపుణుడు కన్నయ్య నాయుడి సూచనల మేరకు 70 ఏళ్ళ నాటి పాత గేట్ల స్థానంలో కొత్తగా 33 గేట్లను ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.51 కోట్లు కేటాయించారని తెలిపారు. పనులు మొదలుపెట్టి కేవలం ఒక్క సీజన్ లోనే కొత్తగేట్ల ఏర్పాటు పనులు పూర్తి చేశారని పేర్కొన్నారు. ఇలా కొత్తగా ఏర్పాటు చేసిన తుంగభద్ర డ్యాం గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్.పాటిల్, కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనబోతున్నారని తెలిపారు.

# గొడ్డలి పార్టీ డీఎన్ఏలోనే వైషమ్యాలు

- **కులాలు, వర్గాల మధ్య చిచ్చు వాళ్లకు తొలినుంచీ అలవాటే**
- **అది జగన్ కుటుంబం తెచ్చిన సంస్కృతి**
- **మంత్రి అనగాని సత్యప్రసాద్ ధ్వజం**

అమరావతి (చైతన్యరథం): కులాలు, వర్గాల మధ్య చిచ్చు పెట్టడం అనేది గొడ్డలి పార్టీ, ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి డీఎన్ఏలోనే ఉందని రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖల మంత్రి అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం మీడియాతో మంత్రి మాట్లాడుతూ కులాల మధ్య, మతాల మధ్య చిచ్చు పెట్టడం వాళ్లకు మొదటినుంచీ అలవాటే. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ శాంతి సామరస్యాలతో ఉన్నప్పుడు మతాల మధ్య చిచ్చు పెట్టడం వాళ్ళు పూర్వకుల నుంచి ఉంది. ఆ కల్చర్ తీసుకు వచ్చిందే ఆ కుటుంబం. దాని కొనసాగింపునే ఈ రోజు మనం చుస్తునాం. 2014 నుంచి 19 మధ్య రాష్ట్ర పునర్నిర్మాణంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం పూర్తిగా నిమగ్నమై ఉంటే.. గొడ్డలి పార్టీ నేతలు ఢిల్లీ వెళ్లి పార్లమెంట్ సాక్షిగా ప్రెస్ మీట్ పెట్టి కులచిచ్చు పెట్టేలా నిస్సిగ్గుగా అబద్ధాలు చెప్పారు. 38 మంది డీఎస్పీలకు ప్రోషన్ ఇస్తే అందులో 35 మంది ఒక సామాజిక వర్గం వారే ఉన్నారని అసత్య ప్రచారం చేశారు. అది అబద్ధాల పునాదుల మీద పుట్టిన పార్టీ. వాళ్ళు చెప్పిన అబద్ధాలు 2019 లో ప్రజలు నమ్మారు కాబట్టి ఒక ఛాన్స్ పేరిట జగన్‌కు అవకాశం ఇచ్చి నిండా మునిగారు. ఐదేళ్ల పాలనలో జగన్, వాళ్ల పార్టీ నాయకులు సాగించిన అరాచకాలను, అణిచివేతను అనుభవించిన రాష్ట్ర ప్రజలు ఇక వాళ్ల అబద్ధాలను ఎంత మాత్రం నమ్మే పరిస్థితి లేదు. ఏ ఇద్దరు కలిసి ఉన్నా, రాష్ట్ర ప్రజలు సుఖంగా ఉన్నా గొడ్డలి పార్టీకి నచ్చదు. రాష్ట్రాన్ని ప్రగతి పథంలో పరుగులు తీయించి, దేశంలోనే నెంబర్ వన్ గా నిలిపేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంటే.. కులాల మధ్య చిచ్చు పెట్టి లబ్ధి పొందాలని గొడ్డలి పార్టీ చూస్తోంది. ఏ సంఘటన జరిగినా కుల రంగు పులమటం చాలా బాధాకరం. వైసీపీ పాలనలో ప్రభుత్వంలో దళిత డాక్టర్ సుధాకర్, మైనారిటీ వ్యక్తి సలాం, బీసీ వర్గాలకు చెందిన అమర్నాథ్ గౌడ్, చంద్రయ్య.. వీళ్ళందరినీ చంపినపుడు కులాలు గుర్తుకు రాలేదా? కూటమి ప్రభుత్వం అందరినీ సమంగా చూస్తుంది. గతంలో కంటే ఇప్పుడు శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయి. నేరాలు తగ్గ ముఖం పట్టాయి. అన్ని డిపార్ట్‌మెంట్లు సమన్వయంతో పని చేస్తున్నాయి. గంజాయి, డ్రగ్స్ లేకుండా చూస్తున్నాం. గొడ్డలి పార్టీ ప్రభుత్వంలో రాష్ట్రమంతటా విస్తరించిన గంజాయి, డ్రగ్స్, కల్తీ



మద్యం వంటి అసాంఘిక వ్యవస్థలను కూటమి ప్రభుత్వం మూలాల నుంచి నిర్మూలిస్తోందని మంత్రి అనగాని స్పష్టం చేశారు.

# జగన్ రెడ్డి బతుకంతా కుట్రలు కుతంత్రాలే

- **నేరస్థుడి విషయంలో కులాలను రెచ్చగొట్టడం సిగ్గుచేటు**
- **2019 ఎన్నికల నాటి కుట్రలు మళ్లీ ఇప్పుడు ప్రారంభించారు**
- **మహిళల్ని అవమానించినోళ్లను జగన్ ప్రోత్సహించడం దుర్మార్గం**
- **ప్రజలకు జవాబుదారీగా ఉండడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్న మంత్రి కొల్లు రవీంద్ర**

విజయవాడ (చైతన్యరథం): ప్రజలకు పారదర్శకమైన పాలన అందించడం, జవాబుదారీగా నిలవడం లక్ష్యంగా కూటమి నాయకులంతా ప్రతి వారం గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు మచిలీపట్నం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కూటమి అధికారంలోకి వచ్చాక ప్రతి వారం ప్రజా సమస్యలు తెలుసుకోవడమే లక్ష్యంగా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామన్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలన్నీ పరిష్కరిస్తున్నాం. ఈ రోజు 36 అర్జీలు వచ్చాయి. వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం. గత వారం 24 దరఖాస్తులు రాగా.. మా పరిధిలోని 21 పరిష్కరించాం. పరిధిలో లేని వాటిని ఆయా అధికారులకు పంపించాం. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 423 అర్జీలు రాగా 329 పరిష్కరించాం. ఇళ్లస్థలాలు వంటి 94 దరఖాస్తులు పెండింగులో ఉన్నాయి. వాటిని కూడా త్వరలోనే పరిష్కరిస్తాం.

ప్రతి వారం గ్రీవెన్స్ నిర్వహించడం, సమస్యలు తెలుసుకుని పరిష్కరించడం కూటమి ప్రభుత్వ పారదర్శకతకు నిదర్శనం. గతంలో ఎమ్మెల్యేలు, మంత్రులు ఎవరూ అందుబాటులో ఉండేవారు కారు. సచివాలయాల్లో పట్టించుకున్న దిక్కు లేదు. బయటకొచ్చి మాట్లాడితే కక్ష గట్టి వేధింపులకు దిగే వారు. తప్పుడు కేసులు పెట్టి హింసించారు. కానీ నేడు ప్రజలు ప్రశాంతంగా వారి సమస్యలు ఎమ్మెల్యేలు, మంత్రులకు



చెప్పుకునే వెసులుబాటు కల్పించాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 90 శాతం అమలు చేశాం. పెన్షన్లు, రేషన్, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు, ఉచిత గ్యాస్ వంటి పథకాలన్నీ పక్కాగా అమలు చేశాం.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచిని చూసి ఓర్వలేక.. కుల, మత, ప్రాంతాల పేరుతో జగన్ కుట్రలు చేస్తున్నాడు. 2014-19 మధ్య కూడా కులాలు మతాల మధ్య చిచ్చు పెట్టి 2019లో అధికారంలోకి వచ్చాడు. ఇప్పుడు కూడా అదే రకమైన కుట్రలు చేస్తున్నాడు. రాష్ట్ర అభివృద్ధిని కాంక్షించేవారంతా జగన్ రెడ్డి కుల రాజకీయాలను తొక్కి పెట్టాలి. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి. కులాల మధ్య చిచ్చు పెట్టొద్దని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెబుతున్నారు. విజయవాడలో సాయికృష్ణ అనే వ్యక్తి పోలీసుల అదుపులో ఉంటూ చనిపోయాడంటూ వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేశారు. అయినప్పటికీ.. ముఖ్యమంత్రి స్పందించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న కృష్ణలంక సీఐని సస్పెండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని కలిసి విచారణ చేస్తామని, న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు.

వైసీపీ హయాంలో ఎన్నో హత్యలు జరిగాయి. దాడులు జరిగాయి. ఎంతో మందిని పొట్టన పెట్టుకున్నా.. ఏ రోజూ స్పందించలేదు. ఈ రోజు పరామర్శల పేరుతో రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నాడు. అంబటి రాంబాబు ఫేక్ ఫోటోలతో ప్రభుత్వంపై ఆరోపణలు చేశాడు. సాయికృష్ణ అనే వ్యక్తిపై హత్య, అత్యాచారం, గంజాయి స్మగ్లింగ్ లాంటి సుమారు 23 క్రిమినల్ కేసులున్నాయి. అలాంటి వ్యక్తికి వంత పాడుతూ ప్రభుత్వంపై బురద జల్లుతున్నాడు. బందరులో ఉన్న మరో పిచ్చోడు ఎంత నీచానికైనా దిగజారుతాడని ఎప్పటికప్పుడు నిరూపించుకుంటున్నాడు. వయసు పెరిగింది కానీ.. కనీసం బుర్ర పని చేయడం లేదు. పోటీ చేయడానికి కూడా భయపడి పారిపోయిన పేర్ని నాని.. బందరులో మాట్లాడితే ప్రజలు ఉపేక్షించరనే భయంతో విజయవాడలో కూర్చుని నిత్యం దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నాడు. హోం మంత్రి అనిత కట్టుకున్న చీర గురించి పెట్టుకునే బొట్టు గురించి ఒక వైసీపీ నేత నీచంగా మాట్లాడాడు. ఇంట్లో వారిని అంటే ఊరుకుంటారా అని మంత్రి నారా లోకేష్ ప్రశ్నిస్తే.. భారతిని, వారి పిల్లల్ని ఏదో అన్నారంటూ పరిగెత్తుకొచ్చేశాడు.

వైసీపీ హయాంలో అసెంబ్లీ సాక్షిగా నారా భువనేశ్వరిని ఎంత దిగజారి విమర్శించారో పేర్ని నాని లాంటి సన్నాసులు గుర్తు చేసుకోవాలి. గతంలో చంద్రబాబు తల్లి గురించి రాజశేఖర్ రెడ్డి ఒక వ్యాఖ్య చేస్తే.. సభ్యులంతా వ్యతిరేకించడంతో చట్ట సభల సాక్షిగా క్షమాపణ చెప్పారు. కానీ ఈ రోజు మహిళల గురించి తప్పుగా మాట్లాడితే.. జగన్ రెడ్డి ఫోన్ చేసి మరీ మెచ్చుకుంటున్నాడు. గతంలో చంద్రబాబు నాయుడు ఇంటిపై దాడి చేసిన జోగి రమేష్ కు మంత్రి పదవి ఇచ్చారు. పార్టీ కార్యాలయపై దాడులు చేసినోళ్లకు, బూతులు మాట్లాడినోళ్లకు పదవులిచ్చారు. మాచర్లలో టీడీపీ నేతపై దాడికి తెగబడిన తుర్కా కిషోర్‌ను మున్సిపల్ ఛైర్మన్ చేశారు. ఇలాంటి నీచాతి నీచమైన పనులు చేయడం వల్లనే.. ప్రజలు 11 సీట్లకు పరిమితం చేశారు. ఇంకా బుద్ధి లేకుండా.. ఇలానే వ్యవహరిస్తూ, బియ్యం దొంగల్ని, గుట్కా పాండుల్ని ప్రోత్సహిస్తున్నారు. వైసీపీ నేతలు చేసే ప్రతి అరాచకం, ప్రతి బూతు వారి రాజకీయ సమాధికి రాళ్లు పేర్చుకోవడమేనని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యన్నారాయణ, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతు వ్యతిరేక విధానాలకు బ్రాండ్ అంబాసిడర్ జగన్!

- అబద్ధాల అడ్డాలా జగన్ ట్వీట్
- ఐదేళ్ల పాలనలో రైతులకు కన్నీళ్లు... ఇప్పుడు కపట ప్రేమ
- గత ఐదేళ్ల మోసాల చరిత్ర మర్చిపోయి నేడు నీతులు చెబుతున్నారు
- రైతు సంక్షేమంపై జగన్ విమర్శలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లే
- కూటమి ప్రభుత్వ విజయాలను చూసి జగన్‌కు వణుకు మొదలైంది
- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



అమరావతి (చైతన్యరథం): రైతుల సంక్షేమం గురించి మాట్లాడే నైతిక అర్హత మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రైతు వ్యతిరేక విధానాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా మారిన జగన్, తన ఐదేళ్ల పాలనలో రైతులను అన్ని విధాలుగా నష్టపరిచి ఇప్పుడు కపట ప్రేమ ఒలకబోస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలు, అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని చూసి ఓర్వలేక అసత్యాలు, అర్ధసత్యాలతో సోషల్ మీడియా వేదికగా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. జగన్ చేసిన తాజా ట్వీట్ అబద్ధాల అడ్డాగా మారిందని, జగన్ పాలనలో రైతులు ఎదుర్కొన్న కష్టాలు, నష్టాలు, ఆత్మహత్యలు, పంటల నష్టపరిహారం కోసం పడిన ఇబ్బందులను ప్రజలు ఇంకా మర్చిపోలేదని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రైతు సంక్షేమంపై జగన్ చేస్తున్న విమర్శలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని, మోసాల చరిత్రను మర్చిపోయి ఇప్పుడు నీతులు చెప్పడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు.

2025-26 సంవత్సరానికి ప్రభుత్వం బడ్జెట్‌లో మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్ కింద రూ.300 కోట్లు కేటాయించినప్పటికీ రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సుమారు రూ.588 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు మంత్రి వెల్లడించారు. 2019-24 మధ్య రూ.2,140 కోట్ల బడ్జెట్ కేటాయించి కేవలం రూ.1,475 కోట్లు మాత్రమే ఖర్చు చేసి రూ.7,700 కోట్లు ఖర్చు చేసినట్లు జగన్ తప్పుడు ప్రచారం చేసుకున్నారని మంత్రి విమర్శించారు. రాష్ట్రాన్ని విధ్వంసం చేసి, ప్రజలను అప్పుల భారంలో ముంచిన జగన్‌కు చంద్రబాబు నాయుడుని విమర్శించే స్థాయి కానీ, నైతిక అర్హత కానీ లేదని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఐదేళ్ల పాటు ఒక కుటుంబం, ఒక వ్యక్తి, ఒక బటన్ పాలన నడిపిన జగన్ ఇప్పుడు ప్రజల కోసం పనిచేస్తున్న చంద్రబాబు నాయకత్వంపై విమర్శలు చేయడం ఆయన రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని మండిపడ్డారు.

### ఆక్వా రైతులపై మొసలి కన్నీరు

జగన్ ... రైతుల గురించి మాట్లాడే ముందు నిజాలు తెలుసుకుని మాట్లాడండి. గోబెల్స్ లా తప్పుడు ప్రచారం చేయడంలో జగన్ సిద్ధహస్తుడు, గత ప్రభుత్వంలో అన్నదాత సుఖీభవ విషయంలో రైతులకు కేంద్రం వాటా కాకుండా 13 వేల సహాయం ఇస్తామని చెప్పి, కేంద్రం-రాష్ట్రం వాటాలను కలిపి ఇచ్చింది మీరే. మేము మాత్రం రైతులను మోసం చేయలేదు. కేంద్రం వాటా ఎంత, రాష్ట్రం వాటా ఎంత అనేది స్పష్టంగా విడివిడిగా మ్యానిఫెస్టోలో చెప్పి పారదర్శకత చూపించాం. రైతులను తప్పుదోవ పట్టించే రాజకీయాలు మాకు తెలియవు. ఆక్వా రైతులపై ఇప్పుడు కపట ప్రేమ చూపిస్తూ మొసలి కన్నీళ్లు కారుస్తున్నారు. మీ హయాంలో ముడి సరుకుల ధరలు పెరగకపోయినా, ఆక్వా ఫీడ్ ధరలను ఏకంగా 7 సార్లు పెంచి, కిలోకు రూ.90 ఉన్న ఫీడ్‌ను రూ.110.06కి తీసుకెళ్లింది నిజం కాదా? ఆ కంపెనీలపై మీకు ఉన్న ప్రేమ ఏమిటి? వారి దగ్గర మీ లాలూచీ ఏమిటో ప్రజలకు చెప్పాలి. 2024లో అధికారంలోకి రాగానే మేము ఫీడ్ ధరలను తగ్గించాం. ఇప్పుడు అంతర్జాతీయంగా యుద్ధ వాతావరణం ఉంది, ముడి సరుకుల ధరలు భారీగా పెరిగాయి. ఫ్యాక్టరీలు నష్టాల్లో నడుస్తున్నా, రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పరిశ్రమ ప్రతినిధులు, రైతులతో సమావేశాలు నిర్వహించి, 2022 నాటి ధరలకే పరిమితం చేశాం. కొత్తగా ధరలు పెంచిన దాఖలాలు లేవు. అలాంటప్పుడు ఆక్వా ఫీడ్ ధరలపై అసత్య ప్రచారం చేసి రైతులను రెచ్చగొట్టడం ఎందుకు జగన్ అని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు.

### పొగాకుపైనా అవే కుట్రలు

పొగాకు రైతుల విషయంలో కూడా మీ రాజకీయ కుట్రలు ఆగడం లేదు. హెచ్‌డీ బర్లీ పొగాకు, వర్జీనియా పొగాకుకు తేడా తెలుసా జగన్ నీకు.... గత ఏడాది హెచ్‌డీ బర్లీ పొగాకు రైతులకు ఇబ్బందులు ఎదురైనప్పుడు ఆ అంశం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని కాబట్టి ప్రభుత్వం ముందుకు వచ్చి రూ.273 కోట్ల సాయాన్ని రైతులకు అందించింది. వర్జీనియా పొగాకు కేంద్ర పొగాకు బోర్డు పరిధిలో ఉంటుందనే కనీస అవగాహన కూడా లేకుండా మాట్లాడుతున్నారు. పొగాకు బోర్డుతో మాట్లాడి, కంపెనీలపై ఒత్తిడి తీసుకొచ్చి రైతుల పొగాకును కొనుగోలు చేయించే చర్యలు ప్రభుత్వం తీసుకుంటుంటే, మీరు మాత్రం మార్కెట్‌లో ఎవరూ కొనరనే భయాలు సృష్టిస్తూ రైతుల్లో ఆందోళన పెంచుతున్నారు. రైతులకు మేలు చేయాలనే ఆలోచన కంటే, మార్కెట్ ధరలు పడిపోయేలా చేసి రాజకీయ లబ్ధి పొందాలనే మీ కుట్రలను ప్రజలు గమనిస్తున్నారు. రైతుల పేరుతో అబద్ధాలు చెప్పి రాజకీయాలు చేసే రోజులు పోయాయి జగన్. మీ హయాంలో జరిగిన అన్యాయాలను రైతులు మర్చిపోలేదు. రైతుల సంక్షేమం కోసం పనిచేసేది ఎవరో, రైతులను వాడుకుని రాజకీయాలు చేసేది ఎవరో ప్రజలకు స్పష్టంగా తెలుసునని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# బందరు సుందరీకరణకు పెద్దపీట

- దశాబ్దాల చరిత్ర కలిగిన మచిలీపట్నం నిర్లక్ష్యానికి గురైంది
- నవంబర్ 14న చిల్డ్రన్స్ డే నాటికి చెరువును అభివృద్ధి చేస్తాం
- ధర్మ చెరువు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలో మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం (చైతన్యరథం): దశాబ్దాల చరిత్ర కలిగిన మచిలీపట్నం నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రానికి ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నానని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. నగరంలోని జిల్లా పరిషత్ సెంటర్ వద్ద ధర్మ చెరువు అభివృద్ధి పనులకు, ఈడేపల్లి శక్తి గుడి వద్ద అమృత్ 1.0 పథకంలో భాగంగా మంజూరైన రూ.13.02 కోట్లతో నిధులతో చేపడుతున్న వర్షపు నీటి పారుదల వ్యవస్థ నిర్మాణానికి ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావుతో కలిసి సోమవారం మంత్రి రవీంద్ర శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మ చెరువు అభివృద్ధికి, నగర సుందరీకరణకు రాష్ట్ర ప్రభుత్వం నుండి నిధులు మంజూరయ్యాయన్నారు. ఎన్నో సంవత్సరాలుగా అభివృద్ధి చేయాలనుకున్నా ఇబ్బందులు ఎదురయ్యాయి. కూటమి గెలిచాక ఈ చెరువును మున్సిపల్ కమిషనర్ శుభ్రం చేయించడం అభినందనీయం. వాకింగ్ ట్రాక్, పిల్లలు ఆడుకోవడానికి ప్లే ఏరియా, కాఫీ షాప్ ఏర్పాటు చేసి ఉల్లాస భరితమైన వాతావరణం కల్పిస్తాం. వచ్చే నవంబర్ 14 చిల్డ్రన్స్ డే నాటికి చెరువు అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం. బందరు నియోజకవర్గం అభివృద్ధికి ధర్మ చెరువు అభివృద్ధి మోడల్‌గా మారుతుంది. దశాబ్దాలుగా రోడ్లను ఆక్రమించుకోవడంతో డ్రైనేజీ ఇబ్బందులు ఎదుర్కొన్నాం. డ్రైనేజీలను కూడా ఆక్రమించడంతో మురుగు నీరు వెళ్లలేని దుస్థితి నెలకొంది. రోడ్ల విస్తరణ కోసం ప్రయత్నించిన సమయంలో ఆ ప్రాంతంలోని షాపుల నుండి వ్యతిరేకత రావడం బాధాకరం. కొత్త షాపులు పెట్టుకోవడానికి మున్సిపల్ కాంప్లెక్స్ కట్టించే ప్రయత్నం చేస్తున్నాం. ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేశాం. మరికొన్ని ప్రాంతాల్లో కూడా ఉపాధి అవకాశాలు ఏర్పాటు చేస్తాం. బందరు నగరాన్ని వేధిస్తున్న మురుగు నీరు, వర్షపు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేలా ప్రభుత్వం పని చేస్తోంది.

మచిలీపట్నంలోని ప్రజలకు తాగునీటి సమస్యలు పరిష్కరించే లక్ష్యంతో వాటర్ ఫిల్టర్లు, యువతకు మహిళలకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ ముందుకొచ్చింది. ఒకప్పుడు చిలకలపూడి రింగ్ ప్రాంతంలో ప్రయాణమంటే భయపడే పరిస్థితి నెలకొనేది. నేడు సెంటర్ డివైడర్ ఏర్పాటు చేసి లైటింగ్ సదుపాయం కల్పించాం. స్కౌట్స్‌కి స్పోర్ట్స్‌కి మధ్య నెలకొన్న వివాదం కారణంగా అభివృద్ధి ఆగిపోయింది. ఇరువురినీ కూర్చోబెట్టి సర్ది చెప్పడంతో కలిసి నడిచేందుకు ముందుకు రావడం అభినందనీయం. ఎవరికి ఇబ్బంది కలగకుండా బందరు అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం. అభివృద్ధి విషయంలో రాజకీయాలు చేయొద్దు. మడుగు పోరంబోకు భూముల్లో ఇళ్ల స్థలాలిచ్చి గత ప్రభుత్వ పెద్దలు ప్రజల్ని దగా చేశారు. అర్బన్ ఫారెస్టుగా అభివృద్ధి చేస్తే పిల్లలు ఆడుకోవడనికి, ప్రకృతి గురించి తెలుసుకోవడానికి పనికొస్తుందని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యన్నారాయణ, మున్సిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్‌టీఐ నూతన కార్యదర్శిగా డా. హనుమంతు పురుషోత్తం బాధ్యతల స్వీకరణ



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ (ఎస్‌టీఐ) శాఖ నూతన కార్యదర్శిగా డా. హనుమంతు పురుషోత్తం సచివాలయంలో 5 వ బ్లాక్ లోని ఆయన ఛాంబర్ లో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌ఛార్జ్ హోదాలో బాధ్యతలు నిర్వర్తిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్‌ను డా.హనుమంతు పురుషోత్తం మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పురుషోత్తంకు సీఎస్ అభినందనలు తెలిపారు.

శాస్త్రవేత్తగా, ఆవిష్కరణల ప్రోత్సాహకునిగా, విద్యావేత్తగా, పరిపాలనాధికారిగా.. సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇన్నోవేషన్, పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ), మేధో సంపత్తి హక్కులు (ఐపీఆర్), సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, సంస్థాగత అభివృద్ధి రంగాలలో దాదాపు 4 దశాబ్దాల అపార అనుభవాన్ని ఆయన కలిగి ఉన్నారు. దేశంలోని ప్రముఖ జాతీయ సంస్థల్లో కీలక నాయకత్వ బాధ్యతలు నిర్వహిస్తూ భారతదేశ విజ్ఞాన, సాంకేతిక, ఆవిష్కరణ వ్యవస్థ బలోపేతానికి ఆయన ఎంతగానో కృషి చేశారు.

ప్రస్తుతం సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ శాఖ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించడానికి ముందు డా. పురుషోత్తం కేంద్ర ప్రభుత్వ విజ్ఞాన, సాంకేతిక మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఆర్‌డీసీ) కు ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేశారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ (ఏఎంటీ) పరిధిలోని ఈఆర్‌బీఏ గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెడికల్ టెక్నాలజీకి డైరెక్టర్‌గా, ఆంధ్ర యూనివర్సిటీ DPIIT-IPR చైర్ ప్రొఫెసర్‌గా సేవలందించారు. ఈ పదవుల ద్వారా ఆవిష్కరణలు, మేధోసంపత్తి సృష్టి, సాంకేతిక వాణిజ్యీకరణ మరియు పరిశ్రమ-విద్యాసంస్థల భాగస్వామ్యాలను ప్రోత్సహించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు.

తనపై అపారమైన నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కూటమి ప్రభుత్వానికి ఆయన ప్రత్యేకంగా ధన్యవాధాలు తెలిపారు. రాష్ట్రంలో విజ్ఞాన, సాంకేతిక, ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే తన ఆలోచనలను ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. సమగ్ర మరియు సుస్థిర అభివృద్ధి కోసం సమాచార సాంకేతిక శాఖ, విద్యాశాఖ, పరిశ్రమల శాఖ, ఆరోగ్య శాఖ, వ్యవసాయ శాఖ, నైపుణ్యాభివృద్ధి శాఖలతో పాటు ఇతర అనుబంధ శాఖల మధ్య సమన్వయం మరియు సహకారాన్ని పెంపొందించడం అవసరమని పేర్కొన్నారు. వ్యూహాత్మక భాగస్వామ్యాలు మరియు పరివర్తనాత్మక కార్యక్రమాల ద్వారా విజ్ఞానశాస్త్రం, సాంకేతికత, ఆవిష్కరణలు, పరిశోధన మరియు పారిశ్రామికత రంగాలలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలపడానికి కట్టుబడి ఉన్నట్లు డా. పురుషోత్తం తెలిపారు.

# గిరిజన సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- గిరిజన సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత
- ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి, సంక్షేమం.. ఈ రెండేళ్లలో జరిగిన కార్యక్రమాలు అందరికీ తెలిసేలా డిస్ ప్లే చెయ్యాలి
- పోలవరం నియోజకవర్గం సమీక్షలో మంత్రి కొలుసు పార్థసారథి
- పాల్గొన్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ట్రైకార్ చైర్మన్ బోరగం శ్రీనివాసరావు




ఏలూరు/బుట్టాయిగూడెం (చైతన్యరథం): ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం కోటరామచంద్రపురం ఐటిడిఏ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం స్థానిక పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ట్రైకార్ చైర్మన్ బోరగం శ్రీనివాసరావు, సంబంధిత అధికారులతో కలిసి రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అధ్యక్షతన, పోలవరం నియోజకవర్గం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. శాఖలు, మండలాలు వారీగా రెండేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పూర్తి అయినవి, పెండింగ్‌లో ఉన్న పనులు, చేయవలసిన పనులను సుదీర్ఘంగా మంత్రి సమీక్షించారు. అనంతరం ప్రజలు నుండి అర్జీలను మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే చిర్రి బాలరాజులు స్వీకరించారు. స్వర్ణ పోలవరం న్యూస్ లెటర్ బుక్‌లెట్స్ ఆవిష్కరించి, అంగన్వాడీ కేంద్రాలకు విద్యుత్తు పొయ్యిలు అందించారు.

ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ దేశ సంపదను కాపాడే గిరిజనుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని, గిరిజన ప్రాంతాలకు పూర్వవైభవం తీసుకు వచ్చేలా కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పిన విధంగా ఒక కుటుంబంలో ఒకరికి తప్పనిసరిగా ఉపాధి కల్పించేందుకు ప్లాన్ ఆఫ్ యాక్షన్ సిద్ధం చేసి, పక్కాగా అమలు చెయ్యాలన్నారు. రాష్ట్రంలో ఒకేరోజు 13 వేలు గ్రామ సభలు నిర్వహించి, పూజ్య బాపూజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం సాధనకు ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు. రాష్ట్రంలో 7 వేలు కిలోమీటర్లు సీసీ రోడ్లు వేశామన్నారు. పోలవరం ప్రాజెక్టు ఆర్ అండ్ ఆర్ కు సంబంధించి ఏవైనా సమస్యలుంటే వాటిపై విచారణ చేసి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. గిరిజన ప్రాంతంలోని ఏడు మండలాల్లో ఉపాధిహామీ కింద రూ. 30 కోట్లతో రహదారుల అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలు పాటించి, నిర్ణీత సమయంలోగా పూర్తి చెయ్యాలని ఆదేశించారు. గిరిజన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమానికి అధికార్లు మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం.. ఈ రెండు ఏళ్ల కూటమి పాలనలో జరిగిన కార్యక్రమాల పూర్తి వివరాలు అందరికీ తెలిసేలా స్వర్ణగ్రామ సచివాలల్లో డిస్ ప్లే చెయ్యాలని ఆదేశించారు. గిరిజనులకు రాజ్యాంగ పరమైన హక్కులు, సంక్షేమ పథకాలు ప్రయోజనాలు సక్రమంగా అందేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు.

గిరిజన సమస్యలు పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ జిల్లాలో గిరిజన సమస్యలు పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి మంచి ఫలితాలు సాధించాలన్నారు. పిజిఆర్ఎస్ లో వచ్చిన అర్జీలు సత్వరమే పరిష్కరించాలని అన్నారు. ఇప్పటివరకు విద్యుత్తు సౌకర్యం లేని గిరిజన ప్రాంతంలోని రెండు మండలాల్లో మూడు గ్రామాలకు సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించటం శుభ పరిణామం అని అభినందిస్తూ ఇదే స్ఫూర్తితో ప్రతి గిరిజన ఇంటికి సోలార్ ప్యానెల్స్ ఉండేలా గిరిజనులకు అవగాహన కల్పించాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఇండ్లకోసం చేసుకున్న దరఖాస్తులు పరిశీలన చేసి మంజూరుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. నిరుద్యోగ యువతకు పరిశ్రమలు స్థాపనకు అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. జాబ్ మేళాలు నిర్వహించి చదువుకున్న గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు.

## గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధి

గిరిజన ప్రాంతంలో విద్యార్హతలు తక్కువగా ఉన్న యువతకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి వారికి ఉపాధి కల్పించేందుకు పక్కా ప్రణాళికలతో అమలు చేసి లక్ష్యాలను అధిగమించాలన్నారు. పశు వులు, మేకలు, గొర్రెలు, తదితర జీవాలు పెంపకానికి రుణాలు కోరిన గిరిజనులకు ఈ ఆర్థిక సంవత్సరంలో నూటికి నూరుశాతం రుణాలను మంజూరు చేయించాలని మంత్రి స్పష్టం చేశారు. డ్వాక్రా మహిళలకు వివిధ వ్యాపారాలకు ఉదారంగా బ్యాంకు రుణాలు మంజూరు చేసేలా అధికారులు కృషి చెయ్యాలన్నారు.


## వినతుల సత్వర పరిష్కారం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు సమన్వయంతో పనిచెయ్యాలని సూచించారు. ప్రజలు నుంచి అందుతున్న వినతులు, సమస్యలను సత్వరమే పరిష్కరించి, పారదర్శకంగా సేవలు అందించాలని అధికారులకు సూచించారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, గ్రామీణ మౌళిక వసతులు, తాగునీటి సరఫరా, రహదారులు, వ్యవసాయం, గిరిజన సంక్షేమం తదితర అంశాలుపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. కొంతమంది అధికారులు పనితీరు మరింత మెరుగు పరచుకోవాలన్నారు. నిర్మాణ దశలో ఉన్న పనులు వేగవంతం చెయ్యాలని, పెండింగులో ఉన్న పనులు కార్యరూపం దాల్చేలా చర్యలు చేపట్టాలని అన్నారు.ప్రజా ప్రతినిధులు మరియు అధికారులు సమన్వయంతో పనిచేసి నియోజకవర్గ అభివృద్ధికి కృషిచెయ్యాలని పేర్కొన్నారు. గిరిజన ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఈ దిశగా అధికార్లు ప్రత్యేక దృష్టిపెట్టాలని అన్నారు.

సమావేశంలో జెడ్పీ సిఈవో పి.జగదాంబ, ఆర్డీవో ఎంవీ రమణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఐ.కిషోర్, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, ఏఎంసి ఛైర్మన్ పొట్టా రామారావు, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ జయవరపు శ్రీరామ్మూర్తి, సాంఘిక సంక్షేమ శాఖ జెడి వై.విశ్వమోహన్ రెడ్డి, గృహనిర్మాణ శాఖ డిడి జి.సత్యనారాయణ, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డా.యు.శోభ, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం ఆర్.వెంకటరావు, జిల్లా, డివిజన్, మండల వివిధ శాఖలు అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడివోలు, ఐటిడిఏ ఇంజనీరింగు అధికారులు, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, గిరిజన సంఘాలు నాయకులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ హాజీల పవిత్ర హజ్ యాత్ర ముగింపు

- చివరి విడత హాజీలు శంషాబాద్‌కు చేరిక



అమరావతి (చైతన్యరథం): పవిత్ర హజ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హాజీలు సోమవారం మూడు విమానాల ద్వారా సురక్షితంగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు.

హజ్ యాత్ర ముగింపు సందర్భంగా మొత్తం 355 మంది హాజీలు సోమవారం హైదరాబాద్ చేరుకోవడంతో యాత్రికుల కుటుంబాల్లో ఆనందం నెలకొంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హాజీలందరూ సురక్షితంగా హైదరాబాద్‌కు చేరుకున్నట్లు హజ్ కమిటీ వర్గాలు తెలిపాయి.

ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ సయ్యద్ అఫ్జల్, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హాజీ హసన్ బాషా, తెలంగాణ హజ్ కమిటీ డైరెక్టర్లు, ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ డైరెక్టర్, హజ్ కమిటీ సిబ్బంది హాజీలకు ఘన స్వాగతం పలికారు.

హజ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని క్షేమంగా స్వదేశానికి చేరుకున్న హాజీలందరికీ వారు శుభాకాంక్షలు తెలియజేశారు.

హజ్ యాత్రికుల సేవలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది, వాలంటీర్ల కృషిని హసన్ బాషా అభినందించారు. పవిత్ర హజ్ యాత్ర ముగింపుతో హాజీల కుటుంబ సభ్యులు, ముస్లిం సమాజ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

# ఎల్‌నినోను సమర్థంగా ఎదుర్కొందాం

- రైతులకు ప్రతి అడుగులో అండగా ఉంటాం
- ముందస్తు ప్రణాళికలతో నష్టాలను నివారిద్దాం
- సచివాలయంలో రైతుల కోసం ప్రత్యేక సమాచార సంచిక ఆవిష్కరించిన మంత్రి అచ్చెన్నాయుడు



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంపై రైతాంగాన్ని అప్రమత్తం చేయడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులపై ప్రతికూల ప్రభావాలను తగ్గించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ ప్రణాళి కతో ముందుకు సాగుతోందని, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు, ముందస్తు ప్రణాళికలు, సాంకేతిక సూచనల ద్వారా రైతులకు అండగా నిలుస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. సచివాలయంలో రైతులకు ఉపయోగపడే విధంగా వ్యవసాయ శాఖ రూపొందించిన "ఎల్‌నినోను సమర్థవంతంగా ఎదుర్కొందాం" అనే ప్రత్యేక సమాచార సంచికను సోమవారం మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ, వాతావరణ మార్పులు, వర్షపాతం లోపాలు, అధిక ఉష్ణోగ్రతలు వంటి ఎల్‌నినో ప్రభావాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్రంలోని వివిధ వ్యవసాయ వాతావరణ మండలాలకు అనుగుణంగా పంటల ఎంపిక, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి యాజ మాన్య పద్ధతులు, నేల తేమ సంరక్షణ చర్యలు, విత్తనాల వినియోగం, పంటల సంరక్షణకు సంబంధి చిన సమగ్ర సూచనలను ఈ సమాచార సంచికలో పొందుపరిచినట్లు తెలిపారు. రైతులు ఈ సూచనలను పాటించడం ద్వారా వాతావరణ ప్రతికూల పరిస్థితుల ను అధిగమించి దిగుబడులను కాపాడుకోవచ్చన్నారు.

వ్యవసాయ శాఖతో పాటు ఉద్యానవన, పశుసంవర్థక, మత్స్య, పట్టు పరిశ్రమ, సహకార శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించే చర్యలను అమలు చేస్తున్నాయని మంత్రి వెల్లడించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, వాతావరణ హెచ్చరికలు, పంటల నిర్వహణ సూచనలు గ్రామ స్థాయి వరకు చేరేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ విశ్వవిద్యాల యాలు, వాతావరణ నిపుణుల సూచనల ఆధారంగా రూపొందించిన ఈ ప్రత్యేక సంచిక రైతులకు మార్గదర్శకంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. పంటల వారీగా, ప్రాంతాల వారీగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే పద్ధతులు, కరువు పరిస్థితులను ఎదుర్కొనే వ్యవసాయ నిర్వహణ చర్యలు ఇందులో పొందుపరచినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఎలాంటి వాతావరణ సవాళ్లు ఎదురైనా రైతులను ఆదుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు సిద్ధంగా ఉన్నాయని మంత్రి స్పష్టం చేశారు. వ్యవ సాయ శాఖ అధికారులు గ్రామ స్థాయిలో రైతులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆయన ఆదేశించారు. ఈ ప్రత్యేక సమాచార సంచిక ద్వారా రైతులు శాస్త్రీయ అవగాహన పెంపొందించుకొని, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు నిర్ణయాలు తీసుకోవడంతో పాటు నష్టాలను తగ్గించుకునే అవకాశం కలుగుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బీ. రాజశేఖర్, డైరెక్టర్ మంజీర్ జిలానీ, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

చైతన్యరథం

# ప్రజా రవాణాలో విప్లవాత్మక సంస్కరణలు

**- సాంకేతికత, పారదర్శకత, సంక్షేమానికి పెద్దపీట**
**- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెల్లడి**
**- ఎలక్ట్రిక్ బస్సులపై అపోహలు వద్దు: స్పెషల్ సీఎస్ కృష్ణబాబు**
**- ప్రైవేటు సిబ్బందికి పరిమితంగానే బాధ్యతలు**

అమరావతి (చైతన్యరథం): గత రెండేళ్లలో ప్రజా రవాణా వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలు తెచ్చి సాంకేతికత, పారదర్శకత, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన, సాంకేతికత ఆధారిత సేవలను అందించడంలో విశేష విజయాలు సాధించామని రవాణా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం సచివాలయంలో పాత్రికేయులతో మంత్రి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ పరమావధిగా, అభివృద్ధి - సంక్షేమం అనే రెండు చక్రాలపై రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థ నాయకత్వంలో రవాణా శాఖ గత రెండేళ్లలో ఎన్నడూ లేని విధంగా పలు సంస్కరణలను అమలు చేసిందని తెలిపారు. రాష్ట్ర ప్రజల సమయాన్ని ఆదా చేయడం, అవినీతి రహిత సేవలను అందించడం, ప్రభుత్వ సేవలను ప్రజల గుమ్మం వద్దకే తీసుకెళ్లడం అనే లక్ష్యంతో రవాణా శాఖ పూర్తిస్థాయి డిజిటల్ రూపాంతరాన్ని సాధించిందన్నారు. అదే సమయంలో మహిళలు, దివ్యాంగులు, ఆటో డ్రైవర్లు, రవాణా కార్మికులు, ప్రయాణికుల సంక్షేమానికి అనేక వినూత్న కార్యక్రమాలను ప్రభుత్వం విజయవంతంగా అమలు చేశామని పేర్కొన్నారు. ప్రజలకు అత్యుత్తమ, సురక్షిత, సాంకేతికత ఆధారిత, పర్యావరణహిత ప్రజా రవాణా వ్యవస్థను అందించడం తమ ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌కు అనుగుణంగా రాబోయే గోదావరి పుష్కరాలు, విశాఖపట్నం అభివృద్ధి ప్రాజెక్టులు, పారిశ్రామిక విస్తరణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని మంత్రి తెలిపారు.

**డిజిటల్ రవాణా సేవలకు కొత్త అధ్యాయం**

ప్రభుత్వం ఏర్పడిన వెంటనే డ్రైవింగ్ లైసెన్సులు, వాహన నమోదు, పర్మిట్లు, ఫీజు చెల్లింపులు తదితర సేవలను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోకి తీసుకువచ్చి ప్రజలకు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరాన్ని తొలగించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 85 ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ సెంటర్ల ద్వారా పారదర్శక, సాంకేతికత ఆధారిత డ్రైవింగ్ పరీక్షల వ్యవస్థను విజయవంతంగా అమలు చేశామన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ జారీ ప్రక్రియలో మానవ జోక్యాన్ని గణనీయంగా తగ్గించి పూర్తి డిజిటల్ విధానాన్ని ప్రవేశపెట్టామన్నారు. రవాణా శాఖ సేవలన్నింటినీ ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలను అందిస్తున్నామన్నారు. మిగిలిన టెస్టింగ్ కేంద్రాలను కూడా రాబోయే మూడు నెలల్లో పూర్తిస్థాయిలో ప్రారంభించి రాష్ట్రవ్యాప్తంగా ఏకరీతి, ఆధునిక సేవలను అందుబాటులోకి తీసుకురానున్నామని తెలిపారు.

**"సారథి" యాప్ - ప్రజల చేతిలో రవాణా శాఖ**

సాంకేతికతను ప్రజలకు మరింత చేరువ చేస్తూ "సారథి" మొబైల్ అప్లికేషన్ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్, పర్మిట్, వాహన నమోదు, పన్నుల చెల్లింపులు, దరఖాస్తుల స్థితి తెలుసుకోవటం వంటి సేవలను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. ఇది డిజిటల్ గవర్నెన్స్‌లో రవాణా శాఖ సాధించిన కీలక సంస్కరణగా నిలిచిందని తెలిపారు.

**ఆటో డ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం అండ**

ఆటో డ్రైవర్లు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలని గుర్తించిన మా ప్రభుత్వం వారి సంక్షేమం, భద్రత, నైపుణ్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. ఈ దిశగా చిత్తూరు, అనంతపురం, కర్నూలు, తిరుపతి, ప్రకాశం, నెల్లూరు, గుంటూరు తదితర జిల్లాల్లో ప్రత్యేక శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసి ఇప్పటివరకు 2.34 లక్షలకుపైగా ఆటో డ్రైవర్లు, యజమానులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు, ప్రయాణికుల సేవలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందన వంటి అంశాలపై సమగ్ర శిక్షణ ఇచ్చాం. ఈ కార్యక్రమాల ద్వారా ఆటోడ్రైవర్లలో వృత్తిపరమైన నైపుణ్యాలు పెంపొందడంతో పాటు, ప్రజలకు మరింత సురక్షితమైన, నాణ్యమైన రవాణా సేవలు అందించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.

**రవాణా శాఖ ఆదాయంలో రికార్డు వృద్ధి**

సమర్థవంతమైన పరిపాలన, సాంకేతికత ఆధారిత సేవల విస్తరణ, పెండింగ్ పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించడం వల్ల రవాణా శాఖ ఆదాయంలో గణనీయమైన వృద్ధి నమోదైంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.4,004 కోట్లుగా ఉన్న శాఖ ఆదాయం, 2025-26 నాటికి రూ.5,050 కోట్లకు పెరగడం ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు, పారదర్శక పరిపాలన, సమర్థవంతమైన ఆర్థిక నిర్వహణకు నిదర్శనం. డిజిటల్ సేవలను మరింత సులభతరం చేసి పారదర్శకంగా అందుబాటులోకి తీసుకురావడం వల్ల ప్రజల్లో రవాణా శాఖ సేవలపై విశ్వాసం మరింత పెరిగింది. దీనికి నిదర్శనం 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 8,85,497 వాహనాలు నమోదు కావడమేనని తెలిపారు.

**24×7 కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్**

రవాణా సేవల నాణ్యత, సామర్థ్యం, భద్రతను మరింత మెరుగుపరచే లక్ష్యంతో అత్యాధునిక 24×7 కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ వ్యవస్థ ద్వారా రవాణా సేవల నిరంతర



పర్యవేక్షణ, ఫిర్యాదుల తక్షణ పరిష్కారం, రోడ్డు భద్రతపై సమగ్ర నిఘా, బస్సుల కదలికల మానిటరింగ్, అలాగే ప్రయాణికులకు మరింత మెరుగైన సేవల అందజేతను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

**మహిళా సాధికారతకు "స్త్రీశక్తి" పథకం**

సూపర్ సిక్స్ హామీలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న "స్త్రీశక్తి" పథకం మహిళల జీవితాల్లో సామాజిక, ఆర్థిక సాధికారతకు కొత్త దిశను చూపిందని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 24 గంటల పర్యవేక్షణతో, 47 వేల మందికి పైగా ఏపీఎస్‌ఆర్టీసీ ఉద్యోగుల సమష్టి కృషితో ఈ పథకం సమర్థవంతంగా అమలవుతోందన్నారు. ప్రస్తుతం ఆర్టీసీ ఫ్లీట్‌లో సుమారు 74 శాతం బస్సుల ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తుండగా మహిళల బస్సు ప్రయాణ వాటా 60 శాతానికి పైగా పెరిగిందని వెల్లడించారు. ఈ పథకం అమలుకు ప్రభుత్వం ప్రతిరోజూ సుమారు రూ.8.50 కోట్లు వ్యయం చేస్తోందని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనను పెంపొందించడంతో పాటు ఉపాధి అవకాశాల విస్తరణకు, కుటుంబాలపై ప్రయాణ వ్యయ భారం తగ్గించడానికి ఈ పథకం విశేషంగా దోహదపడుతోందని స్పష్టం చేశారు.

**దివ్యాంగులకు "దివ్యాంగ శక్తి"**

సమాజంలోని ప్రతి వర్గానికి సమాన అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం "దివ్యాంగ శక్తి" కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా 21 రకాల దివ్యాంగులకు ప్రత్యేక బస్సు పాస్‌లు, సులభమైన, అందుబాటులో ఉండే ప్రయాణ సౌకర్యాలు కల్పించడంతో పాటు, వారి అవసరాలకు అనుగుణంగా మరింత గౌరవప్రదమైన, సమ్మిళిత ప్రజా రవాణా వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు.

**ప్రయాణికుల సంతృప్తిలో భారీ పెరుగుదల**

రాష్ట్ర విభజన అనంతరం కూడా ఏపీఎస్‌ఆర్టీసీ దేశంలోనే అత్యుత్తమ ప్రజా రవాణా సంస్థలలో ఒకటిగా తన ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకోవడం గర్వకారణమని మంత్రి తెలిపారు. స్వతంత్ర సర్వేల ప్రకారం ప్రయాణికుల సంతృప్తి స్థాయి 90 శాతం నుంచి 96 శాతానికి పెరగడం, సంస్థ అందిస్తున్న సేవల నాణ్యత, సమయపాలన, భద్రతా ప్రమాణాలు, సిబ్బంది అంకిత భావం, ప్రజాసేవల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు.

**రోడ్డు భద్రతలో విశేష ఫలితాలు**

రోడ్డు భద్రతకు ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు చేపట్టిన ప్రత్యేక చర్యలు, ఆధునిక పర్యవేక్షణ వ్యవస్థలు, డ్రైవర్ల శిక్షణ కార్యక్రమాల ఫలితంగా ఆర్టీసీ బస్సుల ప్రమాదాల నిష్పత్తి గణనీయంగా తగ్గింది. 10 లక్షల కిలోమీటర్లకు గాను ప్రమాదాల నిష్పత్తి 2024-25లో 0.07 నుంచి 2025-26లో 0.06కు తగ్గడం, ప్రయాణికుల భద్రతకు ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం తీసుకుంటున్న సమర్థవంతమైన చర్యలకు నిదర్శనం. ఈ విజయంతో ఆర్టీసీ దేశంలోనే అత్యంత సురక్షిత ప్రజా రవాణా సంస్థలలో ఒకటిగా తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుందని మంత్రి వెల్లడించారు.

**కొత్త బస్సులతో సేవల విస్తరణ**

ప్రజలకు ఆధునిక ప్రజా రవాణా సేవలు అందించాలనే లక్ష్యంతో 2024-25 సంవత్సరంలో 1,189 కొత్త బస్సులను ఆర్టీసీ ఫ్లీట్‌లో చేర్చామని మంత్రి తెలిపారు. వీటిలో ఏసీ, నాన్ ఏసీ, స్టార్ లైనర్, స్లీపర్ కోచ్‌లు వంటి అత్యాధునిక బస్సులు ఉండగా ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు, సురక్షిత ప్రయాణం, సౌకర్యవంతమైన దీర్ఘదూర సేవలను అందిస్తూ సేవల నాణ్యతను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తున్నాయని పేర్కొన్నారు.

**గ్రీన్ ట్రాన్స్‌పోర్ట్‌కు అత్యంత ప్రాధాన్యత...**

పర్యావరణ పరిరక్షణ, ఇంధన వ్యయ నియంత్రణ, సుస్థిర ప్రజా రవాణా వ్యవస్థ అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ ట్రాన్స్‌పోర్ట్‌కు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వ సహకారంతో 1,000 ఎలక్ట్రిక్ బస్సులను మంజూరు చేయించడంతో పాటు, జీసీసీ (గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్) మోడల్‌లో 5,120 ఎలక్ట్రిక్ బస్సులను దశలవారీగా ఆర్టీసీలో ప్రవేశపెట్టే కార్యాచరణ చేపట్టామని ఆయన వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజా రవాణా వ్యవస్థను ఎలక్ట్రిఫికేషన్ దిశగా విస్తరించడంతో పాటు, పర్యావరణహిత రవాణాను మరింత ప్రోత్సహించేందుకు సీఎన్‌జీ బస్సుల కొనుగోలుకు కూడా చర్యలు చేపట్టామని, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆధునిక, సురక్షిత, ఇంధన సామర్థ్యమున్న రవాణా వ్యవస్థను నిర్మించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.

**సాంకేతిక సేవల్లో ముందంజ**

ఏపీఎస్‌ఆర్టీసీ మొబైల్ యాప్, వాట్సాప్ టికెటింగ్, యూపీఐ, డెబిట్ కార్డ్, క్రెడిట్ కార్డ్ చెల్లింపులు, డిజిటల్ బస్సు పాస్‌లు, వాహన ట్రాకింగ్, టికెట్ బుకింగ్, టికెట్ రద్దు వంటి సేవలను ఒకే వేదికపై అందిస్తూ దేశంలోనే అత్యాధునిక ప్రజా రవాణా సంస్థగా నిలిచిందని తెలిపారు.

**ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అంకితం**

ఆర్టీసీ విజయానికి ఉద్యోగుల అంకితభావమే మూలస్తంభమనే విశ్వాసంతో ప్రభుత్వం వారి సంక్షేమం, సేవా భద్రత, వృత్తి పురోగతికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. గత రెండేళ్లలో పెండింగ్‌లో ఉన్న పదవీ విరమణ ప్రయోజనాల పరిష్కారంతో పాటు, కారుణ్య నియామకాల ద్వారా వందలాది కుటుంబాలకు ఉపాధి కల్పించామని, ఉద్యోగుల కుటుంబాలకు రూ.7 కోట్లకు పైగా ప్రయోజనాలను అందించామని వెల్లడించారు. అదేవిధంగా డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్స్, ఆర్టిజన్ విభాగాలకు సంబంధించిన 11 కీలక విధానాల అమలుకు ప్రభుత్వ ఆమోదం లభించిందని, ఉద్యోగుల సేవా భద్రత, పదోన్నతులు, సంక్షేమం, వృత్తిపరమైన స్థిరత్వాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అనేక సంస్కరణలను అమలు చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

**జాతీయ స్థాయిలో గౌరవం**

సురక్షిత రవాణా, సమర్థవంతమైన నిర్వహణ, ప్రయాణికుల సేవలు, సాంకేతిక వినియోగంలో విశిష్ట ప్రతిభ కనబరిచినందుకు ఏపీఎస్‌ఆర్టీసీ 2026 సంవత్సరానికి జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక గుర్తింపు పొందిందని మంత్రి తెలిపారు.

**2026--27 కార్యాచరణ లక్ష్యాలు**

2026--27 సంవత్సరాన్ని రవాణా రంగంలో సాంకేతికత, సుస్థిరత, ప్రజా సేవల విస్తరణకు నూతన మైలురాయిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించించాం. రవాణా శాఖలో రాష్ట్రవ్యాప్తంగా 100 శాతం డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకురావడం, అన్ని ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ సెంటర్లను పూర్తి స్థాయిలో ప్రారంభించడం, రోడ్డు భద్రతా ప్రమాణాలను మరింత మెరుగుపరచడం, శాఖ ఆదాయంలో వృద్ధిని సాధించడం ప్రధాన లక్ష్యాలుగా నిర్దేశించాం. అదేవిధంగా ఆర్టీసీలో 5,120 ఎలక్ట్రిక్ బస్సులను దశలవారీగా ప్రవేశపెట్టడం, సీఎన్‌జీ బస్సుల కొనుగోలుకు శ్రీకారం చుట్టడం, గ్రామీణ ప్రాంతాలకు మరిన్ని బస్సు సేవలను విస్తరించడం, 100 శాతం డిజిటల్ టికెటింగ్ వ్యవస్థను అమలు చేయడం, ప్రయాణికుల సంతృప్తి స్థాయిని 98 శాతానికి పెంచడమే లక్ష్యం. తద్వారా దేశంలోనే అత్యాధునిక, సురక్షిత, పర్యావరణహిత ప్రజా రవాణా వ్యవస్థగా ఆర్టీసీని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

**ఎలక్ట్రిక్ బస్సులపై అపోహలు వద్దు**

మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు రవాణా శాఖ స్పెషల్ సీఎస్ ఎం.టి.కృష్ణబాబు సమాధానం చెబుతూ ఎలక్ట్రిక్ బస్సుల ప్రవేశపెట్టడంపై ఉద్యోగులు, కార్మిక సంఘాలు ఎలాంటి అపోహలకు గురికావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. సంస్థను బలోపేతం చేయడం తప్ప.. ఎలాంటి రూపంలోనూ ప్రైవేటీకరించే ఉద్దేశం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన విధానాలకు అనుగుణంగా దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలు GCC (Gross Cost Contrac) విధానాన్ని అమలు చేస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా కామన్ టెండర్ల ద్వారా ఇదే నమూనాలో ఎలక్ట్రిక్ బస్సులను అందిస్తోందన్నారు. ఈ విధానంలో యాజమాన్య హక్కులు, సేవల నిర్వహణ, ప్రయాణికుల సేవలు, డ్రైవర్ల నిర్వహణ, షెడ్యూళ్లు, ఆదాయ నిర్వహణ, కార్యకలాపాల పర్యవేక్షణ మొత్తం సంస్థ ఆధీనంలోనే కొనసాగుతుందని తెలిపారు. ప్రైవేట్ భాగస్వామ్య సంస్థలకు కేవలం బస్సుల సాంకేతిక నిర్వహణ, నిర్వహణ సహాయం, చార్జింగ్ మౌలిక సదుపాయాల నిర్వహణ వంటి పరిమిత బాధ్యతలు మాత్రమే ఉంటాయని వివరించారు. ఏ డిపో, ఏ ఆస్తి, ఏ ఉద్యోగాన్ని ప్రైవేటీకరించే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ఆర్టీసీ డ్రైవర్లు, మెకానిక్స్, సాంకేతిక సిబ్బందికి ప్రత్యేక శిక్షణ అందించి ఎలక్ట్రిక్ వాహనాల నిర్వహణలో పూర్తి నైపుణ్యాన్ని కల్పిస్తామని తెలిపారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఎలక్ట్రిక్ బస్సులు విజయవంతంగా నడుస్తున్న అనుభవాలను అధ్యయనం చేసి అక్కడ ఎదురైన ప్రారంభ సమస్యలను పరిగణనలోకి తీసుకుని మరింత సమర్థవంతమైన వ్యవస్థను రూపొందిస్తున్నామన్నారు. ప్రతి బస్సుకు అత్యాధునిక మానిటరింగ్ వ్యవస్థ, చార్జింగ్ మౌలిక సదుపాయాలు, అత్యవసర నిర్వహణ బృందాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఎలక్ట్రిక్ బస్సుల ప్రవేశంతో ఆర్టీసీ ఉద్యోగుల హక్కులు, ఉద్యోగ భద్రత లేదా సేవా ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలగదన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర ఉద్యోగులందరికీ కొత్త సాంకేతికతకు అనుగుణంగా ప్రత్యేక శిక్షణ అందించి వారి నైపుణ్యాలను మరింత మెరుగుపరుస్తామన్నారు. ఉద్యోగుల సంక్షేమం, సంస్థ బలోపేతం, ఆధునిక ప్రజా రవాణా సేవలు అనే మూడు లక్ష్యాలను సమన్వయం చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా సమాధానం చెబుతూ రోడ్డు భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు.

## రైతుల ఖాతాల్లో రూ.3,125 కోట్లు పడితే...

# ఓర్వలేక విషం చిమ్ముతున్న 'సాక్షి'

- అన్నదాత ఆత్మఘోష పేరిట అసత్య కథనాలు
- వాస్తవానికి అది జగన్ రెడ్డి ఆత్మఘోషే
- చంద్రబాబు పాలన రైతులకు స్వర్ణయుగం
- గతంలో అధికారంలోకి రాగానే చంద్రబాబు రుణమాఫీ జీఓను అటకెక్కించి రైతులను ముంచిన ద్రోహి జగన్ రెడ్డి
- జగన్ రెడ్డి ఐదేళ్లలో కనీసం ఒక్క ఏడాది కూడా రైతులకు డ్రిప్ పరికరాలు ఇవ్వలేదు
- చంద్రబాబు గతంలోనే 14 లక్షల మందికి డ్రిప్ ఇచ్చారు
- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అప్పసాని రాజేష్



అమరావతి (చైతన్యరథం): రైతులకు నేరుగా లబ్ధి చేకూరుస్తూ "అన్నదాత సుఖీభవ"ను విజయవంతంగా అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వంపై, ఓర్వలేక జగన్ రెడ్డి తన విషపత్రిక ద్వారా దుష్ప్రచారం చేయిస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అప్పసాని రాజేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గడిచిన రెండు రోజుల్లో 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను 'అన్నదాత సుఖీభవ' పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.5,000, 'పీఎం కిసాన్' కింద కేంద్ర ప్రభుత్వం రూ.2,000 కలిపి మొత్తం రూ.7,000 చొప్పున రాష్ట్రంలోని 46.85 లక్షల మంది రైతు కుటుంబాల ఖాతాల్లో రూ.3,125 కోట్లను కూటమి ప్రభుత్వం నేరుగా జమ చేసిందన్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.2,342.92 కోట్లు కాగా, కేంద్ర ప్రభుత్వ వాటా రూ.782.55 కోట్లు.

లబ్ధిదారుల్లో 45,69,817 మంది భూయజమానులైన రైతులు, 1,16,021 మంది అటవీ భూములు సాగు చేస్తున్న రైతులు ఉన్నారు. ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని వక్రీకరిస్తూ, 'అన్నదాత ఆత్మఘోష' అంటూ సాక్షి పత్రికలో తప్పుడు కథనాలు ప్రచురించడం దుర్మార్గం. అసలు ఇది అన్నదాత ఆత్మఘోష కాదు, ప్రజలు అధికారాన్ని దూరం చేశారనే జగన్ రెడ్డి ఆత్మఘోష మాత్రమేనని స్పష్టమవుతోందన్నారు.

చంద్రబాబు నాయుడుని పాలకుడిగా చూడటం రాష్ట్ర ప్రజలకు ఇదేమీ మొదటిసారి కాదు. అలాగే గడిచిన ఐదేళ్లలో జగన్ రెడ్డి దుష్పాలనను కూడా చూశారు. 2014-19 మధ్య కాలంలో, అలాగే 2024లో నాల్గవ విడత ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి, ఇటీవల 2026 జూన్ నాటికి విజయవంతంగా రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న చంద్రబాబు నాయుడు వ్యవసాయ రంగాన్ని, రైతుల ఆదాయ వనరులను కాపాడేందుకు తీసుకున్న చర్యలు మన కళ్లముందే ఉన్నాయని అప్పసాని చెప్పారు.

### 2014-19 మధ్య చంద్రబాబు స్వర్ణయుగ పాలన

2014-19 మధ్య కాలంలో చంద్రబాబు నాయుడు వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పథంలో నడిపించి, రైతన్నకు మెరుగైన ఆదాయ వనరుగా తీర్చిదిద్దారు. నాడు సుమారు 46 లక్షల మంది రైతులకు రూ.50 వేల లోపు ఉన్న రుణాలను ఒకే దఫాలో రద్దు చేశారు. రైతులకు ఇచ్చిన లక్షన్నర రుణమాఫీ వాగ్దానాన్ని నిలబెట్టుకుంటూ, 2019 ఎన్నికల కంటే ముందే నాలుగు విడతలుగా నిధులు జమ చేసి జీవో విడుదల చేశారు. కానీ నాటి ప్రతిపక్ష నేత జగన్ రెడ్డి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి, ఆ తర్వాత 2019లో ఆయన అధికారంలోకి వచ్చాక ఆ జీవోను పూర్తిగా అటకెక్కించి రైతులకు వెన్నుపోటు పొడిచారు.

నాడు చంద్రబాబు ప్రభుత్వం అగ్రికల్చర్ మెకనైజేషన్ (వ్యవసాయ యాంత్రీకరణ) కు అత్యంత ప్రాధాన్యతనిస్తూ 'రైతు రథం' పేరుతో సుమారు 26,000 ట్రాక్టర్లను సబ్సిడీపై అందించింది. రోలర్లు, స్ప్రేయర్లు, తైవాన్ పంపులు వంటి యాంత్రీకరణ పరికరాలను పెద్ద ఎత్తున పంపిణీ చేసింది. వర్షాల నుండి ధాన్యాన్ని కాపాడుకోవడానికి, ఆరబెట్టుకోవడానికి టార్పాలిన్లు, గోనె సంచులు, పట్టాలను సైతం నాడు రైతులకు అందించారు. ఇరిగేషన్ రంగంలో రైతులకు సాగునీరు అందించేందుకు 'నీరు-చెట్టు' కింద రూ.68 కోట్లు ఖర్చు చేశారు. రాయలసీమలోని కరవు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, అక్కడి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి రూ.12,500 కోట్లు ఖర్చు పెట్టారు. అంతేకాకుండా, 90 శాతం సబ్సిడీతో 14 లక్షల మంది రైతులకు డ్రిప్ పరికరాలను అందించిన ఘనత చంద్రబాబు ప్రభుత్వానిదేనని అప్పసాని స్పష్టం చేశారు.

### జగన్ రెడ్డి ఐదేళ్ల దగా - కూటమి ప్రభుత్వ రెండేళ్ల ప్రగతి

జగన్ రెడ్డి ఏదో మంచి చేస్తాడనుకుని 2019లో ఆయన సొంత మీడియా, సోషల్ మీడియా చేసిన అర్భాటపు ప్రచారాల వల్ల ప్రజలు ఆయనకు అధికారం ఇచ్చారు. కానీ ఐదేళ్ల పాలనలో జగన్ రెడ్డి రైతులకు చేసింది శూన్యం. రైతులను అప్పుల ఊబిలోకి నెట్టి వంచించారు. ఐదేళ్లలో సాగునీటి ప్రాజెక్టులపై కనీసం రూ.30,000 కోట్లు కూడా ఖర్చు చేయలేని చేతగాని స్థితి జగన్ రెడ్డి ప్రభుత్వానిది. ఇరిగేషన్ రంగానికి చంద్రబాబు గతంలోనే రూ.12,500 కోట్లు ఖర్చు పెడితే, జగన్ రెడ్డి కేవలం రూ.2,000 కోట్లతో సరిపెట్టారు. కనీసం ఏ ఒక్క ఏడాది కూడా రైతులకు డ్రిప్ పరికరాలు ఇవ్వని ఏకైక పాలకుడు జగన్ రెడ్డి. 2019 ఎన్నికల కంటే ముందే చంద్రబాబు 'అన్నదాత సుఖీభవ' పేరుతో రూ.15,000 రైతుల ఖాతాల్లో జమ చేస్తే, తాను అధికారంలోకి వస్తే రూ.12,500 ఇస్తానని చెప్పి జగన్ మాట తప్పారు, మడమ తిప్పారు.

కేంద్రం ఇచ్చే రూ.6,000లను కూడా తన ఖాతాలో వేసుకుని, తన బొమ్మతో ప్రచారం చేసుకున్న పబ్లిసిటీ పిచ్చి జగన్ రెడ్డిది. ఐదేళ్ల కాలంలో ధాన్యం కొనుగోళ్లను కేవలం 46 లక్షల క్వింటాళ్లకే పరిమితం చేసి రైతులకు తీవ్ర అన్యాయం చేశారు. దానికి భిన్నంగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలోనే ఏకంగా రూ.24,000 కోట్లు సాగునీటి ప్రాజెక్టుల కోసం ఖర్చు చేసి, అన్నదాతకు సాగునీరు అందించేందుకు యుద్ధప్రతిపాదికన ముందుకు సాగుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2019-20 నుంచి 2023-24 వరకు ధాన్యం కొనుగోళ్లు, రైతులకు చెల్లింపులు క్రమంగా తగ్గుతూ వచ్చాయి. ముఖ్యంగా 2023-24 నాటికి ధాన్యం సేకరణ 42.61 లక్షల మెట్రిక్ టన్నులకు పడిపోగా, రైతులకు చెల్లింపులు కేవలం రూ.9,312 కోట్లకే పరిమితమయ్యాయి. జగన్ పాలన ముగిసేనాటికి 84,724 మంది రైతులకు రూ.1,674.47 కోట్ల ధాన్యం బకాయిలు చెల్లించకుండా వదిలేశారు. రైతులు ధాన్యం అమ్మితే డబ్బుల కోసం 3 నుండి 6 నెలలు ఎదురుచూడాల్సిన పరిస్థితి తెచ్చారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే ఆ రూ.1,674 కోట్ల పాత బకాయిలను రైతుల ఖాతాల్లో జమ చేసిందని అప్పసాని తెలిపారు.

### ధాన్యం సేకరణలో కూటమి ప్రభుత్వ సరికొత్త రికార్డులు

కూటమి ప్రభుత్వం 2024-25 రబీలో 19.84 లక్షల టన్నుల ధాన్యం సేకరించి భారీ పురోగతి సాధించింది. ఒకే ఆర్థిక సంవత్సరంలో 55.79 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.12,857.59 కోట్లను 7.68 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేసి రికార్డు సృష్టించింది. ఇక 2025-26 ఖరీఫ్‌లో రికార్డు స్థాయిలో 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి, రూ.11,300 కోట్లను కేవలం 24 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ చేయడం దేశ చరిత్రలోనే అరుదైన ఘట్టం. అందులోనూ రూ.7,300 కోట్లను కేవలం 8 గంటల్లోనే జమ చేసి రైతు అనుకూల పాలన అంటే ఏమిటో నిరూపించింది.

మొత్తం మీద 2025-26 నాటికి 71.02 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి, 10 లక్షలకు పైగా రైతులకు రూ.16,853 కోట్ల భారీ చెల్లింపులు చేసి రైతన్నకు అండగా నిలిచింది. నేడు కూటమి ప్రభుత్వం రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తూ నిజమైన భరోసా కల్పిస్తోందని అప్పసాని అన్నారు.

### బడ్జెట్ అంకెల్లో మోసాలు - మార్కెట్ నిధుల కేటాయింపు

బడ్జెట్ అంకెల్లో మోసం చేయడం జగన్ రెడ్డికే చెల్లింది. 2019-24 మధ్య ధరల స్థిరీకరణ నిధికి ఏకంగా రూ.7,500 కోట్లు కేటాయించామని గొప్పలు చెప్పుకున్న గత ప్రభుత్వం, ఐదేళ్లలో ఖర్చు చేసింది కేవలం రూ.880 కోట్లు మాత్రమే. మిగిలిన నిధులు ఎటు పోయాయో సమాధానం చెప్పాలి. మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్ కింద రూ.3,000 కోట్లు ఇస్తానన్న జగన్ రెడ్డి ఆ హామీని పూర్తిగా విస్మరించారు. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం 2024-25 బడ్జెట్ లో రూ.300 కోట్లు ప్రతిపాదించినప్పటికీ, అవసరాన్ని బట్టి ఆ ఖర్చును పెంచి రూ.588 కోట్లకు పైగా రైతులకు నేరుగా మద్దతు ఇచ్చింది. ఇందులో మామిడి రైతులకు రూ.190 కోట్లు, ఉల్లి రైతులకు రూ.128.33 కోట్లు, పొగాకు రైతులకు రూ.240 కోట్లు, కోకో రైతులకు రూ.12 కోట్లు చెల్లించింది. రాయలసీమలో నష్టపోయిన ఉల్లి రైతులకు ప్రభుత్వం తరపున హెక్టారుకు రూ.50,000 చొప్పున సాయం అందించింది. మొత్తంగా రూ. 12వేల కోట్లు విడుదల చేసి రైతుకు అండగా నిలిచిందని అప్పసాని వివరించారు.

### గ్లోబల్ హార్టికల్చర్ హబ్ గా సీమ

గతంలో వైఎస్ రాజశేఖర రెడ్డి 2004లో చంద్రబాబు 'వ్యవసాయం దండగ' అన్నారని వక్రీకరించి మాట్లాడారు. చంద్రబాబు ఏ సందర్భంలో, ఎవరితో మాట్లాడారో తెలుసుకోకుండా, తాము అధికారంలోకి వస్తే వ్యవసాయాన్ని పండుగ చేస్తామని 2019 ముందే జగన్ రెడ్డి అపనిందలు వేశారు. ఇప్పటికీ దానికి సంబంధించిన సాక్ష్యాలు చూపించలేకపోయారు. జగన్ రెడ్డి తన ఐదేళ్ల ఘోర పాలనలో వెబ్‌ల్యాండ్ అక్రమాలు, జీఓ 365 తెచ్చి 220 సాగునీటి ప్రాజెక్టుల పనుల రద్దు, కౌలు రైతుల శాపనార్థాలతో వ్యవసాయ రంగాన్ని కుదేలు చేశారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, హంద్రీనీవా, పోలవరం ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారు. చివరికి తన సొంత నియోజకవర్గమైన పులివెందులకి కూడా నీళ్లు ఇవ్వకుండా రైతాంగాన్ని వంచించారు.

గతంలో అనేకమంది రాయలసీమ ప్రాంతం నుంచి ముఖ్యమంత్రులు అయినా, వెనుకబడిన సీమ కోసం రూ.లక్ష కోట్లు కేటాయించే సాహసం ఎవరూ చేయలేదు. గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే రాయలసీమను దేశంలోనే అగ్రగామిగా నిలిపారు. 2017-18లోనే ఉద్యాన రంగంలో 17.16 శాతం రికార్డు వృద్ధి సాధించి, రాష్ట్రాన్ని దేశానికే 'ఫ్రూట్ బాస్కెట్'గా మార్చారు. రూ.3,870 కోట్లతో హంద్రీనీవా ప్రాజెక్టును పూర్తి చేసి, రికార్డు స్థాయిలో కేవలం 190 రోజుల్లోనే 40 టీఎంసీల కృష్ణా జలాలను తరలించి సీమ కరవును తరిమికొట్టారు. గాలేరు-నగరి ద్వారా కృష్ణా జలాలను కడపకు తీసుకెళ్లే పనులు వేగవంతం చేశారు. వెలిగొండ ప్రాజెక్టుతో పాటు సీమ ప్రాజెక్టులన్నీ పూర్తయితే ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో సైతం ఉద్యాన పంటల విస్తీర్ణం మరింత పెరుగుతుంది. నాడు కరవు వస్తే టమాటా, ఉల్లి, మామిడి, చీనీ రైతులకు సబ్సిడీల ద్వారా ప్రత్యేక నిధులు ఇచ్చి ఆదుకున్నారు. కియా వంటి అంతర్జాతీయ పరిశ్రమను తెచ్చి యువతకు ఉద్యోగాలిచ్చారు. గతంలో తెచ్చిన రూ.25 లక్షల కోట్ల పెట్టుబడుల్లో దాదాపు రూ.4.5 లక్షల కోట్లు సీమకే కేటాయించారు.

నేడు కూటమి ప్రభుత్వంలో ఆధునిక సాంకేతికతను ఉపయోగించి రైతును ప్రపంచస్థాయికి తీసుకువెళ్తున్నారు. రాయలసీమ ఇంటిగ్రేటెడ్ అభివృద్ధికి రూ.లక్ష కోట్లు, సాగునీటి ప్రాజెక్టులకు రూ.10,014 కోట్లు కేటాయించడం రాష్ట్ర బడ్జెట్ చరిత్రలోనే ఒక రికార్డు. ప్రపంచవ్యాప్తంగా ఉద్యాన పంటలకు హబ్‌గా రాయలసీమను రూ.లక్ష కోట్లతో ముందుకు తీసుకువెళ్తున్నారు. ప్రతి రైతును రాజును చేయడమే లక్ష్యంగా, రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారని అప్పసాని తెలిపారు.

# మామిడి చెట్లు నరికేసి వైసీపీ నేత దౌర్జన్యం..

- జగనన్న కాలనీ పేరుతో వైసీపీ నేతల భూ కుంభకోణం.. బినామీల పేర్లతో ఇళ్ల పట్టాల దందా
- కోర్టు వివాదంలో ఉన్న భూమిపై వైసీపీ కార్యకర్త కన్ను, బలవంతంగా కబ్జా
- టీడీపీ సానుభూతిపరులని కక్ష సాధింపు.. 30 ఏళ్ల నాటి ఇళ్ల పట్టా రద్దు చేసి వేధింపులు
- 29 సెంట్ల భూమిపై వైసీపీ నేత కన్ను.. న్యాయం చేయాలి
- సమస్యలపై టీడీపీ కేంద్ర కార్యాలయానికి పోటెత్తిన అర్జీదారులు
- అర్జీలు స్వీకరించిన రెవెన్యూ శాఖ మంత్రి అనగాని, ఏపీ మాదిగ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి

అమరావతి (చైతన్యరథం): పలు సమస్యలపై అర్జీదారులు సోమవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమానికి తరలివచ్చారు. రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్, ఏపీ మాదిగ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి.. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేశారు.

తిరుపతి జిల్లా రైల్వేకోడూరు మండలం మొలకలపోడు గ్రామానికి చెందిన విజయ్ కుమార్ నేతలకు అర్జీ ఇచ్చి అభ్యర్థిస్తూ.. గ్రామంలో తమ కుటుంబానికి చెందిన, అన్ని రికార్డులూ సక్రమంగ ఉన్న, పాసు పుస్తకాలు కూడా ఉన్న తమ సొంత వ్యవసాయ భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని ఫిర్యాదు చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీకి చెందిన ఒక వ్యక్తి రాజకీయ అండదండలతో, ఒక ప్రైవేట్ సర్వేయర్‌ను తెచ్చి అక్రమంగా సర్వే చేయించి, ఆ తర్వాత రౌడీ మూకలను వెంటబెట్టుకుని పొలంలోకి చొరబడ్డాడు. సుమారు 65 నుండి 70 సంవత్సరాల నాటి, దాదాపు రూ. 3.70 లక్షల విలువైన కాపు కాస్తున్న మామిడి చెట్లను నరికేసి నష్టం కలిగించాడు. ఈ దౌర్జన్యాన్ని అడ్డుకోగా.. కత్తులు, గొడ్డళ్లతో దాడికి దిగి చంపేస్తామని బెదిరించారు. దీనిపై రైల్వేకోడూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం తహశీల్దార్ కార్యాలయానికి పంపారు. అయితే, సదరు వైసీపీ నేత ఒత్తిళ్లకు తలొగ్గి కోడూరు తహశీల్దార్ ఇప్పటివరకు ఆ ఫైలుపై సంతకం చేయకుండా కాలయాపన చేస్తూ, నిందితుడికి కొమ్ముకాస్తున్నారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని అభ్యర్థించారు.

నంద్యాల జిల్లా కానాల గ్రామానికి చెందిన విశ్వనాథరెడ్డి, శిరిగిరి రవి విజ్ఞప్తి చేస్తూ..గత ప్రభుత్వంలో హైస్కూల్ కొట్టాల పరిధిలోని జగనన్న కాలనీలో దాదాపు 100కు పైగా ఇళ్ల పట్టాలను అనర్హులకు కట్టబెట్టారని తెలిపారు. అప్పటి రెవెన్యూ అధికారులు, స్థానిక వైసీపీ నాయకులు కుమ్మక్కై, బినామీ పేర్లతో ఈ పట్టాలను సృష్టించారు. ఆ తర్వాత ఒక్కో ప్లాట్‌ను రూ. 5,00,000 నుండి రూ. 7,00,000 లక్షల వరకు బయటి వ్యక్తులకు విక్రయించి భారీగా సొమ్ము చేసుకున్నారు. నిబంధనల ప్రకారం ఒకరికి కేటాయించిన ప్లాట్ లో మాత్రమే ఇల్లు నిర్మించుకోవాలి. కానీ ఇక్కడ కొనుగోలు చేసిన వ్యక్తులు రెండు, మూడు ప్లాట్లను కలిపేసి పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నా, స్థానిక అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోనిలేదు. దీనిపై సమగ్ర విచారణ జరిపి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అన్నమయ్య జిల్లా పీలేరు మండలం తలపుల గ్రామానికి చెందిన నారాయణ రెడ్డి విజ్ఞప్తి చేస్తూ..గ్రామంలో చాలా కాలంగా తమ అనుభవంలోనే ఉన్న వ్యవసాయ భూమికి సంబంధించి ప్రస్తుతం కోర్టులో వివాదం నడుస్తున్నప్పటికీ, దానిని ఏమాత్రం లెక్కచేయకుండా స్థానిక వైసీపీ కార్యకర్త ఒకరు దౌర్జన్యంగా తమ పొలంలోకి చొరబడి భూమిని ఆక్రమించుకుని, బలవంతంగా దున్నేశాడని ఫిర్యాదు చేశారు. దీనిని అడ్డుకోబోయిన తనపై తీవ్రంగా దౌర్జన్యానికి దిగాడు. తన భూమిని కబ్జా చేసి, తనపై దౌర్జన్యం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని, తన భూమిని తనకు ఇప్పించాలని పీలేరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. ఎన్నిసార్లు పీలేరు పోలీసులకు ఫిర్యాదు చేసినా, వారు కనీసం పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారు. నిందితులపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

విజయనగరం జిల్లా వంగర మండలం వీవీఆర్ పేట గ్రామానికి చెందిన వన్నాల గౌరమ్మ విజ్ఞప్తి చేస్తూ..తెలుగుదేశం పార్టీ హయాంలో.. 24-02-1988 నాటి వలస భూమి కేటాయింపుల్లో భాగంగా తనకు సర్వే నెంబర్ 1611లోని ప్లాట్ నెంబర్ 6లో రెండు సెంట్ల ఇళ్ల స్థలాన్ని ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. అయితే, భర్త తీవ్ర అనారోగ్యానికి గురికావడం, కుటుంబ ఆర్థిక పరిస్థితి చాలా దారుణంగా ఉండటంతో ఆ స్థలంలో అప్పట్లో ఇల్లు నిర్మించుకోలేకపోయాం. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తమ కుటుంబం మొదటి నుండి టీడీపీ సానుభూతిపరులు అనే కారణంతో రాజకీయ కక్ష సాధింపునకు దిగారు. తమకి ఉన్న రెండు సెంట్ల ఇళ్ల పట్టాను నిబంధనలకు విరుద్ధంగా రద్దు చేసి, వారి పార్టీకి చెందిన వేరే వ్యక్తులకు ఆ స్థలాన్ని కట్టబెట్టారు. అయితే, అలా పట్టాలు పొందిన వైసీపీ వ్యక్తులు కూడా ఇప్పటివరకు ఆ స్థలంలో ఎలాంటి ఇంటి నిర్మాణం చేపట్టకుండా ఖాళీగా వదిలేశారు. తమ ఇంటి స్థలాన్ని తిరిగి తమకు ఇవ్వాలని కోరారు.

వైఎస్ఆర్ కడప జిల్లా మైలవరం మండలం జంగాలపల్లి గ్రామానికి చెందిన దస్తగిరిమణి గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..గత ప్రభుత్వం చేపట్టిన "రీ-సర్వే" సమయంలో తన భూమికి సంబంధించిన అసలు



పత్రాలను అధికారులకు చూపించి, రికార్డులు సరిచేయాలని అనేకసార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ, ఒక వైసీపీ నాయకుడికి భయపడిన రెవెన్యూ అధికారులు ఈ సమస్యను కావాలనే పక్కన బెట్టేశారని తెలిపారు. దీనిపై సదరు పార్టీ వ్యక్తులను నిలదీయగా.. తనని తీవ్రంగా బెదిరిస్తూ దౌర్జన్యానికి దిగుతున్నారు. తనకు జీవనాధారమైన 29 సెంట్ల భూమిని గత ప్రభుత్వంలో వైసీపీ నాయకుడు ఒకరు అక్రమంగా ఆన్‌లైన్ చేసుకున్నాడు. అధికారుల చుట్టూ తిరిగినా లాభం లేకపోగా తనను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

చిత్తూరు జిల్లా కుప్పంకు చెందిన కామాక్షి విజ్ఞప్తి చేస్తూ..తమకు ప్రభుత్వం తరపున ఒక సెంటు ఇళ్ల స్థలం మంజూరయిందని తెలిపారు. ఇటీవల తన స్థలానికి రక్షణగా ప్రహరీ గోడ (కంపౌండ్ వాల్) నిర్మాణం చేపట్టగా స్థానిక వైసీపీ కార్యకర్తలు కొందరు గుంపుగా వచ్చి నిర్మాణాన్ని అడ్డుకున్నారు. అంతటితో ఆగకుండా కడుతున్న గోడను సైతం పగలగొట్టి, నిలదీసిన తనపై తీవ్రంగా దౌర్జన్యం చేస్తూ హత్యాప్రయత్నానికి పాల్పడ్డారు. వారి నుంచి తనకు ప్రాణభయం పొంచి ఉంది. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

విశాఖపట్నం జిల్లా గాజువాకకు చెందిన వరలక్ష్మి విజ్ఞప్తి చేస్తూ.. గాజువాక ప్రాంతంలో తనకు 160 గజాల నివాస స్థలం (ప్లాట్) ఉందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో స్థానిక వైసీపీ నాయకులు, కొందరు వార్డు సచివాలయం సిబ్బంది కుమ్మక్కయి, తనకి చెందిన 160 గజాల స్థలాన్ని అక్రమంగా ఆక్రమించుకుని, నకిలీ పత్రాలు సృష్టించారు. ఆ ప్లాట్‌ను బయటి వ్యక్తులకు ఏకంగా రూ. 15,00,000 అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. దీనిపై ప్రశ్నించినందుకు సదరు నాయకులు తనను తీవ్రంగా బెదిరించారు. ఒంటరి మహిళ కావడంతో వారి అండదండలు, దౌర్జన్యాల ముందు తాను పోరాడలేకపోయాను. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

అన్నమయ్య జిల్లా పెద్దమండ్యం మండలం గురివిరెడ్డిగారిపల్లె గ్రామానికి చెందిన మదార్ సాహెబ్ విజ్ఞప్తి చేస్తూ.. గత 30 ఏళ్లుగా కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని తెలిపారు. తమకి 1999 జూన్ 24న అప్పటి రెవెన్యూ అధికారులు సర్వే నెంబర్ 948-2 లో 25 సెంట్ల స్థలానికి పట్టా ఇచ్చారు. 2016వ సంవత్సరంలో పక్క స్థలం వారి వల్ల సమస్యలు తలెత్తగా, అప్పటి తహశీల్దార్ స్వయంగా వచ్చి సర్వే చేయించి న్యాయం చేశారు. అయితే, 2019లో ప్రభుత్వం మారిన తర్వాత స్థానిక రాజకీయ నాయకులు కక్ష సాధింపు ధోరణితో తమ స్థలంలో 2 సెంట్ల భాగాన్ని ఆక్రమించుకున్నారు. అంతేకాకుండా, తమ ఇంటి ముందర పాడుపడి ఉన్న ఒక చేద బావిని బలవంతంగా పూడ్చివేశారు. ఆ బావిని పూడ్చడం వల్ల భారీగా మట్టిపైకి తేలి, కొండలా పేరుకుపోయింది. ప్రస్తుతం ఆ మట్టి కుప్ప కారణంగా వర్షం పడిన ప్రతిసారీ నీరంతా రోడ్డుపైకి పోకుండా, నేరుగా తమ ఇంట్లోకి వస్తోంది. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి న్యాయం జరగలేదు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

ప్రకాశం జిల్లా జె.పంగులూరుకు చెందిన అనంతలక్ష్మి గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తన వద్ద నుండి ఇద్దరు వ్యక్తులు ప్లాట్ల పేరుతో రూ. 7 లక్షల నగదు తీసుకున్నారని తెలిపారు. అందులో రూ. 4 లక్షలకు సంబంధించి ఒక ప్లాట్‌కి సంబంధించిన పత్రాలు తనకి ఇచ్చారు. అయితే మిగిలిన రూ. 3లక్షలకు ఇవ్వాల్సిన మరో ప్లాట్‌ను ఇవ్వకుండా కాలయాపన చేస్తూ వచ్చారు. తన ప్లాట్ ఇవ్వకపోడంతో తను ఇచ్చిన డబ్బుల గురించి సదరు వ్యక్తులను గట్టిగా నిలదీయటంతో.. దీనితో కక్షగట్టి తన వద్ద ఉన్న ఒరిజినల్ పత్రాలన్నింటినీ బలవంతంగా లాక్కున్నారు. అంతటితో ఆగకుండా, తాము చేసిన మోసం బయటపడకుండా ఉండేందుకు తనపై చిలకలూరిపేట పోలీస్ స్టేషన్‌లో అక్రమంగా 'కిడ్నాప్ కేసు' పెట్టించి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

నంద్యాల జిల్లా కానాల గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేస్తూ..గత ప్రభుత్వంలో తన వ్యవసాయ భూమిలో సగాన్ని 'జగనన్న కాలనీ' ఇళ్ల స్థలాల కోసం రెవెన్యూ అధికారులు సేకరించారని తెలిపారు. మిగిలిన సగం భూమిని ఆన్‌లైన్ రికార్డుల్లో నమోదు చేసి, పట్టాదారు పాసు పుస్తకం ఇస్తామని అప్పట్లో బాధ్యత తహశీల్దార్ హామీ ఇచ్చారు. అయితే సదరు అధికారి బదిలీ కావడంతో, తహశీల్దార్ కార్యాలయంలో గత 8 సంవత్సరాలుగా పని చేస్తున్న రీ-సర్వే అధికారి (ఆర్.ఐ).. మిగిలిన భూమిని ఆన్‌లైన్ చేయాలంటే తనకు రూ. 6 లక్షల నగదుతో పాటు, 15 సెంట్ల భూమిని లంచంగా రాసివ్వాలని వేధించారు. అందుకు నిరాకరించడంతో, కక్షపూరితంగా వ్యవహరించిన సదరు అధికారి తన భూమిని ఆన్‌లైన్ చేయకుండా నిలిపివేశారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి న్యాయం జరగలేదు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వేజళ్ళ గ్రామానికి చెందిన సుభానీ ఖాన్ గ్రీవెన్స్ విజ్ఞప్తి చేస్తూ..అమరావతి మండలం, కర్లపూడి గ్రామంలోని సర్వే నెంబర్ 217లో దాదాపు 14ఎకరాల 40సెంట్ల పీర్లమాన్యం వ్యవసాయ భూమి ఉందని తెలిపారు. ఈ భూమిపై తమ తాతలైన మొహమ్మద్ ఖాన్, ఆదం సాహెబ్, ఖాసిం ఖాన్, అలీ ఖాన్, హుస్సేన్ ఖాన్, ఖాదర్ ఖాన్ కాలం నుండి సర్వహక్కులు ఉన్నాయి. గతంలో ఈ భూమిని తమ కుటుంబ సభ్యులే సొంతంగా సాగు చేసుకుంటూ జీవనం సాగించేవారు. అయితే కొంతకాలంగా కర్లపూడి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఈ 14 ఎకరాల 40 సెంట్ల భూమిని అక్రమంగా ఆధీనంలోకి తీసుకుని, తమను పొలంలోకి రాకుండా అడ్డుకుంటూ వారే పండించుకుంటున్నారు. తమకు జీవనాధారమైన ఇంత పెద్ద భూమి పరాయిపాలవడంతో, ప్రస్తుత పరిస్థితుల్లో బ్రతకడమే కష్టంగా మారింది. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

చిత్తూరుకు చెందిన సుధాలక్ష్మి విజ్ఞప్తి చేస్తూ..తాను. తన తండ్రి కలిసి గతంలో చెరొక ప్లాట్ కొనుగోలు చేశామని తెలిపారు. తాము కొన్న ప్లాట్లకు చుట్టూ రక్షణ కంచె లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని అధికారులు అక్కడ ఎస్పీ ఆఫీస్ భవనాన్ని నిర్మించారు. దీనిపై అప్పట్లో కలెక్టర్‌కి, ఎస్పీకి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించాను. 1981లో గోపాలకృష్ణయ్య అనే వ్యక్తి వద్ద ఈ లేఅవుట్ ప్లాట్లను కొనుగోలు చేశాను. అయితే, 2007లో అప్పటి ఆర్.ఐ విజయసింహారెడ్డి సదరు లేఅవుట్ సైట్‌ను రికార్డుల్లో 'పొరంబోకు భూమి'గా మార్చేశారు. ఆ వెంటనే 2008లో ఆర్డీఓ శేషాద్రి అక్కడ ఎస్పీ ఆఫీస్ నిర్మాణానికి పునాది వేశారు. తమ ప్లాట్ల స్థలాన్ని కాపాడుకునేందుకు 2009లో రిట్ పిటిషన్ వేశాను. ఈ భూవివాదంపై సుదీర్ఘ విచారణ అనంతరం 14-12-2012న రాష్ట్ర హైకోర్టు కీలక తీర్పునిచ్చింది. తనకు 120 రోజుల్లోగా ఏదో ఒక రూపంలో తగిన పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కానీ, నాటి నుండి నేటి వరకు రెవెన్యూ అధికారులు హైకోర్టు ఆదేశాలను ఏమాత్రం పట్టించుకోలేదు. తిరిగి 2023లో జిల్లా కోర్టును ఆశ్రయించగా, ఇంతవరకు తనకు న్యాయం జరగలేదు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం ముంటిమడుగు కొత్తపల్లి గ్రామానికి చెందిన కోటపాడు రామానాయుడు విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలోని సర్వే నెంబర్లు 396/2, 376/3 లలోని తమకు పూర్తి పట్టా హక్కులున్న 5.06 ఎకరాల స్వంత వ్యవసాయ భూమిలో ఇటీవల స్థానిక రాజకీయ నాయకులు కొందరు తన అనుమతి లేకుండా దారి నిర్మించడానికి పూనుకున్నారు. తన పొలం దెబ్బతింటుందని, దారి వేయవద్దని బతిమాలినా వినకుండా దౌర్జన్యంగా ఆ 5.06 ఎకరాల భూమిలోనే దారి వేశారు. దీనిపై స్థానిక రెవెన్యూ అధికారులను ఆశ్రయించగా.. వారు క్షేత్రస్థాయికి వచ్చి కేవలం పరిశీలించి వెళ్లారు తప్ప, అక్రమ దారి నిర్మాణాన్ని అడ్డుకోలేదు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం గంటి పల్లిపాలెం గ్రామానికి చెందిన నాగరత్నం విజ్ఞప్తి చేస్తూ..రావులపాలెం మండలం, గోపాలపురం గ్రామం పరిధిలోని 33 సెంట్ల పుంత ఆక్రమణ భూమిని తమ కుటుంబం గత 70 ఏళ్లుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తోందని తెలిపారు. ఇందుకు గాను ప్రభుత్వ అధికారులు 1977లోనే తమకి పొజిషన్ సర్టిఫికేట్ కూడా జారీ చేశారు. కొందరు వ్యక్తులు నకిలీ పత్రాలు సృష్టించి తమ భూమిని ఆక్రమించుకున్నారు. తమ కుటుంబ సభ్యులు ఊరిలో లేని సమయం చూసి, కొంతమంది రౌడీలను వెంటబెట్టుకుని వచ్చి, తాము కష్టపడి పండించిన పంటను దౌర్జన్యంగా కోసుకుని పోయారు. దీనిపై నిలదీయగా.. తమపైనే ఎదురు కేసు పెట్టింది. ఈ వివాదంపై జిల్లా కలెక్టర్‌ని ఆశ్రయించగా, ఆయన ఆదేశాల మేరకు రావులపాలెం సర్కిల్ ఇన్స్పెక్టర్ విచారణ జరిపారు. అయితే తమ వద్ద ఉన్న 1977 నాటి ప్రభుత్వ పొజిషన్ సర్టిఫికేట్ చెల్లదని, ఆక్రమణదారుల నకిలీ పత్రాలే కరెక్ట్‌గా ఉన్నాయని చెప్తూ తహశీల్దార్ వద్దకు వెళ్లమని పోలీసులు తేల్చేశారు. తీరా రావులపాలెం తహశీల్దార్ ఆఫీసు చుట్టూ తిరుగుతుంటే, అక్కడి సిబ్బంది కనీసం తహశీల్దార్‌ను కలవనివ్వకుండా వేధిస్తున్నారు. ఇదే అదనుగా ఆక్రమణదారులు రోడ్డుపై కనిపిస్తే చంపేస్తామని తనను, తమ పిల్లలను తీవ్రంగా బెదిరిస్తున్నారు.తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

కృష్ణా జిల్లా కోడూరు మండలం విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన నారేపాలెం రాంబాబు విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో సర్వే నెంబరు 284-7లో ఉన్న 0.27 సెంట్ల వ్యవసాయ భూమి తన తల్లి నారేపాలెం వైదేహమ్మ పేరిట ఉండేదని తెలిపారు. దీనికి సంబంధించి పట్టాదారు పాసు పుస్తకం (ఖాతా నెంబరు: 1511) ఉండటమే కాకుండా, ఆన్‌లైన్ వెబ్‌ల్యాండ్‌లో కూడా ఆమె పేరే నమోదై ఉంది. ఆమె జీవించి ఉన్న కాలంలో.. 2023 నవంబర్ 28న ఆ భూమిని పెద్ద కుమారుడైన తనకు 'దఖలు స్వాధీనం పత్రం' ద్వారా రాసిచ్చారు. ఆమె బ్రతికున్నంత కాలం ఈ భూమి విషయంలో ఎలాంటి గొడవలు లేవు. అయితే, తల్లి మరణించిన తర్వాత ఆ భూమిని సాగు చేసుకుందామని వెళ్లిన తనను తమ్ముడు అడ్డుకున్నారు. పొలంలోకి అడుగుపెట్టనివ్వకుండా దౌర్జన్యానికి దిగుతూ, బెదిరింపులకు గురిచేస్తున్నారు. తన తల్లి చట్టబద్ధంగా రాసిచ్చిన భూమిని తన తమ్ముడు అక్రమంగా లాక్కోవాలని చూస్తున్నాడు. పొలానికి వెళ్తే దౌర్జన్యం చేస్తున్నాడు. తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

వీటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్‌లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థికతోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.

# ఏపీ పర్యాటకంలో నూతన శకం

- రెండేళ్లలో 117 సంస్థలతో ఎంవోయూలు
- రానున్న 20 వేల కోట్లకు పైగా పెట్టుబడులు
- టూరిజం పాలసీతో వేగంగా అనుమతులు
- కేంద్ర సహకారంతో ప్రాజెక్టులకు నిధులు
- 20 శాతం వృద్ధి లక్ష్యంగా ప్రణాళికలు
- తీరప్రాంతంలో బీచ్ సాక్స్‌కు శ్రీకారం
- విధ్వంసం నుంచి వికాసం వైపు కూటమి ప్రభుత్వ ప్రగతి ప్రస్థానం



ప్రకృతి ఒడిలో పరవశించే పచ్చని కోనలు, పరవళ్లు తొక్కే నదీమతల్లులు, 1,053 కిలోమీటర్ల పొడవైన అద్భుతమైన సముద్ర తీరం, ఆధ్యాత్మికత వెల్లివిరిసే పుణ్యక్షేత్రాలు.. ఇదీ ఆంధ్రప్రదేశ్ పర్యాటక వైభవం. గత ప్రభుత్వ పాలనలో పర్యాటక అభివృద్ధి పేరుతో ప్రకృతిని ధ్వంసం చేసిన పాలకుల నుంచి రాష్ట్రాన్ని కాపా డుకుంటూ నేడు కూటమి ప్రభుత్వం ప్రపంచ పర్యాటక పటంలో ఏపీ అగ్రగామిగా నిలబెట్టేందుకు నడుంబిగించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతతో పర్యాటకం నేడు కొత్తపుంతలు తొక్కు తోంది.

## పారిశ్రామిక హోదాతో పర్యాటకానికి 'బూస్ట్'

ఆంధ్రప్రదేశ్ పర్యాటకరంగాన్ని కేవలం ఒక వినోద సాధనంగా చూడకుండా రాష్ట్ర ఆర్థికవ్యవస్థకు ఒక బలమైన ఇంజిన్‌లా మార్చా లనేది కూటమి ప్రభుత్వ సంకల్పం. ఇందులో భాగంగానే పర్యాట క రంగానికి పారిశ్రామిక హోదా కల్పిస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టే వారికి విద్యుత్ ఛార్జీలు, పన్నుల్లో భారీ రాయితీలు లభిస్తాయి. ఇది పర్యాటక రంగంలో పెట్టుబడుల వెల్లువకు దారితీసింది. కూటమి ప్రభుత్వం తక్కువ సమయంలోనే పర్యాటక రంగంపై పెట్టుబడిదా రుల్లో అపారమైన నమ్మకాన్ని కలిగించింది. గతంలో 'జె-ట్యాక్స్' వేధింపులతో పారిపోయిన పెట్టుబడిదారులు, నేడు ఏపీ వైపు ఆసక్తిగా చూస్తున్నారు. ఫలితంగా కేవలం రెండేళ్లలోపే 117 ప్రముఖ సంస్థలతో ప్రభుత్వం ఎంవోయూలు కుదుర్చుకుంది. వీటి ద్వారా సుమారు రూ.20,000 కోట్ల భారీ పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయి. ఈ పెట్టుబడులు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభమయ్యేలా ప్రభుత్వం పారదర్శకమైన సింగిల్ విండో విధానాన్ని అమలు చేస్తోంది.

## పర్యాటక ప్రాజెక్టులతో 1.22 లక్షల మందికి భరోసా

పర్యాటక రంగం అంటే కేవలం వినోదం మాత్రమే కాదు, అది లక్షలాది మందికి ఉపాధినిచ్చే కల్పవృక్షం. కూటమి ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యం ప్రకారం రాబోయే ప్రాజెక్టుల ద్వారా ఏకంగా 1,22,637 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. హోటళ్లు, రిసార్టులు, ట్రావెల్ ఏజెన్సీలు, టూరిస్ట్ గైడ్లు, స్థానిక హస్త కళాకారులు ఇలా అన్ని వర్గాల వారికి ఈ అభివృద్ధిలో భాగస్వామ్యం లభిస్తుంది. ముఖ్యంగా ప్రతి ప్రాజె క్టులో 75 శాతం ఉద్యోగాలు స్థానిక యువతకే దక్కేలా నిబంధన లు పెట్టడం ప్రభుత్వ జవాబుదారీతనానికి నిదర్శనం.

## హోటల్ గదుల కొరతకు చెక్

ఒక పర్యాటక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే అక్కడ పర్యాటకులు బసచేయడానికి మెరుగైన వసతిఉండాలి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో కేవలం 4,390 హోటల్ గదులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఈ కొరతను అధిగమించేందుకు ప్రభు త్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. అదనంగా 9,042 గదులను అందుబాటులోకి తెచ్చేలా 50 కొత్త హోటల్ ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 50,000 హోటల్ గదులను ఏర్పాటు చేసి దేశంలోనే టాప్-5 పర్యాటక రాష్ట్రాల్లో ఏపీని నిలబెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది.

## కేంద్ర నిధుల సాధనలో ఏపీ దూకుడు

కేంద్రప్రభుత్వం నుంచి నిధులను సాధించడంలో కూటమి ప్రభుత్వం తన మార్కును చాటుకుంది. గత ప్రభుత్వం యూసీలు సమర్పించక ఆగిపోయిన నిధులను, నేడు కూటమి ప్రభుత్వం తన పరపతితో మళ్ళీ సాధిస్తోంది. కేంద్రం నుంచి రూ.428 కోట్ల విలువైన 8 ప్రధాన పర్యాటక ప్రాజెక్టుల కోసం ఈ నిధులు మం జూరు అయ్యాయి. రూ.97.52 కోట్లతో బాపట్ల జిల్లా సూర్యలంక బీచ్ అభివృద్ధి కోసం జరుగుతుంది. రూ.29.87 కోట్లతో బొర్రా గుహల ఆధునికీకరణ, పర్యాటక సౌకర్యాల కోసం ప్రభుత్వం మంజూరు చేసింది. పర్యాటక మౌలికసదుపాయాల కోసం రూ.172.35 కోట్ల ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని సాస్కీ ద్వారా సాధిం చారు. ఆధ్యాత్మిక పర్యాటక అభివృద్ధికి ఈ పథకం కింద భారీగా నిధులను వినియోగిస్తున్నారు.

## శరవేగంగా టూరిజం అభివృద్ధి

పర్యాటక రంగంలో రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిపే విధంగా టూరిజం పాలసీని అమలు చేస్తూ పర్యాటక రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించేలా కొత్త సంస్కరణలను కూటమి ప్రభుత్వం తీసుకొచ్చింది. టూరిజం పాలసీ ద్వారా 24 నెలల్లోనే రూ.28 వేల కోట్ల పెట్టుబడులు, 1,22,631 ఉద్యోగాల కల్పనకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే రూ.6.671 కోట్ల విలువైన పనులు పట్టాలెక్కాయి. ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేలా మెగా ఉత్సవాలు, ఫుడ్ ఫెస్టివల్, జాతీయ, అంతర్జాతీయ స్థాయి ట్రేడ్ ఫెయిర్లను నిర్వహిస్తున్నారు. సూర్యలంక, సింహాచలం, అహోబి లం అన్నవరం, అఖండ గోదావరి వంటి ప్రాజెక్టులను కేంద్రం నిధులతో చేస్తున్నారు. గత ప్రభుత్వ విధ్వంస పాలనలో నిలిచి పోయిన గోదావరి, కృష్ణా నదిలో జలహారతి కార్యక్రమం, శ్రీశైలం - నాగార్జున సాగర్, పాపికొండల మధ్య బోట్ టూరిజంను పున: ప్రారంభించారు.

## పర్యాటకంలో 20 శాతం వృద్ధి లక్ష్యం

పర్యాటక రంగంలో వేల కోట్ల పెట్టుబడులు వచ్చేలా నూతన పాలసీకి శ్రీకారం చుట్టింది. బడ్జెట్‌లో రూ.891 కోట్లు కేటాయించి ఆ నిధులతో ఏడాది పాటు ఉత్సవాలు, ఫెస్టివల్స్ నిర్వహిస్తున్నారు. భారతదేశంలోనే టూరిస్టులను ఆకర్షించే రాష్ట్రాల్లో ఏపీని మొదటి స్థానంలో నిలిపే విధంగా టూరిజం శాఖ కార్యక్రమాలు నిర్వహి స్తోంది. సాస్కీ, ప్రసాద్ స్కీమ్‌ల ద్వారా రూ.441 కోట్లతో సూర్య లంక, సింహాచలం, అహోబిలం, అన్నవరం, అఖండ గోదావరి ప్రాజెక్టుల అభివృద్ధి..20 ప్రధాన దేవాలయాల్లో టెంపుల్ టూరిజం అభివృద్ధికి ప్రభుత్వం సన్నాహకాలు ప్రారంభించింది. ఏపీ టూరిజం ప్రపంచస్థాయి గుర్తింపు పొందే విధంగా పర్యాటక రంగంలో 20 శాతం వృద్ధి సాధించేలా ప్రణాళికలకు శ్రీకారం చుట్టారు.

## తీరప్రాంత పర్యాటకానికి కొత్త హంగులు

ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న 1,053 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతాన్ని పర్యాటక సంపదగా మార్చేందుకు ప్రభుత్వం గోవా తరహా 'బీచ్ సాక్స్' విధానాన్ని ప్రవేశపెట్టింది. విశాఖపట్నం, సూర్యలంక బీచ్‌లలో పైలట్ ప్రాజెక్టులుగా వీటిని ప్రారంభించబోతున్నారు. పర్యాటకుల సౌకర్యార్థం వీటి విస్తీర్ణాన్ని 1,500 నుంచి 3,000 చదరపు అడుగులకు పెంచారు. పర్యావరణానికి ఎటువంటి హాని కలగకుండా పారదర్శకమైన నిబంధనలతో ఈ బీచ్ సాక్స్ నిర్వహణ సాగుతోంది. పర్యాటకులు ఒక ప్రాంతానికి రావాలంటే అక్కడ భద్రత చాలా ముఖ్యం. గతంలో పర్యాటక ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోయిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా 'టూరిస్ట్పోలీ స్పోర్స్'ను రంగంలోకి దించింది. పర్యాటక ప్రాంతాల్లో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, మహిళలు, పిల్లలు నిర్భయంగా తిరిగే వాతావరణాన్ని ప్రభుత్వం కల్పించింది.

## జాతీయస్థాయిలో రాష్ట్రానికి గుర్తింపు

రాబోయే 2027 గోదావరి పుష్కరాలను ప్రపంచం నివ్వెరపోయేలా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం ఇప్పటినుంచే కసరత్తు ప్రారంభించింది. పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, రవాణా సౌకర్యాలు, వసతి ఏర్పాట్లపై ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించింది. అలాగే 2028 కృష్ణా పుష్కరాలను కూడా అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. కూటమి ప్రభుత్వం పర్యాటక రంగంలో చేస్తున్న కృషికి జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. ఇటీవల కేరళలో జరిగిన జాతీయ పర్యాటక సదస్సులో ఆంధ్రప్రదేశ్‌కు 'బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్' అవార్డు దక్కింది. కేరళ, గోవా వంటి పర్యాటక దిగ్గజ రాష్ట్రాలను దాటుకుని ఏపీ ఈ అవార్డును సాధించడం మన పర్యాటక శాఖ పనితీరుకు నిదర్శనం.

## గత ప్రభుత్వ విధ్వంసం- పర్యాటక రంగానికి శాపం

గత ప్రభుత్వం పర్యాటకరంగాన్ని కేవలం తమ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకుంది. పర్యాటక అభివృద్ధి పేరుతో రూ.500 కోట్లకు పైగా ప్రజాధనాన్ని వెచ్చించి పర్యావరణాన్ని ధ్వంసం చేసి ఒక వ్యక్తి విలాసం కోసం రాజ ప్రసాదాలు నిర్మించుకున్నారు. ఇది రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద పర్యాటక కుంభకోణం. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న హరిత రిసార్ట్స్‌ను నిర్వహించలేక వాటిని అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మార్చారు. పర్యాటకులు రావాలంటేనే భయపడే పరిస్థితి తెచ్చారు. జె-ట్యాక్స్, వేధింపుల వల్ల రాష్ట్రానికి రావాల్సిన అనేక పర్యాటక ప్రాజెక్టులు పక్క రాష్ట్రాలకు తరలిపోయాయి. కేంద్రం ఇచ్చిన నిధులకు వినియోగ ధ్రువపత్రాలు ఇవ్వకపోవడం వల్ల అనేక ప్రాజెక్టులు మధ్యలోనే ఆగిపోయాయి. పర్యాటక రంగంపై ఆధారపడిన వేలాది మంది గైడ్లు, చిరు వ్యాపారులు రోడ్డునపడ్డారు. రోజుకు రూ.2 లక్షలు, నెలకు రూ.60 లక్షల ఆదాయం వచ్చే రుషికొండ టూరిజం కేంద్రాన్ని జగన్ తన స్వార్థం కోసం రూ.500 కోట్లతో నివాస భవనాల నిర్మాణం కోసం ధ్వంసం చేశాడు. అక్కడ ఉన్న 60 రూములను ధ్వంసం చేశారు. ప్రస్తుతం ఆ భవనాలు దేనికీ ఉపయోగపడటం లేదు. 2021లో రూ.2,868.6 కోట్ల పెట్టుబడులు, 48 వేల ఉద్యోగాలు వస్తాయని జగన్ చెప్పినప్పటికీ ఐదేళ్లలో కనీసం 48 ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు.

## 'సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్' దిశగా పరుగులు

విధ్వంసం నుంచి వికాసం వైపు ఏపీ పర్యాటక రంగం నేడు వేగంగా అడుగులు వేస్తోంది. గత ప్రభుత్వ చీకటి పాలనను తుడిచిపెట్టి కూటమి ప్రభుత్వం పర్యాటక రంగానికి కొత్త వెలుగులు నింపుతోంది. పారదర్శకత, జవాబుదారీతనం, అభివృద్ధి కాంక్షతో ముందుకుసాగుతున్న ఈ ప్రభుత్వం త్వరలోనే ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశపు పర్యాటక రాజధానిగా మారుస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు. 'సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్' బ్రాండ్ మళ్లీ ప్రపంచ వేదికపై వెలుగుతోంది.





జోన్ - 2
(కాకినాడ, అమలాపురం, నర్సాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు)
చైతన్యరథం

# కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవ సంబరాలు

**●రూ.590 కోట్ల అభివృద్ధి, సంక్షేమంతో దూసుకుపోతున్నాం**

**: ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**



జగ్గంపేట (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా జగ్గంపేట పరిణయ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం విజయోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పెద్దాపురం ఆర్డీవో, పెద్దాపురం డి.ఎస్.పి, పిడి డోమ మధుసూదన్ రావు, అగ్రికల్చరల్ జెడి, వ్యవసాయ శాఖ ఏడి, పంచాయతీరాజ్ డిఇ, పెద్దాపురం లేబర్ ఆఫీసర్, ఆర్డబ్ల్యూఎస్ డీఈ, ఇరిగేషన్ డి ఈ, హౌసింగ్ డి ఈ, సిడిపిఓ పూర్ణిమ, అబ్జర్వర్‌గా సలాది స్వామి నాయుడు, జనసేన ఇన్చార్జ్ తుమ్మలపల్లి రమేష్, బిజెపి ఇన్చార్జి దాట్ల కృష్ణ వర్మ హాజరయ్యారు.

**రెండేళ్లలో రూ.589.93 కోట్ల అభివృద్ధి, సంక్షేమం**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ... గడిచిన రెండేళ్లలో నియోజకవర్గంలో రూ.589,92,88,443తో అభివృద్ధి, సంక్షేమ పథకాలు పరుగులు పెట్టించామని, ఇందులో రూ.418.12 కోట్ల అభివృద్ధి పనులకు, రూ.171.81కోట్ల సంక్షేమ పథకాలకు వెచ్చించామని వివరించారు.

**మూడు స్తంభాల పాలనతో ఏపీ పురోగతి**

సీఎం చంద్రబాబునాయుడు విజన్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పోరాటం, మంత్రి నారా లోకేష్ దూకుడుతో రాష్ట్రం మళ్లీ అభివృద్ధి బాట పట్టిందని నెహ్రూ అన్నారు. గత జగన్ అరాచక పాలనలో జరిగిన విధ్వంసాన్ని సరిదిద్దుతున్నామని తెలిపారు. రాబోయే మూడేళ్లలో రోడ్లు, సాగునీరు, విద్య, వైద్య రంగాల్లో పెద్ద ఎత్తున ప్రాజెక్టులు చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# ఏపీలో అదృశ్యం దిల్లీలో ప్రత్యక్షం - మిస్టరీగా ముగ్గురు విద్యార్థుల మిస్సింగ్ కేసు




గుంటూరు (చైతన్యరథం): జిల్లాకు చెందిన ముగ్గురు బాలురు, ఉన్నట్లుండి అదృశ్యమయ్యారు. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా మొదట ముగ్గురూ హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు, ఒక్క రోజు గడిచిందో లేదో వారు సోమవారం దిల్లీలో ప్రత్యక్షమయ్యారు. ఇలా అనూహ్యరీతిలో వారికి సంబంధం లేని చోట్ల ప్రత్యక్షం కావడంతో తల్లిదండ్రులు, పోలీసులు అవాక్కయ్యారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వేజండ్లకు చెందిన జహీర్ అహ్మద్, శుద్ధపల్లికి చెందిన భరత్, గుండారం గ్రామానికి చెందిన తుపాకుల గోపీలు పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. భరత్ తల్లికి అనారోగ్యంగా ఉండటంతో కొంతకాలంగా తెనాలి రూరల్ మండలం సంగంజాగర్లమూడిలో ఉంటున్నారు. శనివారం సాయంత్రం జహీర్ అహ్మద్, గోపీ కలిసి భరత్ ఇంటికి వెళ్లారు. ఆ తర్వాత ముగ్గురూ అదృశ్యమయ్యారు. శనివారం పాఠశాలకు వెళ్లిన ముగ్గురూ తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆందోళనకు గురైన వారి తల్లిదండ్రులు, రాత్రి వరకు వేచిచూసి ఆదివారం ఉదయం పోలీసుల్ని ఆశ్రయించారు. గోపీ సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా ఆదివారం ముగ్గురూ హైదరాబాద్‌లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఒక్క రోజు గడిచిందో లేదో వారు సోమవారం దిల్లీలో ప్రత్యక్షమయ్యారు. దిల్లీలోని ఓ దుకాణానికి వెళ్లారు. దుకాణ యజమాని ఒక విద్యార్థి తండ్రికి వీడియో కాల్ చేసి మాట్లాడించారు. ముగ్గురూ అక్కడే ఉన్నట్లు తెలిపారు. దీంతో బంధువులు, చేబ్రోలు పోలీసులు దిల్లీ బయల్దేరి వెళ్లారు.

మరోవైపు హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్ల అదృశ్యం కేసు అందరినీ అవాక్కయ్యేలా చేసింది. ఫోన్ ఎక్కువగా చూస్తున్నారని ముగ్గురు కుమార్తెలను తల్లి మందలించడంతో కోపంతో ముగ్గురూ ఆదివారం ఇంటి నుంచి వెళ్లిపోయారు. ఈ ముగ్గురూ ఉన్నట్లుండి రాష్ట్రంలోని ఏలూరులో ప్రత్యక్షమయ్యారు. ముగ్గురు కుమార్తెలూ అదృశ్యం కావడంతో వారి తల్లి హైదరాబాద్ ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా ఫలక్‌నుమా రైల్వేస్టేషన్ పరిసరాలను పరిశీలించగా, బాలికలు అక్కడ రైలు ఎక్కినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. వారు ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ ఎక్కి ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్తున్నట్లు నిర్ధారించుకున్న హైదరాబాద్ పోలీసులు, వెంటనే ఏలూరు పోలీసులకు సమాచారం అందించారు.

హైదరాబాద్ పోలీసుల నుంచి అందిన సమాచారంతో ఏలూరు రైల్వే పోలీసులు, స్థానిక పోలీసులు అప్రమత్తమయ్యారు. ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ ఏలూరు రైల్వే స్టేషన్‌లో ఆగడమే ఆలస్యం పోలీసులు రైలు బోగీల్లో తనిఖీలు చేపట్టారు. అక్కడ ఒంటరిగా ప్రయాణిస్తున్న ఆ ముగ్గురు అక్కాచెల్లెళ్లను గుర్తించి సురక్షితంగా తమ ఆధీనంలోకి తీసుకున్నారు. బాలికలు సురక్షితంగా ఉన్నారని బాలికల తల్లిదండ్రులకు తెలపడంతో బాధిత తల్లి ఆనందానికి అవధులు లేకుండా పోయింది.

# ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ : ఎం.వి ప్రణవ్ గోపాల్

**● అర్జీలు స్వీకరించిన వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్**



విశాఖపట్నం (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కరించేందుకు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమమే ప్రజాదర్బార్ అని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్ వ్యాఖ్యానించారు. సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పలువురి నుంచి అర్జీలు స్వీకరించిన ఆయన... బాధితులతో మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలను పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ఒక సమస్యపై ఎక్కువ సార్లు కార్యాలయాల చుట్టూ తిరగకుండా చూడాలని ఆదేశించారు. నిర్దేశించిన గడువులోగా బాధితులకు సమాచారం అందించాలని సూచించారు. ప్లానింగ్ విభాగానికి చెందిన వినతులను పరిశీలించి, బాధితులకు వివరణ ఇవ్వాలని సూచించారు. ప్రజా దర్బార్‌కి మొత్తం 8 వినతులు రాగా వాటిలో ప్లానింగ్ -3, ఎస్టేట్ -1, అలాట్మెంట్ -2, ఇంజనీరింగ్,-2 చొప్పున వినతులు వచ్చాయి. సమావేశంలో కార్యదర్శి శ్రీ మురళీకృష్ణ, ఓ.ఎస్.డి శ్రీకృష్ణ నాయక్, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కూన రవికుమార్

**●ఆపదలో ఉన్న కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది**



ఆముదాలవలస (చైతన్యరథం): నియోజకవర్గంలోని పొందూరు మండలం తానేం గ్రామానికి చెందిన పట్టా ప్రభాకర్ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్) ద్వారా మంజూరైన రూ.2,28,000 ఆర్థిక సహాయ చెక్కును ఆముదాలవలస శాసనసభ్యులు, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ అందజేశారు. అనారోగ్య సమస్యల కారణంగా వైద్య సహాయ నిమిత్తం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రభాకర్ కుటుంబానికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఈ సహాయం మంజూరైంది. ఎమ్మెల్యే స్వయంగా వారి ఇంటి వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి చెక్కును అందజేశారు ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆపద సమయంలో ప్రజలకు అండగా నిలవడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న అర్హులైన కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. రూ.2.28 లక్షల చెక్కును అందుకున్న పట్టా ప్రభాకర్ కుటుంబ సభ్యులు, తమకు ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే కూన రవికుమార్‌కి, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడునికి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# పేదలకు కొండంత అండగా సీఎంఆర్‌ఎఫ్ : ఎమ్మెల్యే గణబాబు

విశాఖపట్నం పశ్చిమ (చైతన్యరథం): నిరుపేదల ఆరోగ్య రక్షణకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో దోహదపడుతుందని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ గణబాబు పేర్కొన్నారు. సోమవారం తన కార్యాలయంలో పలువురి లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుండి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలువురు లబ్ధిదారులకు మొత్తం రూ.3,12,831 విలువైన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ... ఆపద సమయంలో ప్రభుత్వం అందించిన ఈ ఆర్థిక సాయం పేదలకు కొండంత అండగా ఉంటుందన్నారు. సీఎం సహాయనిధి ద్వారా లబ్ధిపొందిన వారు హర్షం వ్యక్తం చేస్తూ, ఎమ్మెల్యే గణబాబుకి కృతజ్ఞతలు తెలియజేశారు.

# డ్వాక్రా మహిళలు ఇతర లబ్ధిదారులకు రూ.6.78 కోట్ల రుణాల పంపిణీ



నందిగామ (చైతన్యరథం): పెనుగంచిప్రోలు జీవీఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్ పెనుగంచిప్రోలు శాఖ పరిధిలోని సహకార సంఘాల ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు, కర్షక మిత్ర, రైతు నేస్తం లబ్ధిదారులకు రుణాల పంపిణీ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. పెనుగంచిప్రోలు సొసైటీ చైర్మన్ కర్ల వెంకటనారాయణ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జగ్గయ్యపేట శాసనసభ్యులు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్ పాల్గొన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలోని 9 సహకార సంఘాల పరిధిలోని డ్వాక్రా మహిళలు, కర్షక మిత్ర, రైతు నేస్తం పథకాల లబ్ధిదారులకు మొత్తం రూ.6.78 కోట్ల విలువైన రుణాలకు సంబంధించిన చెక్కులను పంపిణీ చేశారు.

# ఏపీ హాజీల పవిత్ర హజ్ యాత్ర ముగింపు - చివరి విడత హాజీలు శంషాబాద్‌కు చేరిక



గుంటూరు (చైతన్యరథం): పవిత్ర హజ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హాజీలు సోమవారం మూడు విమానాల ద్వారా సురక్షితంగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. హజ్ యాత్ర ముగింపు సందర్భంగా మొత్తం 355 మంది హాజీలు సోమవారం హైదరాబాద్ చేరుకోవడంతో యాత్రికుల కుటుంబాల్లో ఆనందం నెలకొంది. ఆంధ్రప్రదేశ్లో గన్నవరం ఎయిర్పోర్ట్ నుంచి 330 మంది తెలంగాణలోని శంషాబాద్ ఎయిర్పోర్టుకు ఏపీ జాతికులు 355 మంది స్వదేశాలకు చేరుకున్నారని హజ్ కమిటీ చైర్మన్ హసన్ భాష చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హాజీలందరూ సురక్షితంగా హైదరాబాద్‌కు చేరుకున్నట్లు హజ్ కమిటీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ సయ్యద్ అఫ్జాల్, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హాజీ హసన్ బాషా, తెలంగాణ హజ్ కమిటీ డైరెక్టర్లు, ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ డైరెక్టర్, హజ్ కమిటీ సిబ్బంది హాజీలకు ఘన స్వాగతం పలికారు. హజ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని క్షేమంగా స్వదేశానికి చేరుకున్న ప్రతి హాజీకి వారు శుభాకాంక్షలు తెలియజేశారు. హజ్ యాత్రికుల సేవలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది, వాలంటీర్ల కృషిని ఆయన అభినందించారు. పవిత్ర హజ్ యాత్ర ముగింపుతో హాజీల కుటుంబ సభ్యులు, ముస్లిం సమాజ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

# వైసీపీ ఐదేళ్ల పాపాల చిట్టాను ప్రజలు మర్చిపోలేదు

- విజయవాడను గంజాయి, రౌడీయిజం లేని ప్రశాంత నగరంగా తీర్చిదిద్దుతాం
- చట్టం ఎవరికీ చుట్టం కాదు.. అసాంఘిక శక్తులపై డ్రోన్లతో నిఘా : ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్
- సాయి కృష్ణ కుటుంబానికి సీఎం హామీ మేరకు పూర్తి న్యాయం జరుగుతుంది : గద్దె అనురాధ
- గత ఐదేళ్లలో పోలీస్ స్టేషన్లను టార్చర్ సెల్స్‌గా మార్చారు : కొమ్మారెడ్డి పట్టాభిరాం




విజయవాడ (చైతన్యరథం): వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రవ్యాప్తంగా అనేక అరాచకాలు, దాడులు జరిగాయని, వారి పాపాల చిట్టాను ప్రజలు మర్చిపోలేదని విజయవాడ తూర్పు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు వ్యాఖ్యానించారు. దేవాలయం లాంటి రాష్ట్ర పార్టీ కార్యాలయంపై జరిగిన దాడిలో పాల్గొన్న వారిపై అప్పట్లో ఎలాంటి చర్యలు తీసుకోలేదని, మా పార్టీ నాయకుడు చెన్నుపాటి గాంధీపై అన్యాయంగా దాడి చేసి ఒక కన్ను పోగొట్టారని, ఆ దుండగులను అప్పటి ముఖ్యమంత్రి సమర్థించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గంజాయి అమ్మకాలు, వినియోగం విచ్చలవిడిగా సాగాయని, స్కూల్ విద్యార్థులకు కూడా చాక్లెట్ల రూపంలో డ్రగ్స్ అందించే పరిస్థితులు ఉండేవని, మహిళలు గంజాయి బారిన పడకుండా కాపాడాలని కోరేవారని గుర్తుచేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రాగానే నగరంలో గంజాయి నియంత్రణకు గట్టి చర్యలు తీసుకుంటోందని, టెక్నాలజీ మరియు డ్రోన్‌లను ఉపయోగించి మారుమూల ప్రాంతాల్లో జరిగే అసాంఘిక కార్యకలాపాలను అరికడుతోందన్నారు. 99 మంచి పనులు చేసినా ఒక్క తప్పు చేసినా చట్టం ప్రకారం శిక్ష అనుభవించాల్సిందేనని, చట్టం ఎవరికీ చుట్టం కాదని స్పష్టం చేశారు. గంజాయి, రౌడీయిజం లేని విజయవాడ నగరంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే మీడియా కూడా మంచిని మంచిగా, చెడును చెడుగా చూపించాలని కోరారు.

**ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ మాట్లాడుతూ...** సాయి కృష్ణ అదృశ్యం కేసు విషయంలో ప్రజలందరికీ కొన్ని నిజాలు చెప్పాల్సిన అవసరం ఉందని, చట్టం తనపని తాను చేసుకుపోతుందని, సాయి కృష్ణ కుటుంబానికి ఖచ్చితంగా న్యాయం జరుగుతుందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ జీవించే హక్కు ఉందని, మానవ హక్కుల ఉల్లంఘన అనేది పెద్ద నేరమని, దాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు ఎప్పుడూ కులాలు, మతాలు మరియు వర్గాల మధ్య చిచ్చు పెట్టడానికి, చిక్కులు తెచ్చిపెట్టడానికి ప్రయత్నిస్తుంటాయని మండిపడ్డారు.

**స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ...** 2019 అక్టోబర్ నెలలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై చేసిన విమర్శలను గుర్తు చేస్తూ, కేవలం నెల రోజులు తిరక్కుండానే తూచ్ అనే విధంగా వైఖరి మార్చుకున్నారని ఎద్దేవా చేశారు. 2019 నుండి 2024 మధ్య కాలంలో రాష్ట్రంలో పోలీస్ స్టేషన్లను 'టార్చర్ సెల్స్'గా మార్చారని ఆరోపించారు. రఘురామకృష్ణంరాజు, నరేంద్ర వంటి వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని విమర్శించారు. విశాఖపట్నంలో కొండారెడ్డి అనే యువజన నాయకుడు డ్రగ్స్ రవాణా చేస్తూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. అలాగే గుజరాత్‌లోని ముంద్రా పోర్టులో దొరికిన 3000 కిలోల హెరాయిన్‌కు విజయవాడలోని ఆశి ట్రేడింగ్ కంపెనీతో సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యం, అమరనాథ్ గౌడ్ వంటి ఘటనలను ప్రస్తావిస్తూ గత ప్రభుత్వంలో దళితులకు, వెనుకబడిన వర్గాలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు.

# కూటమి ప్రభుత్వ లక్ష్యం ప్రజా సంక్షేమం

- గుడివాడ అభివృద్ధిపై ఫోకస్... మూడు శాఖల అధికారులతో ఎమ్మెల్యే రాము సమీక్ష
- వర్షాకాలంలో విద్యుత్ ఇబ్బందులు వద్దు... ఎస్.ఈతో ఎమ్మెల్యే రాము కీలక సూచనలు



గుడివాడ (చైతన్యరథం): ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభ్యున్నతే లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ప్రభుత్వ సహకారంతో గుడివాడ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నానని ఉద్ఘాటించారు. సోమవారం ఉదయం గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పలు ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. తొలుత విద్యుత్ శాఖ అధికారులతో, అనంతరం ఆర్ అండ్ బి, ఇరిగేషన్ శాఖ అధికారులతో నియోజకవర్గ అభివృద్ధి పనులపై చర్చించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ పి. హరిబాబు ప్రజావేదిక కార్యాలయంలో ఎమ్మెల్యే రామును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం విద్యుత్ సమస్యలపై ఎస్.ఈ. హరిబాబు, ఈ.ఈ జీవీ శ్రీనివాసరావులతో ఎమ్మెల్యే రాము సమగ్రంగా మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజలకు విద్యుత్ ఇబ్బందులు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలున్న ప్రాంతాల్లో కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణానికి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు పలు సూచనలు చేశారు.

ఆర్ అండ్ బి డివిజనల్ ఇంజనీర్ కామేశ్వరావు, ఏఈలతో సమావేశమైన ఎమ్మెల్యే, గత సమావేశంలో చర్చించిన అత్యవసర రోడ్ల పనుల నివేదికను క్షుణ్ణంగా పరిశీలించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధి కోసం రూ.24 కోట్లతో సిద్ధం చేసిన ప్రతిపాదనల జాబితాపై అధికారులతో చర్చించారు. పైస్థాయి నుంచి నిధులు వేగంగా మంజూరయ్యేలా తాను కృషి చేస్తానని, పనులు సకాలంలో పూర్తయ్యేలా అధికారులు బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇరిగేషన్ డివిజనల్ ఇంజనీర్ భరత్, ఏఈలతో ఎమ్మెల్యే రాము సమావేశమై కాలువల అభివృద్ధి పనులపై సమీక్షించారు.

# ఏలూరు కాలువ అనుసంధాన ప్రాజెక్టుకు రూ.38 కోట్ల పరిపాలనా అనుమతులు

- ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కృషితో ప్రాజెక్టుకు ఆమోదం



గన్నవరం (చైతన్యరథం): వ్యవసాయం, జలవనరుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ముందుకు సాగుతున్నారని గన్నవరం నియోజక వర్గ టీడీపీ నాయకులు పేర్కొన్నారు. గన్నవరం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గన్నవరం మార్కెట్ యార్డ్ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు దయాల రాజేశ్వరరావు, గూడపాటి తులసీమోహన్, గొద్దళ్ల చిన రామారావు, డీసీ చైర్మన్లు కొమ్మారెడ్డి రాజేష్, కొసరాజు రాంబాబు, పామర్తి శ్రీనివాసరావు, టీడీపీ సీనియర్ నాయకులు చిరుమామిళ్ల సూర్యం, దొంతు చిన్నా, తెలుగు మహిళా అధ్యక్షురాలు మేడేపల్లి రమ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలలో భాగంగా పోలవరం కుడి కాలువ--ఏలూరు కాలువ అనుసంధాన ప్రాజెక్టుకు ప్రభుత్వం జీవో నెం.335 ద్వారా రూ.38 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేయడం గన్నవరం నియోజకవర్గ రైతాంగానికి శుభపరిణామమని అన్నారు. పోలవరం కుడి కాలువ 137వ కిలోమీటరు వద్ద బండారుగూడెం నుంచి గోదావరి జలాలను నేరుగా ఏలూరు కాలువ 36వ కిలోమీటరు వద్ద తేలప్రోలు సమీపంలోకి మళ్లించడం ద్వారా సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు.

# రోడ్డు ప్రమాద బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే జీవీ



వినుకొండ (చైతన్యరథం): సోమవారం కామేపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ, ఆటో ఢీకొన్న ఘోర ప్రమాదంలో శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామానికి చెందిన ముగ్గురు మృతి చెందడంపై ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే ఆయన నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతుల పార్థివదేహాలను సందర్శించారు. తీవ్ర దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం, స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి, వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. బాధితులకు ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని, తగిన సహాయం అందేలా చూస్తామని జీవీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు ఆయా జిల్లాల్లో వర్షాలు... ద్రోణి ప్రభావంతో తేలికపాటి జల్లులు

విజయవాడ (చైతన్యరథం): తెలంగాణ నుంచి రాయలసీమ, తమిళనాడు మీదుగా మన్నార్ వరకు ద్రోణి విస్తరించింది. దీని ప్రభావంతో నేడు ఉత్తరాంధ్ర జిల్లాలు, కాకినాడ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలకు అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. మిగతా జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. వర్షాల వేళ పొలాల్లోని రైతులు, శ్రామికులు, పశుకాపరులు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఇవాళ నెల్లూరు జిల్లా గూడూరులో 40.5 మిల్లీమీటర్లు, పల్నాడు జిల్లా నెమలికల్లులో 25.5 మిల్లీమీటర్లు, తిరుపతి జిల్లా వెంకటగిరిలో 24.2 మిల్లీమీటర్లు., శ్రీసత్యసాయి జిల్లా రత్నగిరిలో 22 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

**అమరావతి పరిసరాల్లో భారీ వర్షం :** రాజధాని అమరావతి పరిసరాల్లో భారీ వర్షం కురుసింది. సచివాలయం పరిసరాల్లో ఉరుములు మెరుపులతో కుంభవృష్టిగా వర్షం పడింది. భారీ వర్షం కారణంగా ముఖ్యమంత్రి ప్రయాణానికి ఇబ్బందులు ఎదురయ్యాయి. బసవతారకం ఆసుపత్రి రజతోత్సవంలో పాల్గొనేందుకు సీఎం హైదరాబాద్ వెళ్లాల్సి ఉంది. భారీ వర్షం కారణంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయంలోనే కొంత సమయం వేచి ఉన్నారు. అనంతరం భారీ వర్షంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు హెలికాప్టర్‌లో హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. మార్కాపురం పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం వర్షం కురిసింది. దాదాపు గంటపాటు ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో రహదారులన్నీ జలమయమయ్యాయి.

**ఈ నెల 23 నుంచి 26 వరకు భారీ వర్షాలు :** మరోవైపు రాష్ట్రంలో ఈ నెల 23 నుంచి 26 వరకు ఉత్తర కోస్తా, కోస్తా, రాయలసీమలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ, అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉత్తర కోస్తాలో ఈ నెల 23 నుంచి 26 వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశం ఉందని సూచించింది. అదే విధంగా భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశం ఉంది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్లసంభవించే అవకాశం ఉంది. ఈదురు గాలులు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని హెచ్చరిక జారీ చేసింది.

కోస్తాలో ఈ నెల 23 నుంచి 26 వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశం ఉందని సూచించింది. ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అదే విధంగా ఉరుములతో కూడిన మెరుపులు సంభవించే అవకాశం ఉందని వెల్లడించింది. ఈదురు గాలులు గంటకు 40 నుంచి 50కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. రాయలసీమలో ఈ నెల 23 నుంచి 26 వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశం, భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశం ఉంది. ఒకటి రెండు చోట్ల ఉరుములతో కూడిన మెరుపులు సంభవించే అవకాశం ఉందని, ఈదురు గాలులు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని హెచ్చరిక జారీ చేసింది.

# వైభవంగా బారాషహీద్ దర్గా ఉత్సవ కమిటీ ప్రమాణ స్వీకారం

**దర్గా అభివృద్ధికి 5 కోట్లు కేటాయించిన సీఎం చంద్రబాబు, వైసీపీ హయాంలో దర్గా పై నిర్లక్ష్యం, కూటమి పాలన మళ్లీ మంచి రోజులు. రొట్టెల పండుగకు 14 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం : మంత్రి నారాయణ వెల్లడి**



నెల్లూరు (చైతన్యరథం): నగరంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం బారాషహీద్ దర్గా ఫెస్టివల్ కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం మంత్రి నారాయణ, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ సమక్షంలో అత్యంత వైభవంగా జరిగింది. ముందుగా బారాషహీద్‌ల సమాధులను దర్శించిన మంత్రి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం దర్గా అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని,కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు గారు దర్గా కోసం ఐదు కోట్ల రూపాయలు కేటాయించారని మంత్రి నారాయణ తెలిపారు. గతంలో 2014లో నారాయణ మంత్రిగా ఉన్నప్పుడే స్వర్ణాల చెరువు ఘాట్లు, మరుగుదొడ్లు, రూ.20 కోట్లతో కన్వెన్షన్ సెంటర్ వంటి పనులకు పునాది పడిందని వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ గుర్తుచేశారు. దర్గాకు తాను 30 ఏళ్లుగా భక్తుడినని, గత ప్రభుత్వ హయాంలో దర్గా అభివృద్ధి కోసం పోరాడానని ఎమ్మెల్యే కోటంరెడ్డి పేర్కొన్నారు.తన హయాంలో ఈద్గా, ముఖద్వారాలు నిర్మించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. రాబోయే రొట్టెల పండుగలో భక్తుల సంఖ్య 14 లక్షలకు పైగా పెరిగే అవకాశం ఉన్నందున, పారిశుధ్యానికి పెద్దపీట వేస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులంతా సమన్వయంతో అద్భుతమైన ఏర్పాట్లు చేయాలని, దర్గా సంపూర్ణ సర్వతోముఖాభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తామని నేతలు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, మేయర్ సుజాతా అశోక్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి,స్థానిక టీడీపీ ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు



# నెల్లూరు గ్రీవెన్స్‌లో మంత్రి నారాయణ

**పరిష్కారంలో సరికొత్త రికార్డు 87 శాతం సమస్యలు క్లియర్**

నెల్లూరు (చైతన్యరథం): జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం క్రమం తప్పకుండా సాగుతోంది. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పాల్గొన్నారు. స్వయంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నెల్లూరు జిల్లావ్యాప్తంగా మొత్తం 82,166 గ్రీవెన్స్ దరఖాస్తులు రాగా, అధికారులు రికార్డు స్థాయిలో 87 శాతం అంటే 71,549 అర్జీలను విజయవంతంగా పరిష్కరించారని వెల్లడించారు. పరిష్కారమైన వాటిలో కేవలం 5,384 మంది మాత్రమే సంతృప్తి చెందక మళ్లీ దరఖాస్తు చేసుకున్నారని, మొత్తం అర్జీలలో సింహభాగం 57 శాతం ఒక్క రెవెన్యూ శాఖ నుంచే వస్తున్నాయని ఆయన తెలిపారు. రెవెన్యూ విభాగంలోనూ 84 శాతం సమస్యలను ఇప్పటికే పరిష్కరించారని చెప్పారు. ఎక్కువగా కుటుంబాల ఆస్తి తగాదాలు, పొలాల సరిహద్దు వివాదాలే వస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్ సెల్ పనితీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

# నడిరోడ్డుపై వైసీపీ నేతల కామెడీ డ్రామాలు

**అజాతశత్రువు మంత్రి నారాయణపై విమర్శలు తగవని ఎమ్మెల్యే కోటంరెడ్డి హితవు**



నెల్లూరు (చైతన్యరథం): నగరంలో వైసీపీ నేతలు నిర్వహిస్తున్న ఆందోళనలపై నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ నేతలు వీధుల్లో చేస్తున్న ప్రెస్ మీట్లు ఒక పెద్ద కామెడీ డ్రామా అని కొట్టిపారేశారు. మంత్రి పొంగూరు నారాయణపై వైసీపీ చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేశారు. మంత్రి పొంగూరు నారాయణ లక్ష్యంగా నెల్లూరులో వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి, నగర ఇన్‌ఛార్జ్ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డితో పాటు 18 మంది ఎమ్మెల్సీలు చేసిన ఆందోళనలను ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తీవ్రంగా తప్పుపట్టారు.అదో సరదా సన్నివేశమని ఎద్దేవా చేశారు.విద్యాసంస్థల పునఃప్రారంభ సమయంలో అధికారులు నిర్వహించే తనిఖీలు కేవలం సాధారణ ప్రక్రియ మాత్రమేనని, దీనికి రాజకీయ రంగు పూయడం తగదని హితవు పలికారు. ఒకవేళ ఇది కక్షసాధింపు చర్యే అయితే, భీమవరంలో ఉన్న మంత్రి నారాయణ స్వంత విద్యాసంస్థల్లో కూడా అధికారులు ఎందుకు తనిఖీలు చేస్తారని ప్రశ్నించారు. తప్పు చేయనప్పుడు చట్టానికి భయపడాల్సిన అవసరం లేదని, లోపాలు ఉంటే సరిచేసుకోవాలే తప్ప ఇలా రోడ్లపై నాటకాలు ఆడటం సరికాదన్నారు. ప్రజాదరణ ఉన్న మంత్రి నారాయణ ను ఎన్నికల్లో ఎదుర్కొనే సత్తా లేక తమ రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి వీధి నాటకాలు ఆడుతున్నారని ఆరోపించారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ల నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఎన్నడూ కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడదని నొక్కి చెప్పారు. తాను గతంలో వైసీపీలో మూడున్నర సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు విద్యాసంస్థల సమస్యలను అధికారులతో కలిసి సామరస్యంగా, గౌరవప్రదంగా పరిష్కరించుకున్నామే తప్ప ఎప్పుడూ ఇలాంటి దిగజారుడు రాజకీయాలు చేయలేదని గుర్తుచేసారు. వైసీపీ నేతల ప్రెస్ మీట్ కేవలం ఎన్నికల లబ్ధి కోసం ఆడిన ఒక వింత నాటకమని కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తేల్చిచెప్పారు.

# సీసీ రోడ్డు ప్రారంభం

**పాల్గొన్న టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి , జనసైనికురాలు అలియా**

నెల్లూరు రూరల్ (చైతన్యరథం): నియోజకవర్గ పరిధిలోని 24వ డివిజన్ జాషువా నగర్ లో 17.50 లక్షల రూపాయలతో పూర్తయిన సీసీ రోడ్డును జనసేన నాయకురాలు షేక్ అలియా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో 24వ డివిజన్ అభివృద్ధికి 9కోట్ల 75లక్షల రూపాయలు కేటాయించామన్నారు. ప్రజల సూచనలు, సలహాల మేరకే నెల్లూరు రూరల్ లో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఇంత మంచి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి రాష్ట్ర ముఖ్యమంత్రినారా చంద్రబాబు నాయుడు, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి అందరి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కోరారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో నన్ను భాగస్వాములు చేసిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డికి జనసేన నాయకురాలు షేక్ అలియా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఎన్నడూ లేనివిధంగా 850 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేసిన ఘనత రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిదేనని జనసేన నాయకురాలు షేక్ అలియా కితాబునిచ్చారు. కార్యక్రమంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు అరవ శ్రీనివాసులు, కో క్లస్టర్ ఇంచార్జ్ రాఘవేంద్ర, 24వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు రవి, టీడీపీ నాయకులు అశోక్ రెడ్డి, సలీమ్, శ్రీధర్ రెడ్డి యాదగిరి, నర్సయ్య, సుధాకర్, మాల్యాద్రి రెడ్డి, పెంచలయ్య, పులి హరికృష్ణ యాదవ్, భీమతాటి సుధాకర్, సాయి , గుండాల మస్తాన్, ఆవుల రమేష్, గుంజి సుధా, సులోచనమ్మ, జనసేన నాయకులు నాగూర్ స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# వైకుంఠపురం సమస్యల పరిష్కారానికి శ్రీకారం

**కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి**



కావలి ( చైతన్యరథం): పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. సోమవారం కావలి పట్టణంలోని వైకుంటపురం 38వ వార్డులో ఉన్న అనపగుంట ముంపు ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్, సంబంధిత అధికారులు, పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రూ.48 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం, అనపగుంట కల్వర్టు త్వరలో ప్రారంభించబోయే పనులను నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వైకుంటపురం ప్రాంత ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ముంపు, రోడ్లు, డ్రైనేజీ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆశీస్సులతో కావలి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని, ముఖ్యంగా వైకుంటపురం ప్రాంతాన్ని సుందరంగా, ప్రజలకు అనుకూలంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే వెల్లడించారు. అనంతరం స్థానిక ప్రజలతో మమేకమైన ఎమ్మెల్యే వారి సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అన్ని విధాలుగా అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులతో మమేకమై స్కూలు బస్సెక్కిన ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు



మడకశిర (చైతన్యరథం): పిల్లలే మన దేశ భవిష్యత్తు అని, వారి ఉత్సాహమే రేపటి నవ భారతానికి మూలమని మడకశిర శాసనసభ్యుడు ఎమ్మెస్‌రాజు పేర్కొన్నారు. సోమవారం ఆయన మడకశిర నుంచి ఆర్ అనంతపురం వెళ్తున్న 'సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్' బస్సులో విద్యార్థులతో కలిసి ప్రయాణించారు. ఒక సామాన్యుడిలా పిల్లల మధ్య కూర్చుని వారితో ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యాభ్యాసం, వారి లక్ష్యాలు యోగక్షేమాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఆ చిన్నారుల కళ్ళలో కనిపించిన ఉన్నతమైన ఆశయాలు తనకెంతో ఆనందాన్నిచ్చాయని ఆయన హర్షం వ్యక్తం చేశారు. భావి భారత పౌరులైన ఈ చిన్నారులకు అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తూ, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయడమే మన కూటమి ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం అని ఎమ్మెస్ రాజు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నాయకుడు స్వయంగా తమతో బస్సులో ప్రయాణించి ఉత్సాహపరచడంతో విద్యార్థులు సైతం ఆనందం వ్యక్తం చేశారు.

## జీజీహెచ్‌లో దివ్యాంగ కేంద్రం ఏర్పాటు

ఒంగోలు (చైతన్యరథం): సాంఘిక సంక్షేమ, దివ్యాంగ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి,ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చొరవతో ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ప్రధానమంత్రి దివ్యాంగ కేంద్రం(పీఎండీవీకే) ఏర్పాటు కానుంది. రాష్ట్రానికి ఆరు కేంద్రాలు మంజూరు కాగా అందులో ఒకటి ఒంగోలులో ఏర్పాటు చేయడానికి అవసరమైన స్థల పరిశీలన, ఇతర మౌలిక వసతులపై ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలను ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్ మంత్రి స్వామిని, ఎమ్మెల్యే దామచర్లను వేర్వేరుగా కలిసి కేంద్రం ఏర్పాటు వివరాలను తెలిపారు.

అనువైన స్థలాన్ని కూడా పరిశీలించి అధికారులకు నివేదికలు పంపామని వివరించారు. జిల్లాలోని దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ అవయవాలు, సహాయక పరికరాలు, పునరావాస సేవలు, ఇతర మద్దతు సౌకర్యాలు ఒకేచోట సులభంగా అందించడం ఈ ప్రధానమంత్రి దివ్యాంగ కేంద్రం లక్ష్యమని తెలిపారు.

# మానవత్వం పరిమళించిన ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు

## ఆపదలో నిరుపేద కుటుంబానికి రూ. 50 వేల సాయం



మడకశిర (చైతన్యరథం): పట్టణంలోని 7వ వార్డుకు చెందిన నిరుపేద పెయింటర్ శివ కుటుంబం, విధి ఆడిన నాటకానికి దిక్కుతోచని స్థితిలో పడింది. కుటుంబాన్ని పోషించే ఇంటి పెద్దదిక్కు అయిన శివ, గత రెండు నెలల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడి మంచానికే పరిమితమయ్యాడు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరు ఆసుపత్రులకు వెళ్లినప్పటికీ, అక్కడ లక్షల రూపాయల వైద్య ఖర్చులను భరించలేక ఆ నిరుపేద కుటుంబం తిరిగి స్వగ్రామానికి చేరుకుంది. రోజు గడవడమే కష్టంగా మారిన ఆ కుటుంబానికి, పిల్లల చదువులు సైతం తీవ్ర సమస్యగా మారాయి. ఈ దయనీయ పరిస్థితిని తెలుసుకున్న మడకశిర శాసనసభ్యుడు ఎమ్మెస్ రాజు తక్షణమే స్పందించారు. ఆపదలో ఉన్న ఆ కుటుంబానికి అండగా నిలుస్తూ తన వంతుగా రూ. 50,000/- ఆర్థిక సహాయాన్ని అందజేసి పెద్దదిక్కుగా భరోసానిచ్చారు. కష్టకాలంలో ఉన్న పేద కుటుంబానికి సకాలంలో స్పందించి, అండగా నిలిచిన ఎమ్మెల్యే రాజుకు శివ కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు ప్రత్యేక అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు.

# జగన్ రాజకీయాలతో కాపులకు దగా

## తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి. నరసింహ యాదవ్ ధ్వజం



తిరుపతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కీలకమైన కాపు సామాజికవర్గాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి. నరసింహ యాదవ్ ఆరోపించారు. తిరుపతిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో కాపు సంక్షేమాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిన జగన్, ఇప్పుడు అధికారం కోల్పోయిన తర్వాత మళ్లీ అదే వర్గం పేరుతో రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. కాపులకు రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన జగన్, అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చి, కేంద్రం కల్పించిన ఈబీసీ 10 శాతం కోటాలో గత ప్రభుత్వం కాపులకు కేటాయించిన 5 శాతం రిజర్వేషన్లను జీవో నెం.60 ద్వారా రద్దు చేశారని నరసింహ యాదవ్ ఆరోపించారు. ఇది కాపు యువత భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపిందని పేర్కొన్నారు. కాపు కార్పొరేషన్‌కు ప్రతి ఏడాది రూ.2,000 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చినా, ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా ప్రత్యేకంగా విడుదల చేయలేదని విమర్శించారు. విదేశీ విద్యా దీవెన వంటి పథకాలను రద్దు చేసి, సాధారణ డీబీటీ పథకాలనే కాపు కార్పొరేషన్ ఖాతాలో చూపించి ప్రజలను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై కుల రాజకీయాలను రెచ్చగొట్టేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందన్నారు. కాపు రిజర్వేషన్ల రద్దుకు సంబంధించిన ప్రభుత్వ జీవోలపై శ్వేతపత్రం విడుదల చేయాలని, అలాగే ఐదేళ్లలో కాపు కార్పొరేషన్ ద్వారా ఎంతమందికి స్వయం ఉపాధి రుణాలు అందించారో లబ్ధిదారుల వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

# నేత్ర జ్యోతితో వేలాది మందికి కంటి వెలుగు

నెల్లూరు నగరం, 47 డివిజన్ లో గుప్తాపార్క్ సెంటర్ సమీపంలోని పులి రాఘవ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో నారాయణ నేత్రజ్యోతి ఆధ్వర్యంలో ఉచిత కళ్లద్దాల పంపిణీ చేపట్టారు. మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ దాతృత్వంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో, ఇటీవల సిటీ స్కూల్ సమీపంలో జరిగిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్న లబ్ధిదారులకు ఉచితంగా కళ్లద్దాలు అందజేస్తున్నారు. ధర్మవరం సుబ్బారావు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో 47వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గణేష్ కుమార్ తో కలిసి ప్రముఖ కంటి వైద్యురాలు డాక్టర్ సుధా లబ్ధిదారులకు నాణ్యమైన కళ్లద్దాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, "నారాయణ నేత్రజ్యోతి కేవలం కంటి వైద్య సేవ మాత్రమే కాకుండా వేలాది మంది జీవితాల్లో వెలుగులు నింపుతున్న మహోన్నత సేవా కార్యక్రమమన్నారు. ఉపాధ్యక్షుడు మదనంబేటి మునిశేఖర్, ప్రధాన కార్యదర్శి కల్వకుంట భాస్కర్ సిద్ధకళచారి, నాగార్జున, వీరమల్లు చంద్ర, కంచి కృష్ణ, కావలి అలేఖ్య, పూజారి శారిక, పాజర్ల సుహాసిని, బి.హరీష్, నీలకంఠం మునికృష్ణ, మునికుమార్, నాగలక్ష్మి, గుంజి రత్నమ్మ, జిల్లెల లక్ష్మీదేవి, కవిత, షేక్ ఫయాజ్, రాళ్ల సురేష్, టి.వెంకటేశ్వర్లు, మేళపూడి లక్ష్మి , మనోజ్ పాల్గొన్నారు.





సొంతూరు పరిశ్రమను స్థాపించిన

# యువ పారిశ్రామిక వేత్తకు ఎమ్మెల్యే ఏలూరి అభినందనలు

ఇంకొల్లు (చైతన్యరథం): స్వగ్రామంలోనే పరిశ్రమను స్థాపించి స్థానిక యువత, ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో ముందుకొచ్చిన యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. ఇంకొల్లు మండలం గొల్లపాలెం గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన బసాయి ఫుడ్ ఇండస్ట్రీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో పుట్టి పెరిగిన వినోద్ కుమార్ ఉన్నత విద్యను అభ్యసించి స్వగ్రామానికి తిరిగి వచ్చి స్థానికులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో పరిశ్రమను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. రైతుల నుంచి నేరుగా పంటను కొనుగోలు చేసి క్రిమిసంహారక అవశేషాలు లేని నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేయడం మంచి పరిణామమని పేర్కొన్నారు. సహజసిద్ధమైన ఆహార ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలని కోరారు.వినోద్ కుమార్ సతీమణి జ్యోతి విదేశాల్లో ఉద్యోగాన్ని వదిలి స్వగ్రామానికి వచ్చి స్థానిక మహిళలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో పనిచేయడం ప్రశంసనీయమని అన్నారు. భవిష్యత్తులో ఈ సంస్థ దేశవ్యాప్తంగా విస్తరించి వేలాది మంది యువతకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పరిశ్రమలో ఉద్యోగాలు పొందిన 30 మంది యువతకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేతుల మీదుగా అపాయింట్‌మెంట్ లేఖలు అందజేశారు.

గొల్లపాలెం గ్రామంలో రూ.36 లక్షల వ్యయంతో నిర్మించిన విలేజ్ హెల్త్ సెంటర్ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

**దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేత**

గ్రామానికి చెందిన దివ్యాంగుడు వల్లభనేని బాలకృష్ణ నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే, అతడిని పరామర్శించి ట్రైసైకిల్ అందజేశారు. దివ్యాంగుల సంక్షేమం ప్రభుత్వ ప్రాధాన్య అంశమని పేర్కొన్నారు.

**పౌలు కుటుంబానికి పరామర్శ**

ఇంకొల్లులోని స్టాలిన్‌పేటలో ఇటీవల మృతి చెందిన వలేరు పౌలు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

మహిళల భద్రత, హక్కుల పరిరక్షణకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం ఇంకొల్లులో ఏర్పాటు చేసిన జెండర్ రిసోర్స్ సెంటర్ను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రారంభించారు. మహిళలకు అవసరమైన సేవలు, సలహాలు ఒకేచోట అందుబాటులోకి రావడం ద్వారా మరింత భరోసా కలుగుతుందని పేర్కొన్నారు.




## ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ ఎన్ఆర్ఐలకు

# టీపీ కబురు

### క్వాంటాస్ ఎయిర్‌లైన్స్ కోడ్ షేర్‌కు డీజీసీఏ గ్రీన్‌సిగ్నల్

### గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు ఇక నుంచి డైరెక్ట్ టికెట్

**విజయవాడ (చైతన్యరథం):** ఆంధ్రప్రదేశ్ పర్యాటక, విమానయాన రంగంలో మరో భారీ మైలురాయి నమోదైంది. విజయవాడ (గన్నవరం) విమానాశ్రయం నుంచి అంతర్జాతీయ ప్రయాణాలను మరింత సులభతరం చేస్తూ ప్రముఖ అంతర్జాతీయ విమానయాన సంస్థ 'క్వాంటాస్ ఎయిర్‌లైన్స్' కోడ్‌షేర్ ఒప్పందానికి భారత పౌర విమానయాన నియంత్రణ సంస్థ (డీజీసీఏ) (DGCA) అధికారికంగా అనుమతులు మంజూరు చేసింది. ఈ నిర్ణయంతో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఫిజీ వంటి దేశాల నుంచి విజయవాడకు ప్రయాణించే వారికి ఎలాంటి అంతరాయం లేని అంతర్జాతీయ ప్రయాణ సౌకర్యం లభించనుంది. క్వాంటాస్ ఎయిర్ లైన్స్‌కు కోడ్ షేర్ అనుమతి ఇవ్వడంపై ఆస్ట్రేలియా టీడీపీ అధ్యక్షుడు విజయ్ చెన్నుపాటి హర్షం వ్యక్తం చేశారు.

#### కోడ్‌షేర్ అనుమతి... ప్రాముఖ్యత

డీజీసీఏ కోడ్‌షేర్ ఆమోదంతో విజయవాడ విమానాశ్రయం ఇకపై గ్లోబల్ బుకింగ్ సిస్టమ్స్‌లో (GDS-Amadeus, Sabre, Travelport వంటి వాటిలో) భాగస్వామ్య ఎయిర్‌లైన్ కోడ్‌తో దర్శనమివ్వనుంది. దీనివల్ల కలిగే ప్రధాన ప్రయోజనాలు ఇవే:

**గ్లోబల్ బుకింగ్స్:** ప్రపంచవ్యాప్తంగా ఉన్న ట్రావెల్ ఏజెన్సీలు, టికెట్ ఏజెంట్లు ఇకపై విజయవాడను తమ మల్టీ-ఎయిర్‌లైన్ ప్రయాణ బుకింగ్స్‌లో సులభంగా భాగం చేయవచ్చు.

**సింగిల్ టికెట్-సింగిల్ బోర్డింగ్ పాస్:** క్వాంటాస్ వంటి ఎయిర్‌లైన్స్ సిడ్నీ (SYD) లేదా మెల్‌బోర్న్ (MEL) నుంచి సింగపూర్ లేదా బెంగళూరు హబ్ మీదుగా విజయవాడకు ఒకే టికెట్‌పై ప్రయాణాన్ని విక్రయించగలవు. ప్రయాణికులకు ఒకే PNR, ఒకే బోర్డింగ్ పాస్ లభిస్తాయి.

**త్రూ-చెక్డ్ లగేజ్** (Through-Checked Baggage): విదేశాల్లో లగేజ్ చెకిన్ చేస్తే నేరుగా విజయవాడలోనే లగేజ్ అందుకోవచ్చు. మధ్యలో విమానాలు మారినప్పుడు లగేజ్ మార్చాల్సిన తిప్పలు తప్పుతాయి.

**కనెక్టింగ్ ఫ్లైట్ రక్షణ:** ఒకవేళ కనెక్టింగ్ ఫ్లైట్ మిస్ అయితే ప్రయాణికులకు పూర్తి రక్షణ బాధ్యతను ఎయిర్‌లైన్స్ సంస్థలే చూసుకుంటాయి. భారతదేశంలో డొమెస్టిక్ రవాణాను ఇండిగో (IndiGo) వంటి స్థానిక ఎయిర్‌లైన్స్ నిర్వహిస్తాయి.




#### గ్లోబల్ కనెక్టివిటీకి సరికొత్త ద్వారం

ఇప్పటివరకు ప్రాంతీయ విమానాశ్రయంగా సేవలందిస్తున్న విజయవాడ ఈ అంతర్జాతీయ కోడ్‌షేర్ ఆమోదంతో 'గ్లోబల్-బుకబుల్' (Global-Bookable) అంతర్జాతీయ గమ్యస్థానంగా రూపాంతరం చెందింది. ఎయిర్‌లైన్స్ సంస్థలు కొత్త విమానాలను కొనుగోలు చేయాల్సిన అవసరం లేకుండానే తమ నెట్‌వర్క్‌ను విజయవాడకు విస్తరించుకునే వీలు కలిగింది. ఇది ఏపీకి వచ్చే విదేశీ పర్యాటకులకు, ఎన్నారై (Diaspora) ప్రయాణికులకు, వ్యాపారవేత్తలకు ఎంతో ప్రయోజనకరంగా మారనుంది.

సరళంగా చెప్పాలంటే... ఇకపై ప్రపంచంలో ఎక్కడి నుంచైనా క్వాంటాస్ వెబ్‌సైట్ లేదా గ్లోబల్ ట్రావెల్ పోర్టల్స్ ద్వారా నేరుగా విజయవాడకు ఎలాంటి కన్ఫ్యూజన్ లేకుండా సింగిల్ క్లిక్‌తో టికెట్ బుక్ చేసుకోవచ్చు.




# ప్రకృతి ఒడిలో 'తానా' ఫాదర్స్ డే

### ఛార్లెట్‌లో ఉల్లాసంగా, ఉత్సాహంగా మెగా హైకింగ్ ఈవెంట్

**ఛార్లెట్:** ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఛార్లెట్ విభాగం ఆధ్వర్యంలో ఫాదర్స్ డే హైకింగ్ వైభవంగా జరిగింది. మూడు తరాలకు చెందిన సుమారు 60మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో అందమైన ప్రకృతి దృశ్యాల మధ్య సాగిన ఈ ఈవెంట్‌లో ప్రతి ఒక్కరూ ఎంతో ఉల్లాసంగా గడిపారు. అనంతరం ఏర్పాటుచేసిన అల్పాహారం, కేక్ కటింగ్, ఆహూతుల స్నేహపూర్వక సంభాషణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమం మరపురాని వేడుకగా నిలిచిందని ఇందులో పాల్గొన్న వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఛార్లెట్‌లోని 'తానా' నాయకులు మాట్లాడుతూ... కమ్యూనిటీ కోసం తాము ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా ఈ ఈవెంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. మన జీవితానికి మార్గదర్శి నాన్న అని, ఈరోజు నిర్వహించిన ఫాదర్స్ డే వేడుకలకు ఇంత మంచి స్పందన రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. తెలుగువారి మధ్య ఐక్యతను ప్రతిబింబించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. వచ్చినవారు ఒకరినొకరు పరిచయం చేసుకునే అవకాశం లభించిందన్నారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ, స్వచ్ఛంద సేవకులకు 'తానా' ప్రతినిధులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమ నిర్వహణకు నాని వడ్లమూడి, ఠాగూర్ మల్లినేని, కిరణ్ కొత్తపల్లి, మాధురి ఏలూరి, నాగ పంచుమర్తి, పట్టాభి కంఠమనేని, అన్నే రమణ తదితరులు విశేష కృషి చేశారు.










# రష్యాలో భారతీయ యోగా

### సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

**సెయింట్ పీటర్స్‌బర్గ్:** రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ఉన్న భారత రాయబార కార్యాలయ కాన్సులేట్ జనరల్ నీలం రాణి ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని చారిత్రాత్మక యుసుపోవ్ గార్డెన్‌లో అత్యంత వైభవంగా నిర్వహించారు. సెయింట్ పీటర్స్‌బర్గ్ ప్రభుత్వం, విదేశీ వ్యవహారాల కమిటీ, ఫిజికల్, కల్చర్, స్పోర్ట్స్ కమిటీ సంయుక్త సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ మహా వేడుకలో 45కు పైగా యోగా సంస్థలు, సాంస్కృతిక సంఘాలు, స్థానిక కమ్యూనిటీ గ్రూపులు అత్యంత ఉత్సాహంగా పాల్గొని భారతీయ సంప్రదాయ యోగా విశిష్టతను చాటిచెప్పాయి. ప్రపంచవ్యాప్తంగా



అనుసరించే 'కామన్ యోగా ప్రొటోకాల్'తో ప్రారంభమైన ఈ వేడుకలు రోజంతా వైభవంగా సాగాయి. ఇందులో భాగంగా ప్రత్యేక యోగా వర్క్‌షాప్‌లు, వెల్‌నెస్ కార్యక్రమాలు, ఆయుర్వేద అవగాహన సదస్సులతో పాటు పలు సాంస్కృతిక, సంగీత ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

**భారత్-రష్యా బంధానికి ప్రతీక:**

ఈ వేడుకకు దాదాపు ఆరువేల మందికి పైగా యోగా సాధకులు, సందర్శకులు తరలివచ్చారు. యోగా ద్వారా ప్రపంచానికి అందే ఆరోగ్యం, సామరస్యం, మానసిక ప్రశాంతత అనే సార్వత్రిక సందేశానికి ఈ కార్యక్రమం అద్దంపట్టింది. ఈ సందర్భంగా భారత్, రష్యా మధ్య సాంస్కృతిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తూ ప్రతి ఒక్కరి సంపూర్ణ ఆరోగ్యానికి నిరంతరం కృషి చేస్తామని నిర్వాహకులు పునరుద్ఘాటించారు.







# భారత్ కోసం .. అమెరికా రక్షణ సాయం!



భారత్‌కు చెందిన కీలక రక్షణ వ్యవస్థల నిర్వహణ, సాంకేతిక మద్దతు కోసం అమెరికా సహాయం చేయబోతోంది. ఈ మేరకు అమెరికా 428.2 మిలియన్ డాలర్ల (సుమారు రూ.3,600 కోట్లకు పైగా) విలువైన రెండు రక్షణ సహాయ ప్యాకేజీలకు ఆమోదం తెలిపింది. ఈ ప్యాకేజీలను కొత్త ఆయుధాల కొనుగోలు కోసం కాకుండా ఇప్పటికే భారత సైన్యంలో సేవలందిస్తున్న వ్యవస్థల నిర్వహణ, శిక్షణ, విడిభాగాల సరఫరా కోసం కేటాయించారు. అమెరికా ఇవ్వనున్న 428.2 మిలియన్ డాలర్ల ప్యాకేజీలో 198.2 మిలియన్ డాలర్లను ఏహెచ్-64ఈ అపాచీ యుద్ధ హెలికాప్టర్ల నిర్వహణ కోసం కేటాయించారు. ఇందులో ఇంజినీరింగ్ సేవలు, సాంకేతిక సహాయం, లాజిస్టిక్ మద్దతు, శిక్షణ వంటి అంశాలు ఉన్నాయి. ఈ ప్యాకేజీకి బోయింగ్, లాక్‌హీడ్ మార్టిన్ సంస్థలు ప్రధాన కాంట్రాక్టర్లుగా ఉంటాయి.మరో 230 మిలియన్ డాలర్ల ప్యాకేజీని ఎం-777 ఏ2 అల్ట్రా-లైట్ హోవిట్జర్ తుపాకుల నిర్వహణకు కేటాయించారు. దీనిలో విడిభాగాలు, సాంకేతిక సహాయం, శిక్షణ, లాజిస్టిక్ మద్దతు వంటి సేవలు ఉంటాయి. ఈ కార్యక్రమానికి ప్రధాన కాంట్రాక్టర్‌గా బీఏఈ సిస్టమ్స్ వ్యవహరించనుంది. ఈ ఒప్పందాలు ఇండో, పసిఫిక్ ప్రాంతంలో భారత్, అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తాయని అమెరికా విదేశాంగ శాఖ పేర్కొంది. ఈ సహాయం ద్వారా ప్రస్తుత, భవిష్యత్తు భద్రతా సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని భారత్ పెంచుకుంటుందని తెలిపింది.



# తమిళనాడులో జలప్రళయం

## వర్ష బీభత్సం.. తూత్తుకుడి జిల్లా అతలాకుతలం!

తమిళనాడులోని తూత్తుకుడి జిల్లాలో భారీ విధ్వంసం జరిగింది. టోర్నడో లాంటి వాతావరణం ఏర్పడి వాగైకుళం, ముడివైతానెందల్ గ్రామాలను అతలాకుతలం చేసింది. చూసేందుకు అచ్చం టోర్నడోలాగా ఉన్న గాలి ప్రవాహం విధ్వంసం సృష్టించింది. తూత్తుకుడి విమానాశ్రయం సమీపంలోని ఇళ్లు, ఓ టోల్ ప్లాజా, ప్రైవేట్ థీమ్ పార్కుపై విరుచుకుపడింది. అయితే, ఇది టోర్నడో కాదని క్యుములోనింబస్ మేఘ వ్యవస్థకు సంబంధించి శక్తివంతమైన ఉరుములతో కూడిన గాలి ప్రవాహమని వాతావరణ శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. క్యుములోనింబస్ కారణంగా బలమైన స్థానిక గాలులు, దుమ్ము రేగడంతో పాటు అప్‌డ్రాఫ్ట్‌లనే తీవ్రమైన పైకి కదిలే గాలి ప్రవాహాలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. అయితే, దీని కారణంగా దాదాపు 200 ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఇళ్ల పైకప్పులు, సామగ్రి, ఇతర వస్తువులు గాలిలోకి ఎగిరిపోయాయి. భయంకరమైన గాలుల వల్ల భారీగా చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఏం జరుగుతుందో అర్థంకాక అయోమయానికి లోనైయ్యారు. ఈ ఘటనలో ఇద్దరికి స్వల్పగాయాలు కాగా.. ప్రాణనష్టం తప్పింది.

# ఇన్‌స్టాగ్రామ్ వేదికగా నకిలీ నీట్ యూజీ పేపర్ లీక్



దేశవ్యాప్తంగా ఆదివారం జరిగిన నీట్ యూజీ పరీక్షలకు సంబంధించి ఒక ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను ఉపయోగించి నకిలీ 'నీట్ యూజీ' ప్రశ్నాపత్రాన్ని సృష్టించి, దాన్ని సోషల్ మీడియాలో విక్రయించిన ఒక లా విద్యార్థిని మధ్యప్రదేశ్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇండోర్‌లోని లసుడియా ప్రాంతానికి చెందిన అక్షయ్ మాల్వియా అనే మొదటి సంవత్సరం లా విద్యార్థి ఈ దందాకు తెరలేపాడు. తక్కువ శ్రమతో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో, అతడు సహాయంతో నకిలీ నీట్ క్వశ్చన్ పేపర్‌ను తయారు చేశాడు. ఆ తర్వాత ఇన్‌స్టాగ్రామ్ వేదికగా విద్యార్థులను, తల్లిదండ్రులను బురిడీ కొట్టిస్తూ ఈ పేపర్లను అమ్మకానికి పెట్టాడు.

### పేపర్‌కు రూ.50 నుంచి రూ.100

ఈ మోసానికి సంబంధించిన వివరాలను డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్, క్రైమ్ బ్రాంచ్ రాజేష్ కుమార్ త్రిపాఠి మీడియాకు వెల్లడించారు. నిందితుడు ఒక్కో ప్రశ్నాపత్రానికి రూ.50 నుంచి రూ.100 వరకు వసూలు చేశాడు. ధర తక్కువగా ఉండటంతో చాలామంది విద్యార్థులు దీన్ని కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపారు. ఇలా దాదాపు 22 నుంచి 25 మందికి ఈ నకిలీ పేపర్లను విక్రయించి, సుమారు రూ.25,000 నుంచి రూ.30,000 వరకు అక్రమంగా సంపాదించాడు.'నిందితుడు అక్షయ్ మాల్వియా కేవలం డబ్బు సంపాదన కోసమే కాకుండా, విద్యార్థుల్లో తీవ్ర గందరగోళం సృష్టించేలా ఈ నకిలీ పేపర్లను తయారు చేశాడు. సోషల్ మీడియాపై నిరంతరం నిఘా ఉంచిన క్రైమ్ బ్రాంచ్ బృందానికి అందిన సమాచారం ఆధారంగా అతడిని అదుపులోకి తీసుకున్నాం. నిన్న (ఆదివారం) దేశవ్యాప్తంగా జరిగిన ఒరిజినల్ నీట్ పరీక్ష పత్రానికి, ఈ నిందితుడు సృష్టించిన నకిలీ పేపర్‌కు ఎలాంటి సంబంధం లేదు' అని డీసీపీ త్రిపాఠి స్పష్టం చేశారు. నిందితుడిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అతడిపై భారతీయ

### లా విద్యార్థి అరెస్టు

న్యాయ సంహిత సెక్షన్ 318(4)(చీటింగ్, మోసపూరితంగా ఆస్తిని లాక్కోవడం)తో పాటు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ సెక్షన్ 66(కంప్యూటర్ ఆధారిత నేరాలు) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సీనియర్ నేత శశిథరూర్ వ్యాఖ్యలతో కాంగ్రెస్‌లో కలకలం

జమ్మూ కశ్మీర్‌లో పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుంటోందంటూ కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ చేసిన వ్యాఖ్యలతో ఆ పార్టీలో దుమారం రేగింది. థరూర్ పార్టీ లైన్‌కు వ్యతిరేకంగా మాట్లాడారంటూ కాంగ్రెస్ నేతలే అగ్గి మీద గుగ్గిలమవుతున్నారు. జమ్మూ కశ్మీర్ పర్యటనకు వెళ్లిన థరూర్.. అక్కడ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాతో భేటీ అయ్యారు. అనంతరం ఎక్స్ వేదికగా స్పందించారు. 'శ్రీనగర్‌లో ఎల్జీ మనోజ్ సిన్హాతో అద్భుత సమావేశం జరిగింది. జమ్మూ కశ్మీర్‌లో పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకోవడంలో ప్రోత్సాహకరమైన పురోగతిపై చర్చించాం. నేను చేరుకునే సరికి ఆయన కశ్మీరీ రచయితల సంఘం, మహిళా సంఘాల నేతలతో మాట్లాడుతున్నారు. ఈ సానుకూల ధోరణిని స్వాగతిస్తున్నా.. ఇంకా ఎన్నో సవాళ్లున్నాయి. చేయాల్సింది చాలానే ఉంది. కానీ కొంతకాలం తర్వాత సానుకూల భావనతో సమావేశం నుంచి వెనుదిరిగా..' అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే థరూర్ తీరుపై జమ్మూ కశ్మీర్‌లోని కాంగ్రెస్ అధికార ప్రతినిధి రవీందర్ శర్మ విరుచుకుపడ్డారు. థరూర్ క్షేత్రస్థాయి వాస్తవాలను అర్థం చేసుకోవడానికి కశ్మీర్ లోయ ప్రజల్ని కలిసి మాట్లాడితే బాగుండేదని పేర్కొన్నారు. మరోవైపు థరూర్ వ్యాఖ్యలను బీజేపీ అధికార ప్రతినిధి అభిజీత్ జస్రోటియా సమర్థించారు. 'ఇందులో ఆశ్చర్యం ఏముంది. కాంగ్రెస్ ఎన్ని ఆరోపణలు చేస్తున్నా.. క్షేత్రస్థాయి గణాంకాలు మరోలా ఉన్నాయి. గత 18 నెలల్లో ఒక్క యువకుడు కూడా ఉగ్రవాదుల్లో చేరలేదు' అని పేర్కొన్నారు.

## అగ్నిప్రమాదంపై ప్రధాని మోదీ విచారం

ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో జరిగిన ఘోర అగ్నిప్రమాద ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ విషాద ఘటన నేపథ్యంలో ప్రధానమంత్రి జాతీయ ఉపశమన నిధి నుంచి మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేయనున్నట్లు ప్రకటించారు. ప్రమాదంలో గాయపడిన ప్రతి ఒక్కరికీ రూ.50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అలీగంజ్ ప్రాంతంలోని ఓ కోచింగ్ సెంటర్‌లో జరిగిన ఈ అగ్నిప్రమాదం దేశవ్యాప్తంగా ఆందోళన కలిగించింది.





# లఖ్‌నవూలో భారీ అగ్నిప్రమాదం

## కోచింగ్ సెంటర్‌లో చెలరేగిన మంటలు, పదకొండు మంది మృతి

ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అలీగంజ్ జిల్లా పూర్నియా ప్రాంతంలో ఉన్న ఓ కోచింగ్ సెంటర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాదం జరిగిన సమయంలో కోచింగ్ సెంటర్‌లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. మంటలు వేగంగా వ్యాపించడంతో భవనం మొత్తం దట్టమైన పొగతో నిండిపోయింది. దీంతో లోపల ఉన్న విద్యార్థులు ఊపిరాడక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో దాదాపు 11 మంది మృతి చెందినట్లు సమాచారం. ఈ భవనంలో కోచింగ్ సెంటర్‌తో పాటు పలు దుకాణాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాద సమయంలో ఐదుగురు నుంచి ఏడుగురు విద్యార్థులు భవనం నుంచి దూకినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. వారిలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా, చికిత్స అందిస్తున్నారు.సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఎనిమిది ఫైరింజన్లతో ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, పలువురు విద్యార్థులు భవనంలో చిక్కుకుపోయి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.అగ్నిప్రమాదంపై స్పందించిన ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సహాయక చర్యలను వేగవంతం చేయాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఘటనకు గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు.

# మాస్కోపై ఉక్రెయిన్ డ్రోన్ల వర్షం



రష్యా: రష్యా రాజధాని మాస్కోను లక్ష్యంగా చేసుకుని ఉక్రెయిన్ మరోసారి డ్రోన్లతో దాడులు చేసింది. ఉక్రెయిన్‌కు చెందిన డ్రోన్లు మాస్కో వైపు దూసుకొస్తుండగా, రష్యా వైమానిక రక్షణ వ్యవస్థలు అప్రమత్తమయ్యాయి. దాదాపు 60 డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా అధికారులు వెల్లడించారు. ఈ పరిణామంతో మాస్కోలోని నాలుగు ప్రధాన విమానాశ్రయాల్లో విమానాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. మాస్కోను లక్ష్యంగా చేసుకుని వచ్చిన డ్రోన్లను నగర పరిసర ప్రాంతాల్లోనే అడ్డుకుని ధ్వంసం చేసినట్లు ఆ ప్రాంత మేయర్ సెర్గీ సోబ్యానిన్ తెలిపారు. డ్రోన్ల శకలాలు పడిన ప్రాంతాలకు అత్యవసర సిబ్బందిని పంపినట్లు తెలిపారు. ప్రాథమిక

**❑ నాలుగు విమానాశ్రయాల మూసివేత**

సమాచారం ప్రకారం ప్రాణనష్టం లేదా భారీ ఆస్తి నష్టం సంభవించినట్లు నివేదికలు లేవని అన్నారు. భద్రతా కారణాల దృష్ట్యా షెరెమెత్యేవో, డొమోడెడోవో, వ్నుకోవో, జుకోవ్‌స్కీ విమానాశ్రయాల్లో కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేశారు. పరిస్థితి అదుపులోకి వచ్చిన తర్వాత విమాన సర్వీసులను పునరుద్ధరించారు. అలాగే ముందు జాగ్రత్త చర్యగా క్రిమియాలో సోమవారం జరగాల్సిన అన్ని బహిరంగ కార్యక్రమాలను అధికారులు రద్దు చేశారు. సాధ్యమైనంత వరకు విద్యుత్ వినియోగాన్ని తగ్గించుకోవాలని ప్రజలకు సూచించారు. గత కొద్దిరోజులుగా రష్యాలోని చమురు శుద్ధి కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని ఉక్రెయిన్ డ్రోన్ దాడులు చేస్తోంది. ఈ నేపథ్యంలో పలు ప్రాంతాల్లో చమురు కొరత ఏర్పడింది.

# బ్రిటన్ ప్రధాని రాజీనామా



బ్రిటన్: యూకేలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రధాని పదవి నుంచి తాను తప్పుకుంటున్నట్లు కీర్ స్టార్మర్ ప్రకటించారు. లేబర్ పార్టీ నాయకత్వ బాధ్యతల నుంచి కూడా తప్పుకుంటున్నానని పేర్కొన్నారు. రాజీనామా కోసం పార్టీ నుంచి ఒత్తిడి పెరగడంతో కీర్ స్టార్మర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. 2024లో కీర్ స్టార్మర్ యూకే 58వ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. స్టార్మర్ నాయకత్వంపై లేబర్ పార్టీలో కొంత కాలంగా అసంతృప్తి వ్యక్తం అవుతోంది. ఆయన సారథ్యంలో ప్రభుత్వ పాపులారిటీ తగ్గుతోందన్న ఆందోళన పార్టీ వర్గాల్లో నెలకొంది. ప్రజాసేవలను మెరుగు పరుస్తానంటూ కీర్ స్టార్మర్ రెండేళ్ల క్రితం ప్రధాని బాధ్యతలు చేపట్టారు. జీవన వ్యయాలు తగ్గిస్తానని ప్రజలకు మాటిచ్చి గద్దెనెక్కారు. ఆర్థిక అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానన్నారు. అయితే హామీల మేరకు ఫలితాలు లేకపోవడంతో ప్రజల్లో విముఖత పెరగడంపై లేబర్ పార్టీలో ఆందోళన వ్యక్తం అవుతోంది.

# జూలైలో యూకే కొత్త ప్రధాని ప్రమాణస్వీకారం!

ఇంగ్లండ్: యూకే ప్రధాని పదవి నుంచి తప్పుకున్నట్లు లేబర్ పార్టీ నేత కీర్ స్టార్మర్ తాజాగా ప్రకటించారు. అయితే వచ్చే నెలలోనే నూతన ప్రధాని ప్రభుత్వ పగ్గాలు చేపట్టే అవకాశం ఉందని అన్నారు. ప్రస్తుతం పార్టీ మద్దతు ఉన్న ఎంపీ ఆండీ బర్న్‌హామ్



అభ్యర్థిత్వాన్ని ఎవరూ వ్యతిరేకించకుండా ఉంటే ఆయన వచ్చే నెలలో ప్రధాని పీఠాన్ని అధిరోహించే అవకాశం ఉంది. ప్రభుత్వ పనితీరుపై సొంత పార్టీలోనే విమర్శలు పెరగడంతో స్టార్మర్ తప్పుకోవాల్సి వచ్చిన విషయం తెలిసిందే. అయితే తన పాలనలో పార్టీకి అనేక విజయాలు దక్కాయని రాజీనామా ప్రకటన సందర్భంగా స్టార్మర్ బలంగా వాదించారు. దేశ ఆర్థిక వ్యవస్థ మునుపటి కంటే మెరుగైందని చెప్పారు. ఉద్యోగులు, వర్కర్ల జీతాలు పెరిగాయని చెప్పారు. లేబర్ పార్టీపై ప్రజాభిప్రాయాన్ని మార్చామని చెప్పారు. తన పాలనలో దేశంలో అక్రమ వలసలకు కూడా అడ్డుకట్ట పడిందని అన్నారు. వేల మందిని పేదరికం నుంచి బయటపడేశామని చెప్పారు. బ్రిటన్ తదుపరి ప్రధాని ఎవరనే దానిపై కూడా స్టార్మర్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఆండీ బర్న్‌హామ్ అభ్యర్థిత్వా ఎవరూ వ్యతిరేకించకపోతే ఆయన వచ్చే నెలలోనే ప్రధాని పగ్గాలు చేపడతారని అన్నారు. ఒక వేళ ఎన్నికలు జరగాల్సి వస్తే ఆగస్టు నాటికి నూతన ప్రధాని యూకే పగ్గాలు చేపడతారని చెప్పారు. ఈ దిశగా ఒక టైమ్‌టేబుల్‌ను రూపొందించాలని పార్టీ ఎగ్జిక్యూటివ్ కమిటీకి కూడా సూచించానని చెప్పారు. నూతన ప్రధానికి తన పూర్తి మద్దతు ఉంటుందని అన్నారు.

# నాకు ఇష్టమైన భారత్, పాక్ వ్యక్తులు వీళ్లే

**◆అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్**

స్విట్జర్లాండ్: స్విట్జర్లాండ్‌లో జరిగిన అమెరికా-ఇరాన్ చర్చల సందర్భంగా అగ్రరాజ్య ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు అత్యంత ఇష్టమైన భారతీయ, పాకిస్తానీ వ్యక్తుల గురించి మాట్లాడారు. తనకు ఇష్టమైన భారతీయ వ్యక్తి తన భార్య ఉషా వాన్స్ అని, ఇష్టమైన పాకిస్తానీ ఆ దేశ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ అని పేర్కొన్నారు. స్విట్జర్లాండ్‌లోని బర్గెన్‌స్టాక్‌లో అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు జరుగుతున్న సమయంలో జేడీ వాన్స్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం తన జీవితంలో ఈ ఇద్దరూ ఎంతో ముఖ్యులని పేర్కొన్నారు.



ఈ సమావేశంలో పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహ్‌బాజ్ షరీఫ్‌తో పాటు సైన్యాధిపతి అసీమ్ మునీర్ కూడా పాల్గొన్నారు. గత మూడు నెలల్లో తాను మిగతా వారితో కంటే మునీర్‌తోనే ఎక్కువగా మాట్లాడానని వాన్స్ వెల్లడించారు. 'మునీర్ గొప్ప రాజనీతిజ్ఞత కలిగిన వ్యక్తి. ఆయన వల్లే నేను స్విట్జర్లాండ్‌లో చర్చల కోసం వచ్చాను. ఆయన నిస్సందేహంగా ఒక గొప్ప సైనిక నాయకుడు. అలాగే ఒక గొప్ప దౌత్యవేత్తని కూడా అని ఆయన నిరూపించుకున్నారని నేను భావిస్తున్నాను. అంతేకాదు ఆయన ఒక అద్భుతమైన నాయకుడు కూడా' అని వాన్స్ ప్రశంసించారు. పాకిస్థాన్, ఖతార్ ప్రతినిధి బృందాలతో సహా మధ్యవర్తుల సమక్షంలో స్విట్జర్లాండ్‌లోని ఒక విలాసవంతమైన రిసార్ట్‌లో అమెరికా, ఇరాన్‌లు తమ మొదటి విడత చర్చలను ప్రారంభించిన తరుణంలో వాన్స్ ఈ వ్యాఖ్యలు చేశారు.


## ఖతార్ ఎల్ఎన్‌జీ గ్యాస్ కాంప్లెక్స్ ప్రమాద మృతుల్లో భారతీయులు

ఖతార్: రాస్ లఫాన్ ఎల్ఎన్‌జీ గ్యాస్ కాంప్లెక్స్‌లో ఆదివారం సంభవించిన పేలుడులో 13 మంది మృతి చెందారు. మృతుల్లో భారతీయులు కూడా ఉన్నట్టు జాతీయ మీడియాలో తాజాగా కథనాలు వెలువడ్డాయి. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఘటనలో 66 మంది గాయపడ్డారని కూడా ఖతార్ ఇంధన శాఖ మంత్రి ధ్రువీకరించారు. ప్లాంట్ కార్యక్రమాలను మళ్లీ ప్రారంభించేందుకు వర్కర్లు ప్రయత్నిస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగిందని వెల్లడించింది. ఈ ప్రమాదంలో ప్లాంట్ ఎగుమతి సామర్థ్యం దెబ్బతినలేదని ఖతార్ ఇంధన శాఖ తెలిపింది.

# హెజ్బొల్లా భారీ భూగర్భ డ్రోన్ ఫ్యాక్టరీ

**◆దక్షిణ లెబనాన్ ప్రాంతంలో కనుగొన్న ఇజ్రాయెల్ సైన్యం**

టెల్ అవీవ్/బీరుట్: దక్షిణ లెబనాన్‌లోని పర్వత శ్రేణుల కింద అత్యంత రహస్యంగా నిర్మించిన హెజ్బొల్లాకు చెందిన ఒక భారీ భూగర్భ డ్రోన్ కర్మాగారాన్ని ఇజ్రాయెల్ సైన్యం కనుగొంది. ఇజ్రాయెల్ సరిహద్దుకు కేవలం 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న 'మజ్దల్ జౌన్' అనే గ్రామంలోని భారీ పర్వతం కింద ఈ సొరంగాల నెట్‌వర్క్‌ను గుర్తించినట్లు సైనిక వర్గాలు వెల్లడించాయి.



'ది టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్' కథనం ప్రకారం ఇరాన్ నుంచి దిగుమతి చేసుకున్న విడిభాగాలతో ఇక్కడ డ్రోన్లను అసెంబుల్ చేయడంతో పాటు వాటిని ఇజ్రాయెల్‌పైకి ప్రయోగించేందుకూ ఈ కేంద్రాన్ని హెజ్బొల్లా ఉపయోగించేది. ఇరాన్ ప్రత్యక్ష నిధులు, ప్రణాళికతో గత దశాబ్దకాలంగా ఈ కేంద్రాన్ని నిర్మించినట్లు ఇజ్రాయెల్ సైన్యం పేర్కొంది.

**పర్వతం కింద దాగివున్న వైమానిక స్థావరం**

జర్నలిస్టులను ఈ ప్రాంతానికి తీసుకెళ్లిన ఇజ్రాయెల్ మిలిటరీ అధికారులు అక్కడి పరిస్థితులను వివరించారు. ఈ సొరంగాల కాంప్లెక్స్.. పర్వతం లోపలికి వందల మీటర్ల పొడవున వ్యాపించి ఉంది. ఇది భూగర్భంలో దాదాపు 29 మీటర్ల లోతులో నిర్మితమైంది. భారీ పేలుళ్లను తట్టుకునే తలుపులతో ఈ కేంద్రాన్ని డిజైన్ చేశారు. ఇప్పటివరకు హెజ్బొల్లాకు సంబంధించి కనుగొన్న సొరంగాల అన్నిటికంటే ఇది అత్యంత అత్యాధునికమైనదని సైన్యం తెలిపింది.

**భారీ పేలుడు పదార్థాలు, డ్రోన్లు స్వాధీనం**

ఈ భూగర్భ ఫ్యాక్టరీలో ఇజ్రాయెల్ సైన్యానికి భారీగా ఆయుధ సంపత్తి దొరికింది. దాదాపు 30 కిలోల బరువున్న పేలుడు పదార్థాలు అమర్చిన సుమారు 50 డ్రోన్లను సైన్యం స్వాధీనం చేసుకుంది. ఇవి ఇజ్రాయెల్‌లోని ఏ ప్రాంతంపైన అయినా దాడి చేయగల సామర్థ్యం ఉన్నవని అధికారులు తెలిపారు. వీటితో పాటు సొరంగం లోపల దాదాపు 8 టన్నుల అత్యంత ప్రమాదకర రమైన పేలుడు పదార్థాలను కూడా కనుగొన్నారు. ఇలాంటి డ్రోన్లు పూర్తిగా సురక్షితమైన స్థితిలో ఇజ్రాయెల్ దళాల చేతికి చిక్కడం ఇదే



మొదటిసారి. దీనివల్ల హెజ్బొల్లా సాంకేతిక సామర్థ్యానికి సంబంధించిన కీలక ఇంటెలిజెన్స్ సమాచారం సేకరించే అవకాశం దక్కిందని ఆర్మీ అధికారి ఒకరు తెలిపారు.

**భూగర్భం నుంచే నేరుగా ప్రయోగాలు**

ఈ స్థావరాన్ని డ్రోన్ ఫ్యాక్టరీ, 'ఎయిర్‌బేస్' కలయికగా సైన్యం అభివర్ణించింది. పర్వతపు దక్షిణ భాగంలో డ్రోన్లను ప్రయోగించడానికి వీలుగా ప్రత్యేక లాంచ్ షాఫ్ట్‌లను ఏర్పాటు చేశారు. 'సొరంగం చివరన పట్టాలపై కదిలే బ్లాస్ట్ డోర్లతో అత్యంత పటిష్టమైన నాలుగు ఎగ్జిట్ పాయింట్లు ఉన్నాయి. అవసరమైనప్పుడు ఈ తలుపులు తెరిచి, ఇజ్రాయెల్ వైపు నేరుగా యూఏవీలను (డ్రోన్లను) ప్రయోగించే వీలుంది' అని ఐడీఎఫ్ యాహలోమ్ కాంబాట్ ఇంజినీరింగ్ యూనిట్ కమాండర్ వివరించారు. 2024లో జరిగిన ఘర్షణల సమయంలోనే ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో ఈ ప్రాంతం పాక్షికంగా దెబ్బతిన్నప్పటికీ, ఆ తర్వాత హెజ్బొల్లా దీనిని పునరుద్ధరించడానికి ప్రయత్నించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ సొరంగ నెట్‌వర్క్‌లో ఇజ్రాయెల్ సైన్యం పూర్తిస్థాయి దర్యాప్తును ముగించింది. తనిఖీలు పూర్తయిన తర్వాత ఈ భూగర్భ కాంప్లెక్స్‌ను పూర్తిగా పేల్చివేయనున్నట్లు ఆర్మీ ప్రకటించింది.



# అంతా ముగిసింది

## టెస్ట్ క్రికెట్లో రీ ఎంట్రీపై విరాట్ కోహ్లీ

భారత స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ టెస్టు, టీ20 ఫార్మాట్లకు వీడ్కోలు పలికి కేవలం వన్డేల్లోనే కొనసాగుతున్న సంగతి తెలిసిందే. అయితే కొంతకాలంగా అతడు రీ ఎంట్రీ ఇవ్వనున్నట్టు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఓ కార్యక్రమంలో ఈ విషయమై విరాట్‌కు ప్రశ్న ఎదురైంది. కాగా అతడు ఇచ్చిన సమాధానం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ఢిల్లీలో కోహ్లీ తన సొంత బ్రాండ్ వన్8 స్పోర్ట్స్ వేర్‌ను ప్రారంభించాడు. ఈ సందర్భంగా అతడికి టెస్టు క్రికెట్ రీ ఎంట్రీపై ప్రశ్న ఎదురైంది. 'మీ టెస్టు పరుగుల సంఖ్య 9,230. ఇదే ధరతో మన బ్రాండ్‌లో షూ ఉంది. మరికొన్ని టెస్టులు ఆడి పరుగులు పెంచి ఆ షూ విలువ కూడా పెంచాలని అనుకుంటున్నారా?' అని వ్యాఖ్యాత డానిష్ సైత్ ప్రశ్నించాడు. దీనికి సరదాగా స్పందిస్తూ.. 'అమ్మకాలు తక్కువైనా పర్వాలేదు. టెస్టు క్రికెట్‌తో నా పని అయిపోయింది. అదంతా అప్పుడే ముగిసిపోయింది' అని కోహ్లీ సమాధానమిచ్చాడు.

### నాకెంతో ప్రత్యేకం: విరాట్

వన్8 బ్రాండ్‌ను ప్రారంభించిన తర్వాత కోహ్లీ తన క్రికెట్ ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. 'నా జీవితంలో అన్నీ ఢిల్లీలోనే ప్రారంభమయ్యాయి. ఇక్కడే పుట్టాను.. ఇక్కడే క్రికెట్ ఆడటం మొదలుపెట్టాను. అందుకే ఢిల్లీలోనే వన్8 బ్రాండ్‌ను ప్రారంభించాలని అనుకున్నా. ఇది నాకు ఎంతో ప్రత్యేకమైనది. అభిమానుల ప్రేమ, మద్దతు వల్లే ఈ స్థాయికి చేరుకున్నాను' అని విరాట్ వెల్లడించాడు.



# 92 ఏళ్ల నిరీక్షణ...

## ఫిఫా వరల్డ్ కప్‌లో ఈజిప్ట్‌కు తొలి విక్టరీ

న్యూయార్క్: ఫిఫా వరల్డ్‌కప్‌లో ఈజిప్ట్ విక్టరీ కొట్టింది. న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 3-1 గోల్స్ తేడాతో విజయం సాధించింది. ఓ దశలో వెనుకబడ్డ ఈజిప్ట్ ఆ తర్వాత పుంజుకుని వరల్డ్ కప్‌లో చరిత్ర సృష్టించింది. వరల్డ్ కప్‌లో అరంగేట్రం చేసిన దాదాపు 92 ఏళ్ల తర్వాత ఆ దేశం తొలిసారి మ్యాచ్ నెగ్గింది. ఆ జట్టులో మొహమ్మద్ సలేహ్ కీలక ప్లేయర్‌గా నిలిచాడు. ఓ గోల్ చేయడంతో పాటు మరో గోల్‌కు అసిస్ట్ చేశాడు. దీంతో వరల్డ్ కప్ చరిత్రలో తొలిసారి ఓ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. గ్రూప్ -జి నుంచి పోటీపడుతున్న ఈజిప్ట్.. టోర్నీ చరిత్రలో తొలిసారి రెండో దశకు క్వాలిఫై అయ్యే అవకాశాలున్నాయి. ఫస్ట్ హాఫ్‌లో న్యూజిలాండ్ లీడ్ తీసుకుంది. ఫిన్ సుర్మన్ ఓ గోల్ చేశాడు. 15వ నిమిషంలోనే గోల్ కొట్టి జట్టుకు ఆధిక్యాన్ని ఇచ్చాడు. కానీ సెకండ్ హాఫ్‌లో ఈజిప్ట్ ప్లేయర్లు దుమ్మురేపారు. కేవలం 24 నిమిషాల వ్యవధిలోనే మూడు గోల్స్ చేశారు. దీంతో గ్రూప్-జి నుంచి ఆ జట్టు ప్రస్తుతం టాప్‌లో నిలిచింది. ఈజిప్ట్ నాలుగోసారి వరల్డ్‌కప్ ఆడుతోంది. 1934లో తొలిసారి ఆ దేశం వరల్డ్ కప్ ఆడింది. ఒకవేళ శనివారం ఇరాన్‌తో జరిగే మ్యాచ్‌లో ఆ దేశం గెలిస్తే వాళ్లు గ్రూప్ నుంచి నాకౌట్‌కు అర్హత సాధించే అవకాశాలున్నాయి. ఈ టోర్నీలో న్యూజిలాండ్ ఇంకా తన ఖాతా తెరవలేదు. ఆ జట్టు శనివారం బెల్జియంతో ఆడనున్నది.

## ఇంగ్లండ్‌కు డబుల్ స్ట్రోక్... డబ్ల్యూటీసీలో 12 పాయింట్ల కోత..!

కెన్నింగ్‌టన్ ఓవల్ టెస్టులో భారీ తేడాతో ఓడిన ఇంగ్లండ్‌కు మరో షాక్. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో ఆ జట్టు ఏకంగా 12 పాయింట్లు కోల్పోయింది. న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో జో రూట్ సారథ్యంలోని ఆతిథ్య జట్టు.. స్లో ఓవర్ రేటు కారణంగా డజన్ పాయింట్ల జరిమానా పడింది. అంతేకాదు మ్యాచ్ ఫీజులో సగం పైసలే దక్కనున్నాయి. అసలే 253 పరుగుల తేడాతో దారుణంగా ఓడిన బాధలో ఉన్న ఇంగ్లండ్‌కు ఇది మింగుడుపడని విషయమే. కెన్నింగ్‌టన్ ఓవల్ టెస్టులో నిర్ణీత సమయం కోటా పూర్తి చేయలేదు. ఐసీసీ నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం 12 ఓవర్ల లోటుకు 12 పాయింట్లు కోత విధించాడు రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్. దాంతో డబ్ల్యూటీసీ 2025-27లో ఇంగ్లండ్ కీలకమైన 12 పాయింట్లు కోల్పోయింది. ఫలితంగా 38 పాయింట్లతో పాయింట్ల పట్టికలో ఆ జట్టు ఏడో స్థానంలో నిలిచింది. ఇది చాలదన్నట్టు.. స్లో ఓవర్ రేటు మూలంగా ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బందికి మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత పడింది.



# వైల్డ్ కార్డ్ ఎంట్రీ

## మళ్లీ టెన్నిస్ కోర్టులోకి సెరెనా విలియమ్స్

టెన్నిస్ దిగ్గజం సెరెనా విలియమ్స్ మరోసారి వింబుల్డన్ కోర్టులో సందడి చేయనుంది. నాలుగేళ్ల తర్వాత రీఎంట్రీ ఇచ్చిన ఆమె డబుల్స్ విభాగంలో వీనస్ విలియమ్స్‌తో కలిసి బరిలోకి దిగనున్నట్టు అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా వింబుల్డన్ చాంపియన్‌షిప్ సింగిల్స్ విభాగంలో కూడా చోటు దక్కించుకుంది. వైల్డ్ కార్డ్ ద్వారా వింబుల్డన్ సింగిల్స్ మహిళల విభాగంలో సెరెనా టెన్నిస్ కోర్టులో అడుగుపెట్టనుంది.

23 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ విజేత సెరెనా.. 2022 యూఎస్ ఓపెన్ తర్వాత ప్రొఫెషనల్ టెన్నిస్‌కు దూరమైన సంగతి తెలిసిందే. అధికారికంగా రిటైర్‌మెంట్ ప్రకటించకపోవడంతో ఆమె పునరాగమనంపై ఊహాగానాలు వినిపించేవి. తాజాగా వింబుల్డన్ నిర్వాహకులు ఆమెకు సింగిల్స్ వైల్డ్‌కార్డ్ ఇవ్వడంతో ఆ ఊహాగానాలకు తెరపడింది. సింగిల్స్‌లో బరిలోకి దిగడానికి తన కుమార్తె ఒలింపియా ప్రధాన కారణమని సెరెనా వెల్లడించింది. ఒలింపియా ప్రోత్సాహం వల్లే తిరిగి టెన్నిస్ కోర్టులో అడుగుపెడుతున్నట్టు తెలిపింది.

1998లో వింబుల్డన్‌లో అరంగేట్రం చేసిన సెరెనా.. 2002, 2003, 2009, 2010, 2012, 2015, 2016 సంవత్సరాల్లో ఏకంగా ఏడు సింగిల్స్ టైటిళ్లు గెలుచుకుని చరిత్ర సృష్టించింది. వీనస్‌తో కలిసి ఆరు డబుల్స్ టైటిళ్లు కూడా కైవసం చేసుకుంది. 44 ఏళ్ల వయసులో ఇద్దరు పిల్లల తల్లిగా మారిన తర్వాత తిరిగి గ్రాండ్‌స్లామ్ వేదికపై అడుగుపెడుతున్న సెరెనా.. టెన్నిస్ ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారింది.

# మహిళా క్రికెటర్లకు తీపి కబురు

## 'అమ్మ'గా ఆటలో రాణించేందుకు అండగా ఐసీసీ

మహిళా క్రికెటర్లకు మరింత భరోసా కల్పించే దిశగా అంతర్జాతీయ క్రికెట్ మండలి మరో ముందడుగు వేసింది. మాతృత్వ దశలో మహిళా క్రికెటర్లకు ఆర్థికంగా, వైద్యపరంగా సాయం అందించేందుకు ఐసీసీ సిద్ధమవుతోంది. బిడ్డను కన్న తర్వాత అమ్మగా మళ్లీ క్రికెట్ ఆడే వారికోసం కొన్ని మార్గదర్శకాలు రూపొందించింది. మహిళా ప్లేయర్లు పిల్లలకు జన్మనివ్వడం నుంచి.. మళ్లీ మైదానంలోకి దిగేంత వరకు వారికి పెద్దన్నలా అన్ని విధాలా సాయం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఐసీసీ వెల్లడించింది.



పురుష క్రికెటర్లతో సమానంగా మహిళా క్రికెటర్లకు వేతనాలు చెల్లిస్తున్న ఐసీసీ మరో కీలక నిర్ణయం తీసుకుంది. తల్లి అయిన తర్వాత మళ్లీ క్రికెట్ ఆడాలనుకునే ప్లేయర్లకు అడుగడుగునా భరోసాగా నిలవనుంది. గర్భం దాల్చిన అనంతరం, ఆపై ప్రసవం అనంతరం శారీరక, మానసిక మార్పులకు లోనయ్యే మహిళా క్రికెటర్లకు అనుకూలమైన వాతావరణంలో శిక్షణ ఇవ్వాలని ఐసీసీ భావిస్తోంది. వారి పిల్లలను చూసుకోవడం, గర్భిణులకు రవాణా, మెడిసిన్ ఖర్చులు భరించడం వంటివి చూసుకోనుంది. చాలా మంది క్రికెటర్లు కెరీర్ సమయంలోనే వైవాహిక జీవితంవైపు మొగ్గు చూపిస్తున్న నేపథ్యంలో ఐసీసీ ఈ నిర్ణయాలను అనుసరించాలనుకుంటోంది. ఆస్ట్రేలియా మహిళల జట్టు డాక్టర్ ఫిలిప్పా ఇంగే నేతృత్వంలోని ఐసీసీ వైద్య సలహా కమిటీ సూచనల మేరకు ఈ కార్యాచరణను రూపొందించారు.

### ఆరు దశలు...

కాన్పు అనంతరం క్రికెట్ ఆడేందుకు సిద్ధపడే వారికోసం ఆరు దశల ప్రణాళిక ఉంది. రెడీ, రివ్యూ, రిస్టోర్, రీ-కండీషన్, రిటర్న్, రిఫైన్.. ఈ ఆరు విధానాలను అనుసరించి అమ్మలైన క్రికెటర్లను తిరిగి ఆటవైపు మళ్లించాలని ఐసీసీ భావిస్తోంది. అందుకోసం డాక్టర్ లేదా ఫిజియోథెరపిస్ట్‌ను నియమించనున్నారు. మూడో ట్రెమిస్టర్.. కాన్పు తర్వాత ఆరు లేదా ఎనిమిది వారాలకు క్రికెట్ సన్నాహకాలు ప్రారంభించడం వంటివి ఫిజియోథెరపిస్ట్ చూసుకుంటారు. 2021లో బిడ్డను కన్న వెస్టిండీస్ స్పిన్నర్ అఫీ ఫ్లెచర్ ఇప్పుడు క్రికెట్ ఆడుతోంది. ఫ్లెచర్ మాదిరిగానే మరి కొందరు మాతృత్వం అనంతరం ఏ ఇబ్బందులూ లేకుండా మైదానంలో మెరిసేలా ఐసీసీ చొరవ చూపిస్తోంది.

# టార్గెట్... వన్డే ప్రపంచ కప్ 2027

### టీమిండియా రోడ్ మ్యాప్ రెడీ

### బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా

వచ్చే 2027 వన్డే ప్రపంచ కప్ టోర్నీ కోసం టీమిండియాకు ఒక నిర్దిష్టమైన ప్రణాళిక (రోడ్ మ్యాప్) రూపకల్పన ప్రారంభమైందని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించారు. మెగా టోర్నీకి ముందు భారత జట్టు తగినన్ని 50 ఓవర్ల (వన్డే) క్రికెట్ మ్యాచ్‌లు ఆడేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. వచ్చే ఏడాది అక్టోబరులో ఈ ప్రతిష్టాత్మక టోర్నీ ప్రారంభం కానుందని పేర్కొన్న ఆయన ఇప్పటికే ఇంగ్లాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌ను భారత్ ఆడనుందని చెప్పారు. ఈ సిరీస్ జులై 14 నుంచి 19 వరకు జరగనుంది. రాబోయే కాలంలో టీమిండియా కోసం మరిన్ని వన్డే మ్యాచ్‌లను నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, తగినంత మ్యాచ్ ప్రాక్టీస్ లభించడం వల్ల ప్రపంచ కప్ గెలిచే అవకాశాలు మెరుగవుతాయని సైకియా ఆశాభావం వ్యక్తం చేశారు.



### వీరంతా ఉంటారు...

"ప్రపంచ కప్ నెగ్గడమే టీమిండియా ఏకైక లక్ష్యం. అందుకోసం పక్కా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఈ రోడ్‌మ్యాప్ తయారీలో హెడ్ కోచ్, చీఫ్ సెలెక్టర్ నుంచి సహాయక సిబ్బంది (సపోర్ట్ స్టాఫ్) వరకు ప్రతి ఒక్కరూ భాగస్వాములవుతారు. అంతర్జాతీయ స్థాయిలో జరిగే అతిపెద్ద ఈవెంట్‌కు వెళ్లేటప్పుడు ఆటగాళ్లకు మంచి సన్నద్ధత అవసరం. ఆ విషయంలో టీమిండియాకు కావాల్సినవన్నీ చేసేందుకు బీసీసీఐ ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుంది" అని దేవజిత్ సైకియా స్పష్టం చేశారు.

# మెగాస్టార్ సెట్స్‌లో రామ్‌చరణ్..

'వాల్తేరు వీరయ్య' తర్వాత మెగాస్టార్ చిరంజీవి, బాబీ కొల్లి కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'మెగా 158'. హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కు తున్న ఈ సినిమా ఇప్పటికే మొదటి షెడ్యూల్‌ను విజయవంతంగా ముగించుకుని, ప్రస్తుతం రెండో విడత చిత్రీకరణను శరవేగంగా జరుపుకుంటోంది. ఇటీవ లే షూటింగ్ సెట్స్ నుంచి కొన్ని ఆసక్తికరమైన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమవడంతో అభిమానుల్లో సరికొత్త ఉత్సాహం నెలకొంది. అయితే అందరూ ఎంతగానో నిరీక్షిస్తున్న చిరంజీవి మాత్రం ఈ లీకైన చిత్రాలలో ఎక్కడా దర్శనమివ్వక పోవడం విశేషం. దీని వెనుక డైరెక్టర్ ఒక పక్కా వ్యూహాన్ని అమలు చేస్తున్నారంటూ సినీవర్గాల్లో ఆసక్తికరమైన చర్చ నడుస్తోం ది. సాధారణంగా పెద్ద నటుల చిత్రాలకు సంబంధించిన చిన్న అప్‌డేట్ వచ్చినా నెట్టింట విపరీతమైన ట్రెండింగ్ అవుతుంది. ముఖ్యంగా హీరో సరికొత్త మేకోవర్ లేదా గెటప్‌కు సంబంధించిన



గ్లింప్స్ లీకైతే ప్రమోషన్స్‌పై ఆ ప్రభావం పడుతుంది. అందుకే ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ విషయంలో చిత్ర యూనిట్ ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు స్పష్టమవుతోంది. ఫాదర్స్ డే సందర్భంగా మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్ తన తండ్రిని కలవడానికి షూటింగ్ స్పాట్‌కు వెళ్లాడు. ఈ ఆత్మీయ కలయికకు సంబంధించిన కొన్ని బిహైండ్ ది సీన్స్ ఫొటోలను దర్శకుడు బాబీ సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. మెగా వారసుడు సెట్స్‌లో సందడి చేసిన ఆ ఫొటోలు క్షణాల్లో వైరల్‌గా మారినప్ప టికీ వాటిలో ఒక్క ఫ్రేమ్‌లో కూడా మెగాస్టార్ కనిపించకుండా జాగ్రత్తపడటం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ సస్పెన్స్ వెనుక చిరు గెటప్‌ను అత్యంత గోప్యంగా ఉంచాలనే మేకర్స్ దృఢ సంకల్పం కనిపిస్తోంది.

# 'మా ఇంటి బంగారం' ఫస్ట్ వీకెండ్ అదుర్స్



సమంత ప్రధాన పాత్రలో బి.వి.నందినిరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన కుటుంబ కథా చిత్రం 'మా ఇంటి బంగారం' బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. రాజ్ నిడిమోరు సృష్టించిన కథతో ట్రాలాల మూవీ పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమాకు మొదటి ఆట నుంచే ప్రేక్షకుల నుంచి బ్రహ్మాండమైన రెస్పాన్స్ వస్తోంది. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్, మహిళా ఆడియెన్స్ థియేటర్లకు క్యూ కడుతుండటంతో ఈ చిత్రం మొదటి వీకెండ్‌లోనే బాక్సాఫీస్‌ను ఇరక్కొట్టేసింది. రిలీజ్ అయిన మొదటి మూడు రోజుల్లోనే ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా ఏకంగా రూ. 43 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్ సాధించి సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. సినిమా పేరుకు తగ్గట్టే బాక్సాఫీస్ వద్ద నిజంగానే 'బంగారం' లాంటి వసూళ్లను రాబడుతూ 'బ్లాక్‌బస్టర్ బంగారం' గా దూసుకుపోతోంది. సంతోష్ నారాయణన్ అందించిన అద్భుతమైన సంగీతం, ఓం ప్రకాష్ విజువల్స్ ఈ సినిమా విజయానికి ప్రధాన బలంగా నిలిచాయి. సినిమా సక్సెస్‌తో ఫుల్ జోష్‌లో ఉన్న చిత్రబృందం, తాజాగా ఒక ప్రత్యేకమైన పోస్టర్‌ను విడుదల చేసింది.

# ఆ సినిమా క్లైమాక్స్ చూసి రిమోట్ పగలకొట్టా..



సీనియర్ నటుడు ఆనంద్ భారతి గురించి తెలుగు ప్రేక్షకు లకు ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. మణిర త్నం దర్శకత్వంలో తెరకెక్కిన దొంగ దొంగ సినిమాలో ప్రశాంత్ తో పాటు మరో హీరోగా నటించి మెప్పించాడు. ఆ తరువాత తెలుగు, తమిళ్ భాషల్లో హీరోగా, విలన్‌గా కనిపించిన ఆనంద్.. ప్రస్తుతం స్టార్ హీరోలకు తండ్రిగా నటిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకుంటున్నాడు. సినిమాలే కాకుండా సీరియల్స్‌లో కూడా ఆనంద్ సత్తా చాటుతున్నాడు. ప్రెజెంట్ స్టార్ మాలో ప్రసారమ వుతోన్న పొదరిల్లు సీరియల్‌లో హీరోయిన్ తండ్రిగా నటిస్తున్నాడు. ఇక సినిమాల విషయానికొస్తే సత్యదేవ్ – వెంకటేష్ మహా కాంబోలో వస్తోన్న రావు బహదూర్ సినిమాలో కీలక పాత్రలో నటిస్తున్నాడు. జూలై 3న ఈ సినిమా రిలీజ్ కి సిద్ధమవుతోంది. తాజాగా ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఆనంద్ ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్నాడు. ఈ ఇంటర్వ్యూలో ఆనంద్.. వెంకటేష్ మహా డైరెక్షన్ అంటే తనకు చాలా ఇష్టమని, అతని ఫోటోను ప్రింట్ తీయించి బెడ్ రూమ్‌లో పెట్టుకున్నట్లు తెలిపాడు. అంతలా అతన్ని అభిమానించడానికి కారణం కూడా చెప్పుకొచ్చాడు. కేరాఫ్ కంచరపాలెం ఎన్నిసార్లు చూశానో నాకే తెలియదు. అదొక కావ్యం అని చెప్పొచ్చు. ఒక బెస్ట్ మూవీ. కొవిడ్ సమయంలో ఆ సినిమా చూసి.. రిమోట్‌ని నేలకేసి కొట్టాను. అది నాలుగు ముక్కలు అయింది. రిమోట్, రెండు బ్యాటరీలు, కవర్ మొత్తం కలిపి నాలుగు అయ్యాయి. అలా నాలుగు క్యారెక్టర్లు ఒక్కరే. అసలు ఏం చేశార్రా. అందులో ఎవరికీ డౌట్ రాకుండా.. ఒకరు హిందూ, ఒకరు క్రిస్టియన్, ఒకరు ముస్లిం, ఒకరు నాస్తికుడు.. ఐడెమ్ స్క్రిప్ట్ అని నాకు పిచ్చెక్కింది. అలా బాల్కనీలోకి వెళ్లి నుంచుంటే.. ఒక సినిమా కోసం ఇంతలా ఆలోచించాలా అని నా భార్య అంటే ఆమె మీద కూడా అరిచాను. అసలు ఎవరు ఈ సినిమా తీసింది అని చూస్తే వెంకటేష్ మహా. మణిరత్నం సినిమాలో చేయాలి అనేది వదిలేసి.. ఎలాగైనా వెంకటేష్ మహా సినిమాలో చేయాలని ఆయనకు కాల్ చేశాను. కానీ, ఆయన తీయలేదు. ఇక ఆయన ఫోటో ప్రింట్ తీసి బెడ్ రూమ్‌లో పెట్టుకొని రోజు దేవుడిని కోరుకొనేవాడిని. ఒకరోజు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఫోన్ చేసి.. డైరెక్టర్ వెంకటేష్ మహా మాట్లాడతారని చెప్పాడు. నేను నా ఫ్రెండ్స్ ఎవరో ఏడిపిస్తున్నారు అనుకున్నాను. ఆ తరువాత ఆయన మాట్లాడి రావు బహదూర్ కథ చెప్పాడు. చాలామంది కథ. ఈ క్లైమాక్స్ కూడా పిచ్చెక్కిపోతుంది' అని తెలిపాడు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్ గా మారాయి.

# మైత్రీ ద్వారా రాజా ది రాజా విడుదల



కొత్త హీరోయిన్లు సినిమాలు బ్యాక్ టు బ్యాక్ రావడం అంటే విశేషమే. విశాఖ ధీమన్ నటించిన రెండు సినిమాలు అలా ఒకే నెలలో రెండు వారాల గ్యాప్‌తో రాబోతున్నాయి. ఆమె నటించిన 'రాజా ది రాజా' మూవీ జూలై 17న విడుదల కాబోతుండగా, 'దీవానా' ఫేమ్ హర్షిత్‌రెడ్డి సరసన నటించిన 'రోమియో జూలియె ట్' మూవీ జూలై 31న విడుదల కాబో తోంది. ఇక మొదటి చిత్రానికి వస్తే... రుత్విక్, విశాఖ ధీమన్ జంటగా నటిస్తున్న యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'రాజా ది రాజా'. వృందా వన్ క్రియేషన్స్ బ్యానర్‌పై కె.నిహారికా దాసరి ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, కె.శ్రీలతా రెడ్డి సమర్పిస్తున్నారు. ఈ సినిమాను అనిల్ బోయిడపు డైరెక్ట్ చేశారు. తాజాగా చిత్ర బృందం ఈ సినిమాను జూలై 17న విడుదల చేయను న్నట్లు అధికారికంగా ప్రకటించింది. ప్రముఖ నిర్మాణ, పంపిణీ సంస్థ మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి ముందుకు రావడం విశేషం. దీంతో సినిమా మరింత గ్రాండ్ గా ప్రేక్షకులను చేరుకునే అవకాశం లభించినట్లయిందని మేకర్స్ తెలిపారు. రిలీజ్ డేట్ పోస్టర్‌లో హీరో, హీరోయిన్ మధ్య కెమిస్ట్రీతో పాటు వారి సరదా ప్రయాణాన్ని హైలైట్ చేశారు. కలర్ ఫుల్ విజువల్స్, ఆకట్టుకునే డిజైన్ చిత్రంలోని రొమాంటిక్ మూడ్‌ను ప్రజెంట్ చేస్తోంది. రుత్విక్, విశాఖ ధీమన్ ఉత్సాహంగా, ఎనర్జీతో కనిపిస్తున్నారు.

# ఆ ప్రకటనలు నమ్మొద్దు..

# 'వెంకీఅనిల్5' టీమ్ హెచ్చరిక



టాలీవుడ్ సీనియర్ హీరో విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్‌రామ్, బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కలయికలో తెరకెక్కుతోన్న తాజా చిత్రం చుట్టూ సోషల్ మీడియాలో కొన్ని నకిలీ క్యాస్టింగ్ కాల్స్ చక్కర్లు కొడుతున్నాయి. ఈ సినిమా పేరుతో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు నకిలీ ఆడిషన్స్ ప్రకటనలను సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థలైన 'షైన్ స్క్రీన్స్', 'జెడ్ స్టూడియోస్' దృష్టికి రావడంతో వెంటనే యూనిట్ రియాక్టైంది. సదరు నకిలీ క్యాస్టింగ్ కాల్స్‌కు తమ చిత్ర బృందానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేస్తూ ఒక అధికారిక ప్రకటనను విడుదల చేసింది. సినిమాల్లో అవకాశాల కోసం ఎదురుచూసే వారు ఇలాంటి మోసపూరిత ప్రకటనలను నమ్మి మోసపోవద్దని చిత్ర బృందం విజ్ఞప్తి చేసింది. తమ సినిమా తరఫున క్యాస్టింగ్ పేరుతో సంప్రదిస్తున్న వ్యక్తులకు ఎవరూ కూడా తమ వ్యక్తిగత వివరాలు, ఫోటోలు, ఆధార్ వంటి పత్రాలు లేదా డబ్బులు ఇవ్వవద్దని గట్టిగా కోరింది. ఇలాంటి మోసగాళ్ల బారిన పడకుండా అప్రమత్తంగా, జాగ్రత్తగా ఉండాలని సినిమా పరిశ్రమలోకి రావాలనుకునే వారికి సూచించింది. తమ చిత్రానికి సంబంధించిన ఏవైనా అధికారిక క్యాస్టింగ్ ప్రకటనలు ఉంటే అవి కేవలం తమ అధికారిక, ధృవీకరించబడిన సోషల్ మీడియా హ్యాండిల్స్ ద్వారా మాత్రమే ప్రకటించబడతాయని మేకర్స్ స్పష్టం చేశారు. సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రానికి జి.వి.ప్రకాష్ సంగీతం అందిస్తున్నారు. కేవలం అధికారిక ఛానెల్స్ నుంచి వచ్చే సమాచారాన్ని మాత్రమే నమ్మాలని చిత్ర బృందం మరోసారి స్పష్టం చేసింది. వెంకీ సరసన కీర్తి సురేష్, కళ్యాణ్ రామ్ సరసన కృతి శెట్టి హీరోయిన్లుగా నటిస్తోన్న ఈ చిత్రం ఇటీవల పూజా కార్యక్రమాలతో గ్రాండ్‌గా ప్రారంభమైన విషయం తెలిసిందే. సినిమా అలా సెట్స్‌పైకి వెళ్లిందో, లేదో నకిలీ క్యాస్టింగ్ కాల్ దర్శనమివ్వడంతో వెంటనే చిత్ర బృందం అలెర్ట్ అయింది.